శనివారం
19•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 204
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఆదర్శ అసెంబ్లీగా

తీర్చిదిద్దుదాం

సభ్యులందరి సహకారం ముఖ్యం

ఏకగ్రీవ ఎన్నికకు ధన్యవాదాలు.. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

రాష్ట్ర అసెంబ్లీ రెండో స్పీకర్ పోచారం

పోచారం ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించిన ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్

స్వయంగా తోడ్కొని వెళ్లిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, పీసీసీ నేత ఉత్తమ్, ఎమ్మెల్యేలు ఈటల, బలాల



శుక్రవారం శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోచారం శ్రీనివాస్ రెడ్డిని అభినందిస్తున్న ప్రొటెం స్పీకర్ అహ్మద్‌ఖాన్, సీఎం కే చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- పోచారం హయాంలోనే రైతుబంధు, రైతుబీమా
- వ్యవసాయశాఖను ఆయన నిర్వహించిన కాలం ఉజ్వల ఘట్టం
- అందుకే ఆయనను లక్ష్మీపుత్రుడని పిలుచుకుంటా: సీఎం కేసీఆర్
- నేడు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ అసెంబ్లీని ఆదర్శవంతమైన శాసనసభగా తీర్చిదిద్దుకుందామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో సభ్యులందరూ సహకరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. 'అసెంబ్లీని ప్రజా సమస్యలు చర్చించే వేదికగా నడుపుకోవడం మనందరి బాధ్యత. ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం, సభకు అంతరాయం కలిగించడం గౌరవప్రదం కాదు. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా సభ నిర్వహించుకుందాం. ప్రజలకు న్యాయం చేసే క్రమంలో మీరంతా నాకు సహకరిస్తారని ఆశిస్తున్నాను. అందరం కలిసి మిగతా 2వ పేజీలో



టీమ్ ఇండియా విజయోత్సాహం

భారత్ కొత్త చరిత్ర

- ఆస్ట్రేలియాలో తొలిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్ కైవసం
- సిరీస్ కోల్పోని మొదటి పర్యాటక జట్టుగా కోహ్లీసేన కొత్త రికార్డు
- ధోనీ, జాదవ్ అర్ధసెంచరీలు
- మెల్‌బోర్న్ వన్డేలో టీమ్‌ఇండియా ఘన విజయం

వివరాలు ఆటలో



సీఎల్పీ నేతగా భట్టి

అధికారికంగా ఏఐసీసీ లేఖ విడుదల 3

2.25 లక్షల కోట్లు.. | 1.25 కోట్ల ఎకరాలు

- రైతులకు సాగునీరు ప్రథమ ప్రాధాన్యం
- మరింత వేగంగా తమ్మిడిహట్టి బరాజ్ పనులు
- పెద్దవాగు నీటి సద్వినియోగానికి వ్యూహం
- వచ్చేనెలలో పాలమూరు, డిండి పనులు పరిశీలిస్తా
- కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో మొదట చెరువులు నింపాలి
- సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో సీఎం కేసీఆర్
- ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరత లేదని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించేందుకుగాను రూ.2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైతులకు సాగునీరు అందించడానికన్నా మించిన ప్రాధాన్యం మరొకటి లేదని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరతలేదని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. వెంట వెంటనే బిల్లులు చెల్లించనున్నట్లు వెల్లడించారు. తమ్మిడిహటి వద్ద బరాజ్ నిర్మించడంతో పాటు పెద్దవాగు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి సమగ్ర వ్యూహం రూపొందించుకొని నిర్మాణాలు ప్రారంభించాలని మిగతా 2వ పేజీలో



శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పీ భూపతిరెడ్డి కూడా ఉన్నారు.

16 సీట్లే టార్గెట్

ఢిల్లీలో నిర్ణయాత్మక శక్తిగా టీఆర్‌ఎస్ ఎదగాలి

ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషిచేయాలి: కేటీఆర్

టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి 3

మూడో విడుత పంచాయతీకి నామినేషన్లు పూర్తి

తొలివిడుత ప్రచారానికి నేటితో తెర 9

మార్చి మొదటివారంలో లోక్‌సభ షెడ్యూల్!

పోలింగ్ దశలు, తేదీల ఖరారుపై ఈసీ కసరత్తు 5



అసెంబ్లీ స్పీకర్‌గా ఎంపికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పోచారం వెంట ఆయన కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. స్పీకర్‌గా ఎన్నికైన పోచారంను గవర్నర్ నరసింహన్ అభినందించారు. ఈ సందర్భంగా పోచారం తన రాజకీయ ప్రస్థానం గురించి గవర్నర్‌కు కొద్దిసేపు వివరించారు. అనంతరం స్పీకర్ కుటుంబసభ్యులతో గవర్నర్ ఫోటో దిగారు.

-నమస్తే తెలంగాణ, హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడుతా

- అత్యున్నత కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతా
- పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతానని, తెలంగాణ పౌరసరఫరాల సంస్థను రాష్ట్రంలోనే అత్యున్నత సంస్థగా తీర్చిదిద్దుతానని సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ పౌరసరఫరాల భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ.. పౌరసరఫరాల సంస్థ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో తనకు పూర్తి అవగాహన ఉన్నదని చెప్పారు. తాను రైతునే అని, ధాన్యం కొనుగోళ్లు మరింత పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.'పౌరసరఫరాల విభాగం ప్రభుత్వానికి చాలా కీలకమైంది. ఇది పూర్తిగా పేదలకు సంబంధించిన శాఖ. ఇటువంటి విభాగంలో పనిచేసే అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు' అని తెలిపారు. పౌరసరఫరాల శాఖ గతేడాది కన్నా ఈసారి వానకాలంలో 210 శాతం అధికంగా ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 38లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, ఇదొక రికార్డు అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులు, సకాలంలో వర్షాలు, 24గంటలు కరంట్, రైతు బంధు వంటి పథకాలు రాష్ట్రంలో ధాన్యం దిగుబడికి ప్రధాన కారణాలని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులతో భవిష్యత్తులో ధాన్యం దిగుబడి మరింత పెరుగనున్న నేపథ్యంలో రైతులకు కనీస మద్దతు ధర లభించేలా, కోటి టన్నులకు పైగా కొనుగోలు చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తామని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రులు హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్, టీఎస్‌ఐఐసీ చైర్మన్ బాలమల్లు, మేయర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేల సమక్షంలో పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆదర్శ అసెంబ్లీగా తీర్చిదిద్దుదాం

మొదటిపేజీ తరువాయి...

సభను ఆదర్శ శాసనసభగా తీర్చిదిద్దుదాం' అని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అసెంబ్లీ రెండో స్పీకర్‌గా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం సమావేశాలు ప్రారంభమైన తర్వాత స్పీకర్ ఎన్నికపై ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రకటన చేశారు. గురువారం సాయంత్రం ఐదుగంటల వరకు నామినేషన్లు తీసుకున్నామని, అన్ని పార్టీల సభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేరును ప్రతిపాదించారని తెలిపారు. సీఎం కేసీఆర్, సభ్యులు అజ్మీరా రేఖానాయక్, మల్లు భట్టివిక్రమార్క, తలసాని శ్రీనివాస్‌యాదవ్, అహ్మద్ బిన్‌అబ్దుల్లా బలాల.. స్పీకర్‌గా పోచారం పేరును ప్రతిపాదించారని చెప్పారు. మరో పోటీదారు లేకపోవడంతో పోచారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించగానే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, హోంమంత్రి మహమూద్ అలీ సహా సభ్యులంతా హర్షాధ్వానాలు చేశారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), ఈటల రాజేందర్ (టీఆర్‌ఎస్), అహ్మద్ బలాల (ఎంఐఎం) తదితరులు పోచారంను తోడ్కొని వెళ్లి స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. ప్రొటెం స్పీకర్ నుంచి పోచారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో సభ్యులంతా మర్యాదపూర్వకంగా లేచి నిలబడి హర్షధ్వానాలు చేశారు. సభాపతి బాధ్యతలు చేపట్టిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సీఎం కేసీఆర్, ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఈటల రాజేందర్, బలాల తదితరులు శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు. పార్టీలకు అతీతంగా పలువురు సభ్యులు పోచారం ఎన్నికపై సంతోషం వ్యక్తంచేశారు. తమకు పోచారంతో ఉన్న అనుబంధాన్ని సభలో పంచుకున్నారు. మంత్రిగా, నాయకుడిగా రాణించిన పోచారం.. స్పీకర్‌గా కూడా సమర్థంగా పని చేస్తారన్న ఆకాంక్షను వెలిబుచ్చారు.



శుక్రవారం అసెంబ్లీలో స్పీకర్‌గా ఎన్నికైన పోచారంను అభినందిస్తూ ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

వ్యవసాయశాఖ నిర్వహణ ఉజ్వల ఘట్టం:సీఎం కేసీఆర్

పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన కాలం ఉజ్వల ఘట్టమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభివర్ణించారు. ఆయన హయాంలో చేపట్టిన రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను ఒడిశా, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు అమలుచేస్తున్నాయని, అనేక రాష్ట్రాలు పరిశీలిస్తున్నాయని గుర్తుచేశారు. రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితిసైతం ప్రశంసించిందన్న కేసీఆర్..అదంతా ఆయన కాలుమోపిన వేళా విశేషమన్నారు. అందుకే ఆయనను లక్ష్మీపుత్రుడిగా పిలుచుకుంటానని పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తూ మాట్లాడిన కేసీఆర్..స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి సహకరించిన ప్రతిపక్ష సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 40 ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో అనేక మెట్లు అధిగమిస్తూ.. ఆరుసార్లు శాసనసభకు పోచారం ఎన్నికయ్యారని, పలుశాఖల మంత్రి పదవులు చేపట్టారని గుర్తుచేశారు. పోచారం వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నకాలంలో వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందన్నారు. శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ జీవితంలో వ్యవసాయశాఖ నిర్వహించడం ఉజ్వలమైన ఘట్టంగా పేర్కొన్నారు. క్యాబినెట్‌లో ఆయన లేకపోవడం ఒకవిధంగా తనకు లోటేనన్న కేసీఆర్.. పోచారం స్థానంలో మరొక సమర్థుడికి బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలోనూ పోచారం పోరాడారని సీఎం గుర్తుచేశారు. వివాదరహితుడిగా ఆయనకు మంచి పేరుందన్నారు. భగవంతుడు పరిపూర్ణమైన ఆరోగ్యం,ఆయుష్షును ఆయనకు ఇవ్వాలని ఆకాంక్షించారు. వాస్తవానికి పరిగె ఆయన ఇంటిపేరైనా.. ఊరిపేరునే ఇంటి పేరుగా మార్చుకునేంతగా పోచారం గ్రామస్థులతో శ్రీనివాస్‌రెడ్డి మమేకమయ్యారని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యను మధ్యలోనే ఆపేసి, 1969 తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. 1976లో పోచారం రాజకీయాల్లో ప్రవేశించారని, 1977లో దేశాయిపేట ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. అప్పట్లో తాను సర్పంచ్‌గా కావాలని ప్రయత్నించినా, వీలుకాకపోవడంతో తానుకూడా పీఏసీఎస్‌గా చైర్మన్‌గానే రాజకీయజీవితాన్ని ప్రారంభించానని తెలిపారు. పోచారం 1987లో నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికయ్యారని కేసీఆర్ చెప్పారు. 1994, 1999, 2009, 2011 (ఉప ఎన్నిక), 2014, 2018లో బాన్సువాడ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే అయ్యారని తెలిపారు. 2004లో బాన్సువాడ నుంచి ఓడిపోయినప్పటికీ ప్రజల మధ్య ఉంటూ తెలంగాణ సాధనకు కృషిచేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1998లో గృహనిర్మాణం, 1999లో భూగర్భగనులు, 2000లో పంచాయతీ రాజ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. 2014 నుంచి 2018 వరకు తెలంగాణ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసి రాణించారని చెప్పారు. ఇప్పుడు అసెంబ్లీ స్పీకర్‌గా కూడా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ దేశంలోనే తెలంగాణ అసెంబ్లీని ఆదర్శవంతంగా ముందుకు తీసుకెళ్తారన్న అభిలాషను వ్యక్తంచేశారు.

న్యాయబద్ధంగా విధులు నిర్వహిస్తా: పోచారం



సభ్యులకు నమస్కరిస్తున్న స్పీకర్ పోచారం

విధి నిర్వహణలో న్యాయబద్ధంగా వ్యవహరిస్తానని స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. తనను శాసనసభకు స్పీకర్‌గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏకగ్రీవానికి కృషిచేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలియజేశారు. 'స్పీకర్ ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కసభ్యునికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఆరుసార్లు గెలిపించి, ఈ పదవికి ఎంపికయ్యేలా బాటలు వేసిన బాన్సువాడ ప్రజలకు కృతజ్ఞతలు. పార్లమెంటరీ వ్యవస్థలో శాసనసభాపతి పదవి అత్యంత కీలకం. సభ నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. సభ్యులందరి సహకారంతో సభా కార్యక్రమాలను ఆదర్శవంతంగా నిర్వహించేందుకు కృషిచేస్తా. సభకు అంతరాయం కలిగించడం గౌరవప్రదం కాదు. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా సభ నిర్వహించుకుందాం. సభను ఆదర్శ శాసనసభగా తీర్చిదిద్దుదాం. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుకునేందుకు ముందుకు సాగుదాం' అని ఆకాంక్షించారు. 'ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపే అవకాశం నాకు ఎప్పుడూ దక్కలేదు. ఈ సందర్భంగా తెలియజేస్తున్నా. రైతులకు మేలుచేసే ఎన్నో పథకాల రూపకల్పనకు సహకరించడం, దేశంలో ఏ వ్యవసాయమంత్రికి లేనివిధంగా లక్ష్మీపుత్రుడనే పేరును నాకు ఖరారు చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నది'అని తెలిపారు.

నేడు 11.30 గంటలకు గవర్నర్ ప్రసంగం

రాష్ట్ర రెండో అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ శనివారం ఉదయం 11.30 గంటలకు ప్రసంగిస్తారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



స్పీకర్‌గా ఎన్నికైన పోచారంను అభినందిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్

ఉద్యమకారులకు దక్కిన గౌరవం

- మంత్రిగా వ్యవసాయానికి స్వర్ణయుగం
- ఇప్పుడు స్పీకర్ పదవికీ వన్నె తెస్తారు
- పోచారం ఎన్నికపై సభ్యుల సంతోషం
- పార్టీలకు అతీతంగా అభినందనల వెల్లువ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి గత ప్రభుత్వంలో వ్యవసాయశాఖ నిర్వహించి వ్యవసాయానికి స్వర్ణయుగాన్ని తీసుకొచ్చారని సభ్యులు కొనియాడారు. ఇప్పుడు స్పీకర్ పదవికీ వన్నె తెస్తారని అభిలషించారు. పోచారం వంటి ఉద్యమకారుడు స్పీకర్ పదవిలో కూర్చొనడం ఉద్యమకారులందరికీ దక్కినగౌరవమని పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తూ పలువురు సభ్యులు శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

దేశవ్యాప్తంగా గౌరవం పొందారు



వ్యవసాయమంత్రిగా పోచారం సమర్థంగా బాధ్యతలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో వ్యవసాయమంత్రిగా దేశవ్యాప్తంగా గౌరవం అందుకున్నారు. పోచారం పనితీరుతో వ్యవసాయరంగం అద్భుత ప్రగతిని సాధించింది. రాజకీయ అనుభవంతో సభా వ్యవహారాలను కూడా అద్భుతంగా నిర్వహిస్తారు.

- మహమూద్ అలీ, ఉప ముఖ్యమంత్రి


స్పీకర్ పదవికే వన్నె తెస్తారు



సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న పోచారం స్పీకర్ పదవికే వన్నె తెస్తారు.ఆయన సభాపతి కావడంతో రాష్ట్రంలోని అన్నదాతలంతా సంబురపడుతున్నారు. పోచారం తెలంగాణ తొలి వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో రెండో హరిత విప్లవానికి బీజం పడింది. మంత్రిగా ఆయన చేపట్టిన రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, వ్యవసాయ విస్తరణాధికారుల నియామకం చరిత్రలో నిలిచిపోతాయి. పోచారం అంకితభావం, ప్రజల సమస్యల పరిష్కారం పట్ల చూపించే శ్రద్ధ మాలాంటి యువ ఎమ్మెల్యేలకు స్ఫూర్తిదాయకం. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిత్యవిద్యార్థిలా పని చేశారు. గత అసెంబ్లీలో అర్ధరాత్రి ఒంటిగంట దాటిన తర్వాత కూడ వ్యవసాయ పద్దులపై చర్చలో విపక్షాల ప్రశ్నలకు మంత్రిగా పోచారం చెప్పిన సమాధానాలు మరిచిపోలేం.

- కే తారకరామారావు, టీఆర్‌ఎస్ సభ్యుడు

ప్రతి ఉద్యమకారుడికి గర్వకారణం



తొలి, మలిదశ ఉద్యమాల్లో పోరాడిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభాపతి స్థానంలో కూర్చోవడం ప్రతి ఉద్యమకారుడికి గర్వకారణం. తెలంగాణ పదం నిషేధానికి గురైనచోట ఒక ఉద్యమకారుడు సభాపతి కావడం ఆనందంగా ఉంది. పోచారానికి సముచిత స్థానం దక్కింది. నాలుగున్నరేండ్ల టీఆర్‌ఎస్ పాలన వ్యవసాయానికి స్వర్ణయుగం. సీఎం కేసీఆర్ సూచనలతో మంత్రిగా పోచారం చేసిన కృషి దీనికి కారణం. ఆరోగ్యం బాగాలేకున్నా.. రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేసి, 30 జిల్లాల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీతో కలిసి రైతులను చైతన్యవంతం చేసిన విషయాలను ఎప్పటికీ మరిచిపోలేం. కారునే కార్యాలయంగా చేసుకొని ప్రజాసమస్యలు పరిష్కరించారు.

- టీ హరీశ్‌రావు, టీఆర్‌ఎస్ సభ్యుడు

రైతుబిడ్డ సభాపతి కావడం గొప్ప గౌరవం



సభాపతిగా రైతుబిడ్డ పోచారం ఎన్నికవడం గొప్ప గౌరవం. రైతుల సమస్యలపై ఎస్సెల్బీసీ సమావేశాల్లో బ్యాంకర్ల తీరుపై ముక్కుసూటిగా మాట్లాడేవారు.బాన్సువాడకు వచ్చినప్పు డు ప్రజలజీవితాలతో ఆయన ఏ విధంగా పెనవేసుకుంటా రో ప్రత్యక్షంగా చూశాం. పదిమందితో మేం అసెంబ్లీలో పో రాడుతున్న సమయంలో.. మాతో సమానంగా పోరాడారు. సీఎం కేసీఆర్ వ్యవసాయశాఖను అప్పగిస్తే శక్తివంచనలేకుండా పనిచేసి రైతులకు భరోసా కల్పించారు. దేశంలో గొప్పగా రైతు ఎక్కడ ఉన్నారంటే అంటే తెలంగాణ వైపు చూ సేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడంలో మీ ఆలోచనలను కొనసాగిస్తాం. తెలంగాణ ప్ర జల హృదయాలలో టీఆర్‌ఎస్‌కు చెదరని చోటు సంపాదించడంలో రైతులకు మేలుచేయడం కీలకంగా మారింది. మళ్లీ భారీ మెజార్టీతో గెలువడానికి కారణమైంది. మీరు.. భావితరాలకు స్ఫూర్తి.

- ఈటల రాజేందర్, టీఆర్‌ఎస్ సభ్యుడు

ఎదిగే కొద్దీ ఒదిగే మనస్తత్వం మీది



ఉద్యమంకోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన చరిత్ర పోచారంది. రైతుబిడ్డగా వ్యవసాయశాఖను నిర్వహించిన తీరు ఆదర్శం. ఎదిగిన కొద్ది ఒదిగి ఉండే మీ మనస్తత్వం గొప్పది. పోచారం అధ్యక్షతన తెలంగాణ అసెంబ్లీ ప్రజాసమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తుందని ఆశిస్తున్నాం.

- గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు

స్పీకర్ స్థానానికే గర్వకారణం



స్పీకర్ స్థానంలో పోచారం కూర్చొనడం సభకే గర్వకారణం. పోచారం అధ్యక్షతన సభా కార్యక్రమాలు మరింత సమర్థంగా నడుస్తాయని ఆశిస్తున్నాం. పోచారం లాంటి నాయకులు అరుదుగా ఉంటారు.

- మహ్మద్ బిన్ బలాల, ఎంఐఎం సభ్యుడు

స్ఫూర్తి నింపిన నాయకుడు



పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా పోచారం పనిచేసిన సందర్భంగా మొట్టమొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై కలిశాను. ఆ సందర్భంగా మా తండ్రి నాయకత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని సూచించారు. అదే పాటిస్తున్నా. ప్రజాసమస్యలపై చర్చించేందుకు నిబంధనలు, చట్టాలకు లోబడి స్పీకర్‌కు సహకరిస్తాం.

- దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ సభ్యుడు

ముహూర్తం

సూర్యోదయం: 6.53 గంటలకు

సూర్యాస్తమయం: 6.00 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం త్రయోదశి సాయంత్రం 5.36 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: మృగశిర ఉదయం 10.32 వరకు, తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: తె. 2.26 నుంచి 4.02 వరకు, తిరిగి రాత్రి 11.03 నుంచి 12.44 వరకు, రాహుకాలం ఉదయం 9.40 నుంచి 11.03 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.53 నుంచి 8.22 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.05 నుంచి రాత్రి 7.41 వరకు.

లోకం పోకడ



2.25 లక్షల కోట్లు.. 1.25 కోట్ల ఎకరాలు



శుక్రవారం ప్రగతిభవన్‌లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు కూడా ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

అధికారులకు సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణపనులపై సీఎం కేసీఆర్ శుక్రవారం ప్రగతిభవన్‌లో సమీక్షించారు. 'తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టుల కోసం ఇప్పటివరకు రూ.77,777 కోట్లు ఖర్చు చేశాం. భూసేకరణ, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం, ఆర్‌ఆర్ ప్యాకేజీల కోసం మరో రూ.22వేల కోట్లు ఖర్చయింది. మొత్తంగా ఇప్పటివరకు రూ.99,643 కోట్ల వ్యయం చేశాం. ఈ ఏడాది మార్చినాటికి మరో రూ.7వేల కోట్లకు పైగా ఖర్చవుతుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం వరకు రూ.1.07 లక్షల కోట్లకుపైగా వ్యయం జరుగుతుంది. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టులతోపాటు మిషన్ కాకతీయ పనుల కోసం మరో రూ.1.17 లక్షల కోట్లు ఖర్చవుతాయని అంచనా. రాబోయే ఐదేండ్లలో ఈ నిధులు ఖర్చుచేసి, ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, మొత్తం 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం అధికారులు, ఇంజినీర్లు, వర్క్ ఏజెన్సీలు కృషిచేయాలి. ప్రాజెక్టుల నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యం గుర్తించి, వెంటవెంటనే నిధులు విడుదలచేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ జిల్లా చరిత్ర మార్చాలి

సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులు ఓ జోక్‌గా మారాయని సీఎం కేసీఆర్ అన్నారు. 'ఎన్నికలప్పుడు ప్రాజెక్టుల పేర్లు చెప్పి ఓట్లు అడుక్కోవడమే తప్ప ప్రాజెక్టులు కట్టి నీళ్లియ్యలేదు. అత్యధిక వర్షపాతం, పుష్కలమైన నీటి లభ్యత ఉన్న ఆదిలాబాద్ జిల్లా చరిత్ర మార్చాలి. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలి. ఆ బరాజ్ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో 56,900 ఎకరాలు, ఆసిఫాబాద్‌లో 38,830 ఎకరాలు, చెన్నూరులో 31,500 ఎకరాలు, బెల్లంపల్లి నియోజకవర్గంలో 72,770 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మించి, 20 టీఎంసీల నీటిని వినియోగించుకోవడానికి కేంద్ర జలసంఘం అంగీకారం తెలిపింది. ఈ నీటిని సద్వినియోగం చేసుకొని, ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు ఇవ్వడానికి సమగ్ర వ్యూహం రూపొందించాలి. ఆదిలాబాద్ జిల్లాలో పారే పెద్దవాగుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. చాలా నియోజకవర్గాల గుండా ఈ వాగు పోతుంది. ఈ పెద్దవాగు నీటిని వినియోగించుకోవడానికి అవసరమైన నిర్మాణాలు చేపట్టాలి. పెన్‌గంగ ప్రాజెక్టుపై నిర్మిస్తున్న చనాఖా-కొరాటా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి. కుప్టి రిజర్వాయర్ నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు.

గోదావరి ప్రాజెక్టులపై నెలాఖరులోగా కార్యాచరణ

తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం, చనాఖా-కొరాటా ప్రాజెక్టు, పెద్దవాగు సద్వినియోగం ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో చాలావరకు సాగునీరు అందనుందని సీఎం కేసీఆర్ అన్నారు. మిగిలిన భాగానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు పారుతుందని చెప్పారు. 'కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా గోదావరి బేసిన్‌లో తెలంగాణకు ఉన్న నీటి వాటాను పూర్తిగా వినియోగించుకోవాలి. ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టు పనులను స్వయంగా పరిశీలించాను. నీటిపారుదల శాఖ అధికారులు, రిటైర్డ్ ఇంజినీర్లు కూడా ఈ ప్రాజెక్టు పనులను సందర్శించారు. మొత్తం గోదావరి బేసిన్‌లో ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి చేయాల్సిన పనులపై పూర్తి అవగాహన వచ్చింది. ఈ అవగాహనతో ఈ నెలాఖరులోగా కార్యాచరణ ఖరారు చేయాలి. ఫిబ్రవరిలో నేనే స్వయంగా పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పనులను పరిశీలిస్తాను. ఫిబ్రవరి మాసంలో కృష్ణాబేసిన్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేయడంపై కార్యాచరణ రూపొందిస్తాం. వర్షాకాలం వరకు పనులుచేసుకునే అవకాశం ఉన్నందున వెంటనే కార్యరంగంలోకి దిగాలి' అని సీఎం చెప్పారు.

చెరువులకు మళ్లించండి

ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని మొదటగా చెరువులకు మళ్లించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అటు మిడ్‌మానేరు నుంచి ఎస్సారెస్పీ వరకు, ఇటు మల్లన్నసాగర్ వరకు నీరు అందుతుందన్నారు. ఆ నీటిని చెరువులకు మళ్లించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఏదైనా చెరువుకు ఫీడర్ చానల్ లేకుంటే కొత్తగా తవ్వాలని ఆదేశించారు. ఎస్సారెస్పీ రెండోదశ వరకు చెరువులు నింపాలని సీఎం స్పష్టంచేశారు. సమావేశం లో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సీఈలు హరిరాం, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఈలు విష్ణుప్రసాద్, వేణు, ఈఈ రామకృష్ణ, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేండ్ల లక్ష్యం.. 1.25 కోట్ల ఎకరాలు సస్యశ్యామలం

- ఇప్పటివరకు ప్రాజెక్టుల కోసం వెచ్చించింది రూ.77,777 కోట్లు.
- భూసేకరణ, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం, ఆర్‌ఆర్ ప్యాకేజీల కోసం వ్యయం రూ.22 వేల కోట్లు.
- మొత్తంగా ఇప్పటివరకు జరిగిన వ్యయం.. రూ.99,643 కోట్లు.
- ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి (మార్చి వరకు) వ్యయం మరో రూ.7వేల కోట్లు.
- 2018-19 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మొత్తం వ్యయం రూ.1.07 లక్షల కోట్లకు పైగా.
- మిషన్ కాకతీయ పనుల కోసం వెచ్చించేది మరో రూ.1.17 లక్షల కోట్లు.
- మొత్తంగా రాష్ట్రంలో రూ.2.25 లక్షల కోట్ల వ్యయంతో 1.25 కోట్ల ఎకరాలు సస్యశ్యామలం.

అదిగదిగో దివ్య విమానగోపురం



యాదాద్రిలో నిర్మాణం పూర్తయిన దివ్య విమానగోపురం

- స్వర్ణమయం చేయడమే ఇక తరువాయి
- త్వరలో 34 కిలోల బంగారంతో తాపడం
- కనువిందు చేస్తున్న మహారాజగోపురాలు
- అత్యద్భుత నిర్మాణాలకు నెలవు యాదాద్రి

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొండపై ఏడు మహారాజగోపురాల నిర్మాణం చేపట్టగా ప్రధానమైన దివ్యవిమానగోపురం పనులు శుక్రవారం సాయంత్రం పూర్తయ్యాయి. పురుషోత్తముని రాజవిగ్రహాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దిన తర్వాత అమర్చేప్రక్రియను చేపట్టడం ద్వారా కార్యక్రమం పూర్తయినట్టు స్థపతులు ఎస్ సుందరరాజన్, డాక్టర్ ఆనందాచార్యుల వేలు ప్రకటించారు. ఐదంతస్తుల్లో నిర్మాణం పూర్తయిన దివ్య విమానగోపురానికి 34 కిలోల బంగారంతో తాపడం చేసి తిరుమల తరహాలో ధగధగలాడే రూపు ఇవ్వనున్నారు. ఈ ఐదంతస్తుల విమానగోపురంపై 32 విగ్రహాలను అమర్చారు. నాలుగు గరుత్మంతుడి విగ్రహాలు, 8 సింహాలతో పాటు శ్రీమహావిష్ణువు అవతారాలైన మాధవుడు, గోవిందుడు, మధుసూదనుడు, పురుషోత్తముడు ఇలా దశావతారాలతోపాటు మరో పది రాజ విగ్రహాలను అమర్చారు. గర్భాలయంపై నిర్మాణం జరుపుకున్న విమానగోపురాన్నే శ్రీవారి శిరస్సుగా శిల్పశాస్త్రం పేర్కొంటున్నది. భక్తులు దూరం నుంచే దర్శించుకునేలా కొండపై విమానగోపురాన్ని నిర్మించారు. విమానగోపురాన్ని దర్శించుకోవడం ద్వారా గర్భాలయంలోని శ్రీలక్ష్మీనరసింహుడిని దర్శించుకున్నామనే భావన కలుగుతుందని స్థపతులు పేర్కొన్నారు. 'గర్భాలయంలో స్వామికి జరిగే కైంకర్యాలను దర్శించుకున్న భక్తుల వివరాలు బ్రహ్మరంధ్రం నుంచి విమాన కలశం ద్వారా దేవదేవుడికి చేరుతాయని పాంచరాత్రాగమ శాస్త్రం పేర్కొంటున్నది. విమానగోపురానికి అంతటి ప్రాధాన్యం ఉన్నది' అని వేదపండితులు వివరించారు.

16 సీట్లే టార్గెట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 16 లోక్‌సభ స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు రాబోయే మూడునాలుగునెలలు పనిచేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. అప్పుడే ఢిల్లీలో నిర్ణయాత్మక శక్తిగా టీఆర్ఎస్ ఎదుగుతుందని చెప్పారు. దేశానికి కాంగ్రెస్, బీజేపీ తీరని నష్టంచేశాయని కేటీఆర్ విమర్శించారు. జాతీయస్థాయిలో కూడా నరేంద్రమోదీ పరిస్థితి బాగాలేదని, పైన పటారం లోన లొటారంలా ఉందని అన్నారు. దేశంమొత్తంలో యూపీఏ కూటమికి 100-110 సీట్లు, ఎన్డీయే కూటమికి 150-160 సీట్ల కంటే ఎక్కువ వచ్చే పరిస్థితి లేదని, కాంగ్రెస్, బీజేపీ కలిస్తే కూడా మ్యాజిక్ ఫిగర్ 273 స్థానాలకు చేరుకునే పరిస్థితి లేదని కేటీఆర్ విశ్లేషించారు. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ ఒక్కటై, ఓట్ల చీలికను నివారించే దిశగా ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌కు దూరంగా ఉంటామని ఎస్పీ, బీఎస్పీ ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా బీజేపీ, కాంగ్రెస్‌ను ఒకేగాటన కడుతున్నామన్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ కూడా అదే మాట చెప్తున్నారని, ప్రజాస్వామిక సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను బలోపేతంచేసే దిశగా సంవత్సరం కాలంగా కృషిచేస్తున్నారని చెప్పారు. ఎవరెన్ని అనుకున్నా 16 సీట్లలో టీఆర్ఎస్ గెలిచే విధంగా ముందుకుపోదామని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఎన్డీయే, యూపీఏ రెండింటి పరిస్థితి బాగోలేదని చెప్పారు. టీఆర్ఎస్ అంచనావేసిన విధంగానే రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయన్నారు. భవిష్యత్‌లో ఇది మరింత వేగవంతమై, ఢిల్లీలో టీఆర్ఎస్ నిర్ణయాత్మక, కీలక శక్తిగా ఉండే రోజు ఎంతో దూరం లేదన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని కలిశామని, ఆయన కూడా

- ఢిల్లీలో నిర్ణయాత్మక శక్తిగా టీఆర్ఎస్ ఎదగాలి
- ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషిచేయాలి
- దేశానికి తీరని నష్టంచేసిన కాంగ్రెస్, బీజేపీ
- బీజేపీ.. బిల్డప్ జాతీయ పార్టీగా మారింది
- మోదీది పైన పటారం.. లోన లొటారం
- కాంగ్రెస్, బీజేపీ కలిసినా 273 సీట్లు రావు
- ఏపీ అభివృద్ధికి టీఆర్ఎస్ వ్యతిరేకం కాదు
- చెప్పుకొనేందుకు ఏమీలేకే చంద్రబాబు కొత్త నాటకం
- చాతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్‌పై విమర్శలు
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు
- టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి



శుక్రవారం తెలంగాణభవన్‌లో కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి చేరిక సందర్భంగా మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ టీడీసీ చైర్మన్ భూపతిరెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు

'కాంగ్రెస్ కాదు.. బీజేపీ కాదు.. ఢిల్లీని శాసించే దిశగా ఉండాలే తప్ప యాచించవద్దు' అన్నారని తెలిపారు. ఐక్యతతో రెండు రాష్ట్రాల ప్రజలు ఆశీర్వదిస్తే ఢిల్లీని శాసించే దిశగా పోదామని చెప్పారని పేర్కొన్నారు.

అక్కసుతోనే చంద్రబాబు విమర్శలు

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలని, రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం పోవాలని, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు రావాలని సమాఖ్య స్ఫూర్తితో సీఎం కేసీఆర్ దేశవ్యాప్తంగా అందరి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తుంటే ఏపీ సీఎం చంద్రబాబు అక్కసుతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. గద్దల్లా వచ్చి ఆంధ్రప్రదేశ్‌ను కుళ్లబొడిచే ప్రయత్నం చేస్తున్నారని బాబు అంటున్నారన్న కేటీఆర్.. ఎవరు గద్ద? అని ప్రశ్నించారు. మోదీతో టీఆర్ఎస్‌కు ఏదో ఒప్పందం ఉందని చంద్రబాబు మాట్లాడుతున్నారని, అసలు నాలుగున్నరేండ్లు మోదీతో సంసారం చేసింది ఎవరని నిలదీశారు. గత ఐదేండ్లలో ఏం చేశామో చెప్పుకొనేందుకు ఏమీ లేకే చంద్రబాబు కొత్త నాటకానికి తెరతీశారని విమర్శించారు. తాము ఇటీవలి ఎన్నికల్లో బీజేపీకి 103 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతయ్యేలా చిత్తుచిత్తుగా ఓడించిన విషయాన్ని గుర్తుచేశారు. చంద్రబాబు తన అసమర్థత, చాతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రధానమంత్రిని ఒక బూచిగా, ఇంకొకరిని మరో బూచిగా చూపించి ఆంధ్ర ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఒకప్పుడు సోనియాగాంధీని అనరాని మాటలు అన్న చంద్రబాబు.. అన్నీ వదిలేసి 36 ఏండ్ల వైరమున్న కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని తెలంగాణలో టీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రయత్నించారని గుర్తుచేశారు.

ఏపీ అభివృద్ధిని ఎన్నడూ వ్యతిరేకించలేదు

ప్రాంతాలుగా విడిపోయినా, ప్రజలుగా కలిసే ఉంటామని మొదటినుంచీ టీఆర్ఎస్ చెప్తున్నదని కేటీఆర్ గుర్తుచేశారు. అన్నదమ్ముల్లాగా విడిపోదాం.. అభివృద్ధిలో పోటీపడుదామని చెప్పామన్నారు. ఎక్కడా ఆంధ్ర ప్రజలకు వ్యతిరేకంగా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వ్యతిరేకంగా టీఆర్ఎస్ మాట్లాడలేదని స్పష్టంచేశారు.

గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు అదృష్టవంతులు

గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు అదృష్టవంతులని, నాలుగన్నరేండ్లలో నియోజకవర్గ రూపురేఖలు మారాయని కేటీఆర్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పీ భూపతిరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన వంటేరు



టీఆర్ఎస్‌లో చేరిన అనంతరం ప్రగతిభవన్‌లో పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌ను కలిసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

టీఆర్ఎస్‌లో చేరిన అనంతరం పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌ను వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రగతిభవన్‌కు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ప్రతాప్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేరినందుకు ప్రతాప్‌రెడ్డిని అభినందించిన కేసీఆర్.. బంగారు తెలంగాణ కోసం కలిసి పనిచేద్దామన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో పలువురు గజ్వేల్ నియోజకవర్గ నాయకులున్నారు.



శుక్రవారం హైదరాబాద్ హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులతో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు ఉన్నారు.



తెలంగాణ జాగృతి అంతర్జాతీయ సదస్సు కోసం వచ్చిన విదేశీ, స్వదేశీ ప్రతినిధులు

జాగృతి సదస్సుకు దేశవిదేశీ ప్రతినిధులు



హైదరాబాద్‌లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కే కవిత

- సదస్సు ఉద్దేశాలను వివరించిన ఎంపీ కవిత
- నేటి సెషన్‌లో ప్రసంగించనున్న అన్నాహజారే, అర్జున్ బహదూర్ థాపా
- శేఖర్‌గుప్తా చర్చలో పాల్గొననున్న ఎంపీలు కవిత, ఒవైసీ, గౌరవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ వేదికగా తెలంగాణ జాగృతి సంస్థ 'గాంధేయమార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు కోసం శుక్రవారం విచ్చేసిన ప్రతినిధులకు జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత సదస్సు ఉద్దేశాలను వివరించారు. గాంధీ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని, గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి సాధనతోపాటు నూతన ఆవిష్కరణల కోసం సదస్సులో యువనాయకులు చర్చించాలని ఆమె కోరారు. 135 దేశాల నుంచి హాజరైన ప్రతినిధుల గౌరవార్థం నోవాటెల్ హోటల్‌లో ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సమావేశానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూడా హాజరయ్యారు. శనివారం సెషన్‌లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే, సార్క్ మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ థాపా ప్రసంగిస్తారు. ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షోపన్యాసం చేయనున్నారు. 'వాక్ ద టాక్ ఆన్ యూత్ డెవలప్‌మెంట్' అంశంపై ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్‌గుప్తా ఆధ్వర్యంలో ప్యానెల్ డిస్కషన్ జరుగనున్నది. ఈ చర్చలో ఎంపీలు కవిత, అసదుద్దీన్ ఒవైసీ, గౌరవ్ గగోయ్ పాల్గొననున్నారు. 'గాంధీ, యూత్ అండ్ సస్టెయినబిలిటీ-పర్‌స్పెక్టివ్ ఫ్రం ద వరల్డ్' అంశంపై యూకే ఎంపీ సీమా మల్హోత్రా, న్యూజీలాండ్ ఎంపీ కన్వల్జిత్‌సింగ్ భక్షి, యునైటెడ్ నేషన్స్‌లో నేపాల్ శాశ్వత ప్రతినిధి మధురామన్‌ఆచార్య, ఆఫ్ఘనిస్తాన్, ఒకినావాలో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ వ్యవస్థాపకుడు జాన్‌డిక్సన్, శ్రీలంక పరిశ్రమలు, వాణిజ్యశాఖ ఉపమంత్రి బుదికా పథిరాణా, మాసిడోనియా రిపబ్లిక్ పెట్టుబడులశాఖ మాజీ మంత్రి గ్లిగర్ తస్కోవిచ్ ప్రసంగిస్తారు. ఈ సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు, 16 దేశాల నుంచి 70 మంది వక్తలు, 40 మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతున్నారు. ఆదివారం సాయంత్రం జరుగనున్న సదస్సు ముగింపు సమావేశానికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క నియామకం

- అధికారికంగా లేఖను విడుదల చేసిన ఏఐసీసీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష నేతగా మల్లు భట్టి విక్రమార్క నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ శుక్రవారం రాత్రి అధికారికంగా లేఖను విడుదల చేసింది. తెలంగాణ శాసనసభ సమావేశాల ప్రారంభం రోజునే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమై సీఎల్పీ నేతకు సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి నివేదికను పంపారు. పరిశీలించిన రాహుల్‌గాంధీ మల్లు భట్టి విక్రమార్కను సీఎల్పీ నేతగా నియమించారు. నియామక లేఖను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లాట్ అధికారికంగా విడుదల చేశారు. మల్లు భట్టి విక్రమార్క ఇటీవల జరిగిన ఎన్నికల్లో మధిర నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం తెలిసిందే.

కాంగ్రెస్‌లో కష్టపడేవారికి గుర్తింపు లేదు

- ఢిల్లీలో పైరవీలుచేసేవారికి స్వస్తి పలకాలి
- ఒంటేరు పార్టీ మారడం సమంజసమే
- మీడియా చిట్‌చాట్‌లో ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్‌లో కష్టపడేవారికి తగిన గుర్తింపులేదని, అందుకే చాలామంది నేతలు పార్టీ మారేందుకు సమాయత్తం అవుతున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో లాబీయింగ్, పైరవీలు చేసేవారికి పెద్దపీట వేసే దుస్సాంప్రదాయానికి పార్టీ అధిష్ఠానం స్వస్తి పలకాలని సూచించారు. శుక్రవారం సీఎల్పీలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. స్థానికంగా ప్రజాబలం ఉన్న నాయకులను సైతం లెక్కచేయకుండా ఢిల్లీలో తిరిగే వాళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో పార్టీ కోసం కష్టపడే నాయకులను గుర్తించకుండా కొందరు చెప్పిన మాటలకే అధిష్ఠానం విలువనిస్తూ క్షేత్రస్థాయి పరిణామాలను గుర్తించలేకపోతున్నదని అన్నారు.



ఒంటేరుది సమంజసమైన నిర్ణయం

కాంగ్రెస్ సీనియర్ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ మారడం సమంజసమైన నిర్ణయమని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తరపున ఎంతో పోరాటంచేసిన వ్యక్తికి పార్టీ గుర్తింపు లేకపోవడం వల్ల నిరాశానిస్పృహలకు గురికావడం సాధారణమేనని అన్నారు. 2009 నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్న ప్రతాప్‌రెడ్డి ఆర్థికంగా చితికిపోయారని, ఉన్న ఆస్తులు అమ్ముకొని బజారునపడితే పార్టీ కనీసం ధైర్యంచెప్పలేని పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థి మీద పోటీచేయడం ప్రతాప్‌రెడ్డి సాహసానికి నిదర్శనమని, ఆయన రాజకీయ భవిష్యత్ దృష్ట్యా పార్టీ మారడం మంచిదేనని చెప్పారు. ఇకనైనా ప్రతాప్‌రెడ్డి ప్రశాంతమైన జీవితాన్ని గడిపి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు జగ్గారెడ్డి తెలిపారు.

కులమతాలకు అతీతంగా సీఎల్పీ నేత

కులమతాలకు అతీతంగా సమర్థత ఆధారంగా సీఎల్పీ నేతను ఎన్నుకోవాలని పార్టీ అధిష్ఠానాన్ని జగ్గారెడ్డి కోరారు. లాబీయింగ్ ద్వారా సీఎల్పీ నేత ఎంపిక జరిగితే ఇక పార్టీ పరిస్థితి అంతే సంగతులని హితవుపలికారు. రహస్య సర్వేచేసి ప్రజల అభిప్రాయాలను తీసుకుని సీఎల్పీ నేతను ఎంపిక చేయాలని సూచించారు. తెలంగాణలో ప్రజాదరణ ఉన్న నాయకుడు ఎవరనేది పార్టీ అధినేత రాహుల్‌గాంధీ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.



శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, రేఖానాయక్ తదితరులు

సభ హుందాతనం పెరిగింది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోచారం స్పీకర్ కావడం వల్ల సభకు హుందాతనం పెరిగిందని టీఆర్ఎస్ సభ్యురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. రాజకీయంగా ఆయనను చూసి ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. ఆరుసార్లు శాసనసభ సభ్యునిగా ఎన్నికైన పోచారం అసెంబ్లీ స్పీకర్ పదవిలోనూ సంపూర్ణంగా రాణించాలని వేముల ప్రశాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను దేశంలో ఆదర్శవంతంగా నిర్వహించే సత్తా పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఉందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పోచారం రాష్ట్రంలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారని నోముల నరసింహయ్య ప్రశంసించారు. రైతే వచ్చి రాజులా సభాపతి సీట్లో కూర్చొని సభ నడిపే అరుదైన అవకాశం దక్కడం పోచారం అదృష్టమని గ్యాదరి కిశోర్ అన్నారు. పువ్వాడ అజయ్ మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని రైతులు తమ ప్రతినిధిగా భావిస్తున్నారన్నారు. గంపగోవర్ధన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయరంగానికి పేరు తెచ్చారన్నారు. స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి గణేష్‌గుప్తా మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమంతు షిండే మాట్లాడుతూ.. తన గురువు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఇలాంటి గౌరవాన్ని కల్పించారంటూ సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ మంత్రిగా పోచారం చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. రెడ్యానాయక్ మాట్లాడుతూ.. రైతుబిడ్డ పోచారానికి స్పీకర్ పదవి దక్కడం అభినందనీయన్నారు. కాంగ్రెస్ సభ్యులు జాజుల సురేందర్ మాట్లాడుతూ.. అన్ని అంశాలపైనా నిర్మాణాత్మకంగా చర్చలు కొనసాగించేలా సభను హుందాగా నడిపించాలని కోరారు.

స్పీకర్‌గా పోచారం ఎన్నికపై సభ్యుల హర్షం

ప్రత్యర్థిగా పోటీచేసినా అభిమానించారు



నేను ఒక సందర్భంలో మీపై పోటీ చేసినా.. అనంతరం ఇద్దరం టీఆర్ఎస్‌లో సభ్యులుగా ఉన్న సమయంలో ఎంతో ఆదరణ కనబర్చారు. పెద్దన్నగా మమ్మల్ని నడిపించారు. మంత్రిగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను సమంగా అభివృద్ధి చేశారు. మాకు మార్గదర్శనం చేశారు.

- బాజిరెడ్డి గోవర్ధన్, టీఆర్ఎస్ సభ్యుడు

సభాపతిగా రైతుబిడ్డ.. సీఎం కేసీఆర్ ఘనత



రైతుల సంక్షేమానికి వ్యవసాయమంత్రిగా విశేష కృషిచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్పీకర్‌గా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. రైతు సమస్యలపై అధ్యయనానికి ఇజ్రాయెల్ వెళ్లిన బృందంలో పోచారంతోపాటు నేనూ ఉన్నాను. ఆనాడు పోచారం ఇచ్చిన ప్రజెంటేషన్ ద్వారా ఇజ్రాయెల్ దేశస్థులు మమ్మల్ని తెలంగాణ ప్రతినిధుల్లా కాకుండా భారతదేశ ప్రతినిధులుగా గుర్తించారు. అంతటి నిబద్ధత కలిగిన వ్యక్తి సభాధ్యక్షుడి స్థానంలో ఉండటం సభకు మరింత హుందాను తెస్తుంది.

- గంగుల కమలాకర్, టీఆర్ఎస్ సభ్యుడు

ఎన్నో అనుభవాలను నేర్చుకున్నాం



కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర సాధనకు ఉద్యమించినపుడు పోచారంతో కలిసి ఉండే అవకాశం దక్కింది. నాయకుడిగా ఎలా ఉండాలి, ప్రజలతో మమేకం అవడం ఎలా అనే అంశాల గురించి విపులంగా తెలిసింది. ఆయన వ్యవసాయశాఖమంత్రిగా రైతుల పట్ల నిబద్ధతను చాటుకున్నారు.

- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, టీఆర్ఎస్ సభ్యుడు

శాసనసభకు వన్నె తెస్తారు



అన్నదాతల సంక్షేమానికి సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలను సమర్థంగా అమలుచేసి రైతన్నలకు మేలుచేసిన ప్రత్యేకతను వ్యవసాయ మంత్రిగా సొంతం చేసుకున్నారు. సమర్థ ఆచరణతో రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, తెలంగాణకు పేరు తెచ్చినట్లే శాసనభకు సైతం వన్నె తెస్తారని విశ్వసిస్తున్నాం. పోచారం ధరించే పంచకట్టును చూసి స్వయంగా రైతునే చూసినట్టుగా రైతులు సంబరపడుతారు.

- అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, టీఆర్ఎస్ సభ్యుడు

రైతులపై అవగాహన ఉన్న నేత పోచారం



రైతులు, ప్రజలపై ఉన్న అవగాహన వల్ల రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను పోచారం ఎంతో సులువుగా అమలుచేశారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వ్యవసాయరంగంలో దేశం గర్వపడేలా తెలంగాణను అభివృద్ధి చేశారు.

- తలసాని శ్రీనివాసయాదవ్, టీఆర్ఎస్ సభ్యుడు

సీఎం కృషితో ఎన్నిక ఏకగ్రీవం



ప్రతిపక్ష నాయకులను ఒప్పించి పోచారం ఎన్నికను ఏకగ్రీవంచేయడంలో సీఎం కేసీఆర్ కృషి ఎంతో ఉంది. తన రాజకీయ జీవితంలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పోచారం ఎంతో కృషి చేశారు.

- కొప్పుల ఈశ్వర్, టీఆర్ఎస్ సభ్యుడు

రాజకీయ పాఠాలు నేర్పించారు



టీఆర్ఎస్ నాయకుడిగా వివిధ సమస్యలపై పోరాటం చేస్తున్న సమయంలో ఎన్నో అంశాలను మాకు తెలియజెప్పి రాజకీయపాఠాలు నేర్పించారు. క్రమశిక్షణ, రాజకీయ నిబద్ధత సహా అనేక అంశాలను వివరించారు.

- ఏ జీవన్‌రెడ్డి, టీఆర్ఎస్ సభ్యుడు

స్పీకర్‌కు టీఆర్ఎస్ ఆస్ట్రేలియా శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభలో ఏకగ్రీవంగా ఎన్నికైన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి, ప్రమాణం చేసిన శాసనసభ్యులకు టీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘనవిజయం సాధించాలని, కేసీఆర్ ఆధ్వర్యంలో భారత్ వెలిగిపోవాలని ఆకాంక్షించారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పుకోసం మొదలుపెట్టిన ఫెడరల్ ఫ్రంట్ ఆలోచనకు టీఆర్ఎస్ ఆస్ట్రేలియా పూర్తిస్థాయి మద్దతిస్తున్నదని వెల్లడించారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

- పలుకోర్సులకు బీసీ స్టడీ సర్కిల్ దరఖాస్తుల ఆహ్వానం
- పేర్ల నమోదుకు చివరి తేదీ ఈ నెల 25

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణ బీసీ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (బీసీ స్టడీ సర్కిల్) ద్వారా ప్లేస్‌మెంట్ గ్యారెంటీతో పలుకోర్సుల్లో ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకుడు ఎన్ బాలాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ యువకులకు అపోలో వారితో మెడ్ స్కిల్స్, స్టెప్ సంస్థ ద్వారా హోటల్ మేనేజ్‌మెంట్, జీఎమ్మార్‌తో ద్విచక్రవాహనాల రిపేరు, సోలార్ టెక్నీషియన్, హౌస్ వైరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, ఆ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 25లోపు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాల్లో తమ పేర్లను నమోదుచేసుకోవాలని, వివరాలకు 040-24071178 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వరంగల్ మేయర్ ఎంపికకు కేటీఆర్ కసరత్తు

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యేలతో చర్చలు ■ మిగతా ఎమ్మెల్యేలు, నేతల అభిప్రాయాలను తెలుసుకొన్న కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి ఎంపికకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కసరత్తు ప్రారంభించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ మేయర్‌గా ఉన్న నన్నపనేని నరేందర్ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన ఎన్నికతో వరంగల్ మేయర్ స్థానానికి ఖాళీ ఏర్పడింది. దీంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వరంగల్ కార్పొరేషన్ మేయర్ ఎంపిక బాధ్యతను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అప్పగించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో వరంగల్ జిల్లా టీఆర్ఎస్ నాయకులతోపాటు కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్ (వరంగల్ పశ్చిమ), నన్నపనేని నరేందర్ (వరంగల్ తూర్పు), ఆరూరి రమేశ్ (వర్ధన్నపేట)తో కేటీఆర్ సమావేశమై చర్చించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకొన్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ నాయకుల అభిప్రాయాలను కేటీఆర్ సీఎం కేసీఆర్‌కు నివేదించి మేయర్ అభ్యర్థిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.


శుక్రవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో వరంగల్ మేయర్ ఎంపిక కోసం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలోని శాసన సభ్యులతో సమావేశమైన కేటీఆర్

నేడు హజ్ యాత్ర అభ్యర్థులకు ఇంటర్వ్యూ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డ్రా పద్ధతిలో ఎంపికచేసిన హజ్ యాత్రికులకు శనివారం (19న) ఉదయం 10 గంటల నుంచి హజ్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్, హజ్ ప్రత్యేకాధికారి ఎస్ఏ షుకూర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రకు ఎంపికైనవారి ఆరోగ్య, మానసిక పరిస్థితిపై పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన యాత్రికుల పేర్లను ఈ నెల 21వ తేదీన వెల్లడిస్తామని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు పాస్‌పోర్ట్, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్ సూచించారు.

పశుసంవర్ధకశాఖలో సమ్మెలు నిషేధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పశుసంవర్ధకశాఖలో ఆరునెలలపాటు సమ్మెలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. పశుసంవర్ధకశాఖ పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న డెయిరీ, పాలసరఫరా విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు వచ్చే ఆరునెలలపాటు ఎలాంటి సమ్మెలు చేపట్టకూడదని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఓటర్ల నమోదుకు భారీ స్పందన

- 13.10 లక్షల దరఖాస్తులు
- ఎపిక్ కార్డుఉన్నా.. ఓటరు జాబితాలో చెక్ చేసుకోవాలి
- జాయింట్ సీఈవో ఆమ్రపాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఓటరు నమోదు కార్యక్రమానికి భారీగా స్పందన వస్తున్నదని, ఇప్పటివరకు 13.10 లక్షల దరఖాస్తులు వచ్చాయని రాష్ట్ర ఎన్నికల సంయుక్త అధికారి ఆమ్రపాలి చెప్పారు. సచివాలయంలోని ఈసీవో కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎపిక్ కార్డు చేతిలో ఉంటే ఓటు ఉన్నట్టు కాదని, ఓటరు జాబితాలో చెక్ చేసు కోవాలని సూచించారు. ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా, 22, 23, 24 తేదీల్లో జీహెచ్ఎంసీ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటరు నమోదుకు బీఎల్వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నేరుగా దరఖాస్తులతోపాటు ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటరుగా పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల నమోదు గడువు ఈ నెల 25తో ముగియనున్నందున.. గడువు మరింతగా పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించినట్టు ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, నిజామాబా ద్, నల్లగొండ జిల్లాల్లో ఓటర్ల నమోదు అత్యధికంగా జరిగిందన్నారు. ఈఆర్వోనెట్‌లో సాంకేతిక లోపాలతో 1.16 లక్షల డూప్లికేట్ ఓట్లను ఈ ముసాయిదా సవరణలో తొలిగిస్తున్నట్టు తెలిపారు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు భారీగా వస్తున్నాయన్నారు.


శుక్రవారం సచివాలయంలో ఉద్యాన వర్సిటీ భవనాల పనులపై సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి

ఉద్యాన విశ్వవిద్యాలయంలో.. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయోగశాలలు

- వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రయోగశాలలు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, వీసీ సీ పార్థసారథి తెలిపారు. ఇందుకోసం విశ్వవిద్యాలయ అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో సంయుక్త కమిటీని ఏర్పా టు చేసినట్టు చెప్పారు. కమిటీ రెండునెలల్లో సంబంధిత నివేదికను అందించాలని కోరారు. ములుగులో ప్రతిపాదించిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ భవనాల పనులు మార్చి చివరినాటికి పూర్తిచేసి అప్పగించాలని ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో పనులపురోగతిపై సచివాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. అనువైన పంటల సాగు కాలనీల ఏర్పాటుకు సర్వేచేయాలని సూచించారు. ఉద్యాన వర్సిటీ-2019 క్యాలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు విజయ, భగవాన్, రవీందర్‌రెడ్డి, కిరణ్ తదిరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ కాప్రా!

పేలిన గ్యాస్ సిలిండర్.. ఇద్దరు దుర్మరణం

- పేలుడుధాటికి కూలిన ఇంటి నాలుగు గోడలు
- మొదటి అంతస్తు నుంచి పడి యజమాని మృతి
- రోడ్డుపై వెళ్తుండగా శిథిలాలు తగిలి మరొకరు..
- ముగ్గురికి తీవ్రగాయాలు.. దవాఖానలో చికిత్స
- బాధితులకు అండగా ఉంటామని కేటీఆర్ ప్రకటన
- మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల పరిహారం ప్రకటించిన మేయర్ బొంతు రామ్మోహన్


శుక్రవారం కాప్రాలో గ్యాస్‌సిలిండర్ పేలడంతో ధ్వంసమైన ఇల్లు


కాప్రాలో పేలుడు జరిగిన ఇంటిముందు గుమిగూడిన జనం

కాప్రా/మల్లాపూర్/చర్లపల్లి: రాజధాని శివారు ప్రాంతమైన కాప్రా శుక్రవారం తెల్లవారుతుండగానే ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్యాస్ సిలిండర్ పేలడంతో ఓ ఇంటి యజమాని మృతి చెందాడు. పేలుడు ధాటికి ధ్వంసమైన ఇంటి గోడలు రోడ్డుమీద బైక్‌పై వెళ్తున్న మరో యువకుడికి బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. యజమాని భార్య, ఇద్దరు పిల్లలు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రకటించారు.

తునాతునకలైన గోడలు

రాజస్థాన్‌లోని కుషాల్‌పూర్‌కు చెందిన మోహన్‌లాల్ చౌదరి (42), లీల(40) దంపతులు 15 ఏండ్ల కిందట హైదరాబాద్‌కు వలసవచ్చారు. కాప్రా మండల కార్యాలయం పక్కన సాయిప్రియకాలనీలో నివాసముంటూ జ్యువెలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. వీరి పిల్లలు గోవింద్‌చౌదరి(12), నిఖితా చౌదరి(10) స్థానిక పాఠశాలలో చదువుతున్నారు. శుక్రవారం ఉదయం 7.15 గంటలకు మోహన్‌లాల్ చౌదరి ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. మొదటి అంతస్తులో ఉంటున్న వీరి ఇంటి నాలుగు గోడలు పేలుడుధాటికి తునాతునకలయ్యాయి. తీవ్రంగా కాలినగాయాలతో మోహన్‌లాల్‌చౌదరి ఇంటిపై నుంచి కిందికి అమాంతంగా పడిపోవడంతో స్థానికులు సమీపంలోని లైఫ్‌లైన్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. అదే సమయంలో యాద్రాదిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేడుపల్లికి చెందిన ఎలగందుల రవి(30)రోడ్డుమీద బైక్‌పై వెళ్తుండగా, పేలుడు ధాటికి దూసుకొచ్చిన శిథిలాలు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మోహన్‌లాల్‌చౌదరి భార్య లీల(35), పిల్లలు గోవింద్ చౌదరి(14), నిఖితా చౌదరి(11)కూడా తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్సపొందుతున్నారు. మరో నలుగురు స్వల్ప ంగా గాయపడ్డారు. పేలుడుధాటికి చుట్టుపక్కల నివాసాలు సైతం ధ్వంసమయ్యాయి. శిథిలాలు వందమీటర్ల మేర ఎగిసిపడటంతో స్థానికులు భయకంపితులయ్యారు. లైఫ్‌లైన్ దవాఖాన అద్దాలు పగిలిపోయాయి.

ఆర్థిక సహాయం ప్రకటించిన మేయర్

ఘటనాస్థలాన్ని ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి సందర్శించారు. బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని తెలిపారు. జీహెచ్ఎంసీ తరపున రూ.రెండు లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని మేయర్ బొంతు రామ్మోహన్ ప్రకటించారు. ఆపద్బంధు పథకం కింద మరో రూ.లక్ష అందజేస్తామని చెప్పారు. డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, కార్పొరేటర్ స్వర్ణరాజు,కలెక్టర్ ఎంవీ రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్, మ ల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వర్‌శర్మ, అడిషనల్ కమిషర్ సుధీర్‌కుమార్, ఏసీపీ శివకుమార్ ఘటనాస్థలంలో విచారణ చేపట్టారు.

గ్యాస్ లీకైంది: కుషాయిగూడ సీఐ చంద్రశేఖర్

ప్రాథమిక దర్యాప్తు తర్వాత గ్యాస్ లీకేజీతోనే పేలుడు సంభవించినట్టుగా భావిస్తున్నామని కుషాయిగూడ సీఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగిందా? గ్యాస్ లీకై బంగారు ఆభరణాల తయారీలో ఉపయోగించే రసాయనాల వల్ల పేలుడు సంభవించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సీఐ చంద్రశేఖర్ వివరించారు.


దారినవెళ్తుండగా పేలుడు శిథిలం తగిలి మృతిచెందిన ఎలగందుల రవి(ఫైల్)

పెండ్లయి ఏడాదిన్నర.. భార్య గర్భవతి

ఈ దుర్ఘటనలో అమాయకుడైన ఎలగందుల రవి బలైన తీరు ప్రతి ఒక్కరిని కంటతడిపెట్టింది. ఓల్డ్‌కాప్రాలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటూ ఏఎస్‌రావునగర్ సమీపంలోని సాయినాథపురంలో రవి హెయిర్ సెలూన్ నిర్వహిస్తున్నాడు. ఏడా ది కిందటే మాధవితో అతనికి వివాహమైంది. ఆమె ప్రస్తుతం గర్భవతి. శుక్రవారం ఉదయం సెలూన్‌కు బైకుపై వెళ్తుండగా పేలుడు ధాటికి శిథిలాలు దూసుకొచ్చి ఢీకొట్టడంతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకొని వచ్చిన భార్య మాధవి.. రవి మృతదేహంపై పడి విలపించడం స్థానికులను కంటతడిపెట్టించింది.

బాధిత కుటుంబాలకు కేటీఆర్ భరోసా

పేలుడు ఘటన వివరాలను ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వివరించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందిస్తామని కేటీఆర్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి, అండగా ఉంటామని పేర్కొన్నారు.



అంబేద్కర్ ఓవర్సీస్ పథకానికి.. 42 మంది ఎంపిక

- విదేశాల్లో ఉన్నత విద్యకోసం 20 లక్షలు సాయం
- పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: అజయ్‌మిశ్రా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సీ వర్గాల్లో విద్యావంతులకు విదేశాల్లో ఉన్నత విద్యనందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రా అన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ విద్యార్థుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం హైదరాబాద్‌లోని సంక్షేమభవన్‌లో చేపట్టారు. ఈ పథకం కింద అర్హులైనవారికి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, న్యూజిలాండ్, దక్షిణకొరియా దేశాల్లో ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ సైన్సెస్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లలో పోస్టుగ్రాడ్యుయేషన్ ఆపై కోర్సులు చదివేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.20 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో ఎస్సీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు పూర్తిచేయాలని ఈ సందర్భంగా అజయ్‌మిశ్రా సూచించారు. ఎస్సీ సంక్షేమశాఖ డైరెక్టర్ పీ కరుణాకర్ మాట్లాడుతూ విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ప్రభుత్వ సహాయం కోసం 48 మంది దరఖాస్తు చేసుకోగా 45 మంది హాజరయ్యారని, వారిలో 42 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల ఆర్థికసహాయంతోపాటు విమాన ప్రయాణానికి వీసా ఖర్చులు కూడా మంజూరుచేయనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమశాఖ డీడీ శ్రీనివాస్‌రెడ్డి, జేఎన్టీయూ విశ్వవిద్యాలయం, స్టేట్ కౌన్సిలింగ్ ఫర్ హయ్యర్ స్టడీస్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ పెరుగనున్న చలి

- మూడురోజుల్లో 'వెస్టర్న్ డిస్ట్రబెన్స్' ప్రభావం
- మూడు డిగ్రీల మేర తగ్గనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే మూడు రోజుల్లో చలి తీవ్రత మళ్లీ పెరిగే అవకాశమున్నదని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. పశ్చిమభారత దేశంలో మరో మూడురోజుల్లో వాతావరణంలో తీవ్ర మార్పు రానున్నదని, దాన్ని 'వెస్టర్న్ డిస్ట్రబెన్స్'గా అధికారులు వర్ణించారు. దీని ప్రభావంతో జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షాలతో పాటు మంచు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించారు. ఈ రాష్ట్రాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయికి పడిపోతాయని, నెలాఖరు వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు. వెస్టర్న్ డిస్ట్రబెన్స్ ప్రభావం తెలంగాణపైనా ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు చెప్పారు. ఈ మార్పుల కారణంగా రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల వరకు పడిపోవచ్చని అంచనావేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతున్నది. శుక్రవారం ఆదిలాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 10.8 డిగ్రీలు, రంగారెడ్డిలో 15.0, హన్మకొండలో 15.5, హైదరాబాద్‌లో 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడురోజుల తర్వాత చలితీవ్రత పెరుగవచ్చని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి నాగరత్న తెలిపారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సంగారెడ్డి	9.3	34.6
సిద్దిపేట	9.7	35.3
నాగర్‌కర్నూల్	9.9	35.0
మెదక్	10.3	34.6
మహబూబ్‌నగర్	10.4	34.9
ఆదిలాబాద్	10.8	32.0
ఆసిఫాబాద్	10.8	32.0
మంచిర్యాల	10.8	32.0
వికారాబాద్	11.0	30.1
పెద్దపల్లి	12.0	29.8
జనగామ	12.7	33.7
యాదాద్రి	12.7	34.6
సూర్యాపేట	13.0	30.0
కరీంనగర్	13.2	34.6
నిర్మల్	14.0	27.0
కామారెడ్డి	14.0	30.0
రాజన్నసిరిసిల్ల	14.0	32.0
జగిత్యాల	14.0	33.0
వనపర్తి	14.5	35.4
జోగులాంబ గద్వాల	14.6	34.6
మహబూబాబాద్	14.6	34.6
వరంగల్ రూరల్	15.0	30.0
వరంగల్ అర్బన్	15.5	30.0
హైదరాబాద్	15.0	30.8
మేడ్చల్‌మల్కాజిగిరి	15.0	30.8
రంగారెడ్డి	15.0	31.0
నిజామాబాద్	15.5	31.9
జయశంకర్	16.0	30.0
భద్రాద్రి	16.0	32.0
నల్లగొండ	17.0	31.4
ఖమ్మం	17.0	32.0

కంటివెలుగు @ 1.32 కోట్లు

రాష్ట్రంలో విస్తృతంగా వైద్య శిబిరాల నిర్వహణ


కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	గురువారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	95,213	1,31,79,482
రీడింగ్‌అద్దాలు పొందినవారు	7,457	20,40,997
ప్రత్యేకఅద్దాలకు ప్రతిపాదన	6,352	15,76,393
కంటి సమస్యలపై రెఫరల్	5,378	8,26,094

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమంలో 1,31,79,482 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పౌరులెవరూ కంటిచూపు కోల్పోవద్దన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ అధ్వర్యంలో విస్తృతంగా కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నది. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 7,892 గ్రామాల్లో, 646 వార్డుల్లో నిర్వహించిన కంటి వైద్యశిబిరాల్లో 1,31,79,482 మందికి కంటి పరీక్షలు చేయగా.. 20,40,997 మందికి కండ్లద్దాలు అందజేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 95,213 మందికి కంటిపరీక్షలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 8,625 మందికి కంటిపరీక్షలు నిర్వహించి 716 మందికి కండ్లద్దాలు పంపిణీ చేశారు. 370 మందికి అద్దాల కోసం ఆర్డర్లు చేయగా.. 306 మందికి శస్త్రచికిత్సల కోసం రెఫర్ చేశారు.

కంటి సమస్య తీరింది



చాలాకాలంగా కంటి సమస్యతో బాధపడుతున్నా. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రైవేటు వైద్యం చేయించుకోలేదు. ప్రభుత్వం కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిసి ఇక్కడకు వచ్చా. వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి కంటి సమస్యకు పరిష్కారం చూపారు.

– గొల్లపల్లి మనోహర, మేదరబస్తీ, కొత్తగూడెం

మంఖాల్‌లో మౌలిక వసతులు పూర్తి

- ప్లాస్టిక్‌పార్కులో స్థలాల కేటాయింపే మిగిలింది.
- తాప్మా సదస్సులో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ వెల్లడి

తెలుగుయూనివర్సిటీ: ప్లాస్టిక్, పాలిమర్ పరిశ్రమల కోసం రంగారెడ్డి మహేశ్వరం మండలం మంఖాల్ గ్రామంలో కేటాయించిన వందెకరాల ప్లాస్టిక్ పార్క్‌లో మౌలిక వసతుల కల్పన పూర్తయిందని, ఇక కేవలం ఆయా స్థలాలను లబ్ధిదారులకు కేటాయించడమే మిగిలిందని రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. హైదరాబాద్‌లో 1965లో మొదటి ప్లాస్టిక్ పరిశ్రమను స్థాపించారని, ప్రస్తుతం 15 వందలకుపైగా ఆ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్లాస్టిక్ మ్యాన్యుఫాక్చరస్ అసోసియేషన్ (తాప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన తాప్మా పాలిమర్స్ కాన్ఫరెన్స్-2019లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా, పారిశ్రామికంగా ఎదుగుదలలో ప్లాస్టిక్ పరిశ్రమ పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ప్లాసిక్, పాలిమర్ పరిశ్రమల వ్యాపారవేత్తలు రెండో, మూడోయూనిట్ మంఖాల్‌లో ఏర్పాటుచేయడం కోసం పరిశ్రమలశాఖను సంప్రదించవచ్చని జయేశ్‌రంజన్ సూచించారు. ఇక భారీస్థాయి పరిశ్రమల ఏర్పాటు కోసం ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన ఉన్న సుల్తాన్‌పూర్‌లో స్థలం సిద్ధంగా ఉందని వెల్లడించారు. తాప్మా అధ్యక్షుడు బీఎల్ బండారీ మాట్లాడుతూ తాప్మాను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. సదస్సులో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీవోవో పునీత్‌మదన్, విండ్మల్లర్ అండ్ హోల్చేర్ (జర్మనీ) మేనేజింగ్ పార్టనర్ పీటర్ స్టేయింబ్యాంక్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ప్రేం కంకారియా, వినీత్, కాన్ఫరెన్స్ కమిటీ చైర్మన్ శివకుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.


శుక్రవారం హైదరాబాద్‌లో తాప్మా పాలిమర్స్ కాన్ఫరెన్స్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

మార్చి తొలివారంలో 'లోక్‌సభ' షెడ్యూల్!

పోలింగ్ దశలు, తేదీల ఖరారుపై ఈసీ కసరత్తు



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల సమరానికి మార్చి మొదటి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుత లోక్‌సభ గడువు జూన్ 3తో ముగియనుంది. ఈ నేపథ్యంలో తదుపరి లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఈసీ కసరత్తు చేస్తున్నదని అధికారులు తెలిపారు. భద్రతా సిబ్బంది, ఇతర అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ దశలను, తేదీలను ఖరారు చేయనున్నట్లు చెప్పారు. మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలతో పాటే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలకు కూడా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. గతేడాది నవంబర్‌లో జమ్ము కశ్మీర్ అసెంబ్లీ రద్దయిన నేపథ్యంలో ఆ రాష్ర్టానికి కూడా ఆరు నెలల్లోగా మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మే నెలతో ఆ గడువు ముగియనుంది. దీంతో జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి కూడా లోక్‌సభతో పాటే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అయితే భద్రత కారణాల రీత్యా అంతకంటే ముందుగానే ఎన్నికలు నిర్వహించవచ్చని తెలుస్తున్నది. వాస్తవానికి జమ్ము కశ్మీర్ అసెంబ్లీ గడువు 2021 మార్చి 16 వరకు ఉంది (జమ్ము కశ్మీర్ అసెంబ్లీ గడువు ఆరేండ్లు కాగా, మిగతా రాష్ర్టాలకు ఐదేండ్లు మాత్రమే). అయితే అక్కడి రాజకీయ పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ రద్దయింది. సిక్కిం అసెంబ్లీ గడువు 2019 మే 27న, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ జూన్ 18న, ఒడిశా అసెంబ్లీ జూన్ 11న, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ గడువు జూన్ 1న ముగియనుంది. 2004లో ఫిబ్రవరి 29న నాలుగు దశల లోక్‌సభ ఎన్నికలకు ఈసీ షెడ్యూల్‌ను ప్రకటించింది. 2009లో మార్చి 2న షెడ్యూల్ వెలువడగా, ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఇక 2014లో మార్చి 5న ఈసీ షెడ్యూల్‌ను ప్రకటించగా, తొమ్మిది దశల్లో ఎన్నికలు నిర్వహించారు. ఏప్రిల్ 7న తొలి దశ ఎన్నికలు జరుగగా, మే 12న చివరి దశ ఎన్నికలు జరిగాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా

మహేశ్వరి, సంజీవ్ ఖన్నా ప్రమాణం

సర్వోన్నత న్యాయస్థానంలో 28కి చేరుకున్న జడ్జీల సంఖ్య



జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్‌లు దినేశ్ మహేశ్వరి, సంజీవ్ ఖన్నా ప్రమాణం చేశారు. వారితో చీఫ్ జస్టిస్ (సీజేఐ) రంజన్ గొగోయ్ శుక్రవారం ప్రమాణం చేయించారు. దీంతో మొత్తం ప్రస్తుతం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 28కు చేరుకున్నది. సుప్రీంకోర్టులో ఉండాల్సిన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 31. కాగా, కర్ణాటక హైకోర్టు చీఫ్‌జస్టిస్‌గా ఉన్న మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఖన్నాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమిస్తూ బుధవారం నోటిఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. అయితే పలువురు సీనియర్లను పక్కనపెట్టి సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్‌లు మహేశ్వరి, సంజీవ్ ఖన్నాలకు పదోన్నతి కల్పించడంపై తీవ్ర వివాదం చెలరేగింది.

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయాయి

కేంద్రంపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అసంతృప్తి



మోహన్ భగవత్

నాగ్‌పూర్, జనవరి 18: కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయాయని, వీటి ప్రభావాన్ని ప్రజలందరూ భరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. నాగ్‌పూర్‌లో శుక్రవారం ప్రహర్ సమాజ్ జాగృతి సంస్థ రజతోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. 'ప్రభుత్వ విధానాలు అందరిపై ప్రభావం చూపుతాయి. వీటిని నేను కానీ మీరు కానీ రూపొందించం. కానీ మనమందరం వాటి ప్రభావాన్ని భరించాలి' అని భగవత్ వ్యాఖ్యానించారు. అలాగే నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయాయని, వీటికి మనం బాధ్యులు కాకపోయినా వాటి బాధలు మాత్రం పడాల్సి వస్తున్నదన్నారు. యుద్ధం జరగకపోయినా సరిహద్దుల్లో జవాన్లు ప్రాణాలు కోల్పోతున్నారని, మన కర్తవ్యాన్ని మనం సరిగా నిర్వర్తించకపోవడమే ఇందుకు కారణమని భగవత్ గురువారం వ్యాఖ్యానించారు. దేశ భద్రత కేవలం సైనికుల విధి మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ ఇందుకు కృషి చేయాలని కోరారు.

2025నాటికి రామమందిరం పూర్తి: భయ్యాజీ

అయోధ్యలో రామ మందిరం 2025నాటికి అందుబాటులోకి వస్తుందని ఆరెస్సెస్ నేత భయ్యాజీ జోషి చెప్పారు. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏడాదికి రామాలయం పూర్తవుతుందని తెలిపారు.

ఏ పార్టీలో చేరను

- రాజకీయ పార్టీలేవీ నిజాయితీగా లేవు
- గో భక్తులు సంక్రాంతి రోజున గో పూజలు చేయకుండా.. ఢిల్లీ రిసార్టులకెందుకు వెళ్లారు?
- రామరాజ్యం అంటే ఇదేనా?: నిలదీసిన సినీనటుడు ప్రకాశ్ రాజ్



బెంగళూరు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానన్న సినీనటుడు ప్రకాశ్‌రాజ్ తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోనన్నారు. రాజకీయ పార్టీలేవీ నిజాయితీగా వ్యవహరించడం లేదన్నారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న ప్రకాశ్ రాజ్.. 'మూడు నెలలకు మించి నేను ఏ పార్టీలోనూ ఉండలేను' అని శుక్రవారం మీడియాతో చెప్పారు. జేడీఎస్- కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ.. 'సిగ్గులేని వ్యక్తుల సమూహం' అని మండిపడ్డారు. 'వారికి వారు గో భక్తులం అని చెప్పుకుంటారు. కానీ గోవులను పూజించే ముఖ్యమైన పండుగ (మకర సంక్రాంతి) నాడు మాత్రం వారు సొంతింటికి దూరంగా ఢిల్లీలోని రిసార్ట్‌లో క్యాంప్‌లో బస చేస్తారు' అని ఎద్దేవా చేశారు. ఢిల్లీ, లక్నోల్లో ఏసీ రూమ్‌లలో ఉంటున్న వారు అయోధ్యలో రామ మందిరం అంశంపై రాజకీయాలు చేస్తున్నారని ప్రకాశ్ రాజ్ విమర్శించారు. అసలు మీడియా ప్రతినిధులు అయోధ్యకు వెళ్లి అక్కడి ప్రజల స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని కోరారు. రామరాజ్యం కావాలని అడుగుతున్న వారు తీసుకొచ్చే రామరాజ్యం ఇదేనా? అని ప్రశ్నించారు.

డ్యాన్స్‌బార్లకు వ్యతిరేకంగా ఆర్డినెన్స్?

మహారాష్ట్ర ప్రభుత్వ యోచన

ముంబై: డ్యాన్స్ బార్లను పునఃప్రారంభించడానికి అనుమతినిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో కోర్టు నిర్ణయానికి వ్యతిరేకంగా ఆర్డినెన్స్ తేవాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. రాష్ట్ర సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించేందుకు డ్యాన్స్ బార్ల నిర్వహణను నిలిపివేసేందుకు ఒక ఆర్డినెన్స్ తేవాలని తమ ప్రభుత్వం యోచిస్తున్నదని మహారాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి సుధీర్ ముంగంటివార్ శుక్రవారం మీడియాతో చెప్పారు.

51 మంది మహిళలు అయ్యప్ప సన్నిధికి

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత శబరిమల ఆలయంలోకి వెళ్లారు	వారంతా 50 ఏండ్లలోపు వారే	సుప్రీంకోర్టుకు తెలిపిన కేరళ సర్కార్	బిందు, కనకదుర్గలకు రక్షణ కల్పించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 18:



కనకదుర్గ

బిందు



శబరిమల ఆలయంలోకి 50 ఏండ్లలోపు మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు నిషేధాన్ని ఎత్తివేసిన తర్వాత ఇప్పటివరకూ 51 మంది మహిళలు అయ్యప్పను దర్శించుకున్నట్లు కేరళ ప్రభుత్వం ప్రకటించింది. వారంతా 50 ఏండ్ల లోపు వారేనని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన జాబితాను సుప్రీంకోర్టుకు శుక్రవారం అందజేసింది. అయ్యప్ప ఆలయంలోకి అడుగుపెట్టిన తొలి ఇద్దరు మహిళలు కనకదుర్గ (42), బిందు అమ్మిని (44) తమకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని కోరుతూ న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కేరళ ప్రభుత్వం ఇప్పటివరకూ ఆలయంలోకి ప్రవేశించిన 51 మంది మహిళల జాబితాను కోర్టుకు సమర్పించింది. 'శబరిమలలో అయ్యప్ప దర్శనం కోసం సుమారు 16 లక్షల మంది భక్తులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 7,564 మంది మహిళలు కూడా ఉన్నారు. వీరంతా 10-50 ఏండ్ల మధ్య వయస్కులే. ఇందులో 51 మంది మహిళలు ఇప్పటికే అయ్యప్పను దర్శించుకున్నారు. దర్శన సమయంలో వీరికి ఎలాంటి అవాంతరాలు తలెత్తలేదు. 16 నవంబరు 2018 నుంచి నేటి వరకు సుమారు 44 మంది లక్షల మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు' అని న్యాయస్థానానికి కేరళ సర్కార్ నివేదించింది.

24 గంటలు రక్షణ కల్పించండి

మరోవైపు ఆలయంలోకి తొలిసారి ప్రవేశించిన కోజికోడ్ జిల్లాకు చెందిన సీపీఐ (ఎంఎల్) కార్యకర్త, లెక్చరర్ బిందు అమ్మిని, మలప్పురానికి చెందిన సివిల్ సప్లై విభాగం ఉద్యోగి కనకదుర్గలకు నిరంతర రక్షణ కల్పించాలని కేరళ పోలీసుల్ని చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఎల్ఎన్ రావు, జస్టిస్ దినేశ్ మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులతో నిమిత్తం లేకుండా ఇద్దరు మహిళలకు ఇప్పటికే రక్షణ కల్పించామని, భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని కేరళ సర్కార్ తరుపున సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా కోర్టుకు తెలిపారు. అలాగే ఆలయాన్ని దర్శించుకున్న 51 మంది మహిళలకు కూడా తగిన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. జనవరి 2న శబరిమల ఆలయంలోకి ప్రవేశించినందుకు తమకు తీవ్ర బెదిరింపులు వచ్చాయని, ప్రాణహాని ఉందంటూ ఇద్దరు మహిళలు కోర్టుకు నివేదించారు. ప్రాణభయంతో రెండు వారాలపాటు ఇంటికి వెళ్లకుండా అజ్ఞాతంలో గడిపామని పేర్కొన్నారు. ఈ నెల 15న ఇంటివెళ్లిన కనకదుర్గను స్వయంగా ఆమె అత్త దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. ప్రస్తుతం కనకదుర్గ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మహిళలిద్దరూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. అలాగే ఆలయంలోకి వెళ్లాలనుకునే ఇతర మహిళా భక్తులకు రక్షణ కల్పించాలని అందులో కోరారు. బిందు, కనకదుర్గల తరుపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదనలు వినిపిస్తూ ఇరువురికి భద్రత కల్పించాలని విన్నవించారు. అలాగే 50 ఏండ్ల లోపు మహిళల ఆలయ ప్రవేశం అనంతరం అయ్యప్ప సన్నిధానాన్ని శుద్ధి చేయడాన్ని నిలిపివేయాలని ఆమె ధర్మాసనాన్ని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం పిటిషనర్ల ప్రతిష్ఠకు ఇది భంగం కలిగించమేనని వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఆలయ శుద్ధి చేపట్టవద్దని ప్రధాన అర్చకుడికి తాము ఆదేశాలివ్వలేమని తెలిపింది. శబరిమల వివాదానికి సంబంధించిన 48 పిటిషన్లను జత చేసి, ఒకేసారి విచారణ కొనసాగించాలని ఇందిరా జైసింగ్ కోరగా, చీఫ్ జస్టిస్ తిరస్కరించారు. ఆ పిటిషన్లను, ప్రస్తుత పిటిషన్‌ను ఒకేగాటన కట్టలేమన్నారు. మరోవైపు మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపర తన వాదనలు వినిపిస్తూ.. అయ్యప్పను 50 ఏండ్ల లోపు మహిళలెవరూ దర్శించుకోలేదని చెప్పారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు సెప్టెంబర్ 28న సంచలన తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే.

విపక్షాల బలప్రదర్శన నేడే

- కోల్‌కతాలో నేడు భారీ బహిరంగ సభ
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన మమత
- హాజరుకానున్న వివిధ పార్టీల నేతలు
- దీదీకి కాంగ్రెస్ అధినేత రాహుల్ మద్దతు

తన అభిప్రాయాన్ని రుద్దబోనన్న మమత

మాయావతి తరపున రాజ్యసభ సభ్యుడు సతీశ్ మిశ్రా రాక



కోల్‌కతాలో సభకు ఏర్పాట్లు చేస్తున్న తృణమూల్ కార్యకర్తలు

కోల్‌కతా, జనవరి 18: అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం నిర్వహించనున్న భారీ రాజకీయ సభకు పలువురు ప్రతిపక్ష నేతలు హాజరుకానున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు విపక్షాల బలాన్ని చాటడమే లక్ష్యంగా 'యునైటెడ్ ఇండియా' ర్యాలీ పేరిట కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ సభను నిర్వహించనున్నారు. స్వాతంత్ర్యానంతరం పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న అతిపెద్ద బహిరంగ సభ ఇదేనని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఎన్నికల కమిషన్ ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ముందు ప్రతిపక్షాలు ఐక్యంగా నిర్వహించే మొదటి, చివరి బహిరంగసభ ఇదే కావచ్చు. ఈ సభకు హాజరుకానున్న పలువురు విపక్షనేతలు పరస్పర భేటీలు జరిపే అవకాశం కూడా ఉన్నది. కేంద్రంలో అత్యున్నత (ప్రధాన మంత్రి) పదవి కోసం మమతా బెనర్జీ చేపట్టే ఎన్నికల ప్రచారానికి 'లాంచ్ ప్యాడ్'గా ఈ ఈవెంట్‌ను రాజకీయ పరిశీలకులు చూస్తున్నారు. ఈ సభలో తన అభిప్రాయాన్ని ఎవరిపైనా రుద్దబోనని, తనకు తాను వెనకుండి ఇతర ప్రాంతీయ పార్టీల నేతల గళాన్ని వినిపించేందుకు వీలుకల్పిస్తానని మమతా బెనర్జీ తెలిపారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీల నేతలను తన అతిథులుగా ఆమె అభివర్ణిస్తూ.. ప్రతి పార్టీకి కొన్ని అనివార్యతలు, సొంత ఆలోచనలు, సిద్ధాంతాలు ఉంటాయని, వాటిని గౌరవిస్తామని అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో అంచనా వేయలేనని, అయితే బీజేపీకి మాత్రం 125 సీట్లకు మించి రావని మమతా బెనర్జీ చెప్పారు.

హాజరయ్యేదెవరు?

ఎన్సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ) అధినేత శరద్ పవార్, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, మాజీ ప్రధాని, జనతాదళ్ సెక్యులర్ (జేడీ-ఎస్) అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడ, కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ సమన్వయకర్త అరవింద్ కేజ్రీవాల్, ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత ఎన్ చంద్రబాబు నాయుడు, రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) అధినేత అజిత్ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతాంత్రిక్) అధినేత బాబూలాల్ మరాండీ, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నేత తేజస్వి యాదవ్, ఆలిండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాతోపాటు బీజేపీ మాజీ నాయకులు యశ్వంత్ సిన్హా, రాంజెఠ్మలానీ, అరుణ్ శౌరీ, బీజేపీ ఎంపీ శత్రుఘ్న తదితరులు ఈ సభకు హాజరవుతారని భావిస్తున్నారు.


గైర్హాజరయ్యేదెవరు?

ఐక్య ప్రగతిశీల కూటమి (యూపీఏ) చైర్‌పర్సన్ సోనియా గాంధీతోపాటు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ సభకు హాజరుకావడంలేదు. అయితే ఈ సభను నిర్వహిస్తున్న మమతా బెనర్జీకి నైతిక మద్దతు తెలుపుతున్నట్టు రాహుల్ గాంధీ ప్రకటించారు. 'విపక్షాల ఐక్యతను చాటిచెప్పబోతున్న మమతా దీదీకి మద్దతు తెలియజేస్తున్నా. ఈ సభ ద్వారా మనం దేశం ఐక్యంగా ఉన్నదన్న బలమైన సందేశాన్ని ఇవ్వగలమని ఆశిస్తున్నా' అని రాహుల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ తరపున సీనియర్ నాయకులు మల్లిఖార్జున్ ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీ ఈ సభకు హాజరవుతారని ఆ పార్టీ ధ్రువీకరించింది. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి కూడా ఈ సభకు హాజరుకావడంలేదు. ఆమె తరపున రాజ్యసభ సభ్యుడు సతీశ్ మిశ్రా హాజరుకానున్నారు. సీపీఎంతో పాటు ఇతర వామపక్షాల నేతలు కూడా ఈ సభకు రావడంలేదు. దీనిపై మమతా బెనర్జీ స్పందిస్తూ.. తన బాధ్యత నిర్వర్తించానని, కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌ను ఈ సభకు ఆహ్వానించానని చెప్పారు. రాజకీయ అనివార్యతల వల్ల ఎవరైనా ఈ సభకు రాకూడదని నిశ్చయించుకుంటే వారి నిర్ణయాన్ని గౌరవిస్తానని తెలిపారు. గతేడాది మే నెలలో కర్ణాటక ముఖ్యమంత్రిగా కుమారస్వామి, డిసెంబర్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎంలుగా అశోక్ గెహ్లాట్, కమల్‌నాథ్, భూపేశ్ భగేల్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు కూడా విపక్షాలు ఇదేవిధమైన బలప్రదర్శనలు చేసిన విషయం విదితమే.

అసెంబ్లీలో మహిళలకు

33 శాతం రిజర్వేషన్

- రాజస్థాన్ సర్కారు ప్రాథమిక నిర్ణయం
- త్వరలో సభలో తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించిన సీఎం అశోక్ గెహ్లాట్




గెహ్లాట్

జైపూర్: రాష్ట్ర అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ శుక్రవారం ప్రకటించారు. రిజర్వేషన్లపై సభలో త్వరలోనే తీర్మానం ప్రవేశపెడతామన్నారు. 'మహిళలకు అసెంబ్లీలో 33 శాతం రిజర్వేషన్ల కల్పనకు రాష్ట్ర క్యాబినెట్ ఏకాభిప్రాయం తెలిపింది. సభలో త్వరలో తీర్మానం ప్రవేశపెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించాం. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఉన్న ఐదు రాష్ర్టాల్లోనూ మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తేవాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ భావిస్తున్నారు' అని గెహ్లాట్ మీడియాతో అన్నారు. , ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారా? లేదా? అనే విషయాన్ని మాత్రం గెహ్లాట్ వెల్లడించలేదు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ గతంలో పోరాడారని ఆయన గుర్తుచేశారు. యూపీఏ హయాంలో సోనియా కృషితోనే మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిందన్నారు. డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పేర్కొన్నామని, ప్రస్తుతం ఆ హామీని నెరవేర్చే దిశగా సాగుతున్నామని తెలిపారు.

యూపీ మైనింగ్ కేసులో సమన్లు

- విచారణకు హాజరు కావాలని ఐఏఎస్ అధికారి చంద్రకళ, ఎస్పీ ఎమ్మెల్సీ రమేశ్, మరో ఇద్దరిని ఆదేశించిన ఈడీ



చంద్రకళ

న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నలుగురికి సమన్లు జారీ చేసింది. సమన్లు జారీ అయిన వారిలో తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారి చంద్రకళ, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ రమేశ్‌కుమార్ మిశ్రా కూడా ఉన్నారు. 2012 నుంచి 2016 మధ్య హమీర్‌పూర్‌లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఈడీ కూడా మనీల్యాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగానే నలుగురికి సమన్లు జారీ చేసిన ఈడీ.. ఈ నెల 24, 28 తేదీల్లో లక్నోలోని దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని ఆదేశించింది. అక్రమ ఇసుక తవ్వకాల సందర్భంగా హవాలా మార్గంలో డబ్బులు చేతులు మారాయా? ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుల ఆస్తులు పెరిగాయా? తదితర విషయాలపై ఈడీ దర్యాప్తు చేయనుంది.

బీజేపీని గెలిపిస్తే.. ప్రమోషన్

- డిప్యూటీ కలెక్టర్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్.. మధ్యప్రదేశ్‌లో ఘటన

భోపాల్, జనవరి 18: ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని డిప్యూటీ కలెక్టర్‌ను ఒక జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు భావిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. మధ్యప్రదేశ్‌లోని షాహ్డోల్ జిల్లా జైత్‌పూర్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉమా ధృవె ఆధిక్యంలో ఉన్నారని వార్తలు రావడంతో తన డిప్యూటీ కలెక్టర్ పూజా తివారీతో మాట్లాడిన కలెక్టర్ అనుభా శ్రీవాత్సవ.. బీజేపీ అభ్యర్థి గెలుపునకు ప్రయత్నించాలని సూచించినట్లున్న వీడియో క్లిప్పింగ్‌లు వెలువడ్డాయి. చెప్పిన పని చేస్తే ప్రమోషన్ ఇస్తామని పూజా తివారీకి అనుభా శ్రీవాత్సవ హామీ ఇచ్చినట్లు ఆ వీడియోలో ఉంది. అయితే ఈ వీడియోను ఇద్దరు అధికారులు ఖండించారు. ఇది బూటకపు వీడియో అని, తమ మధ్య అటువంటి సంభాషణే జరుగలేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోం

లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తాం: ఆప్

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోబోమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్పష్టం చేసింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్‌ల్లోని అన్ని లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామన్నది. శుక్రవారం ఆప్ నేత గోపాల్ రాయ్ మాట్లాడుతూ ఆప్‌తో పొత్తును వ్యతిరేకిస్తూ ఇటీవల పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్, ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షీలాదీక్షిత్ ప్రకటనలు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దేశ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ అనే విషం తాగడానికి(పొత్తు పెట్టుకోవడానికి) తాము సిద్ధమేనని, కానీ ఆ పార్టీ అహంకారం ఇంకా తగ్గలేదని కాంగ్రెస్ నాయకుల ప్రకటనలను చూస్తే అర్థమవుతున్నదన్నారు. అందుకే ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించామని, త్వరలోనే అభ్యర్థులను కూడా ప్రకటిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి భావసారుప్యత ఉన్న పార్టీలతో కలిసి పోటీ చేస్తే బాగుంటుందని అనుకున్నామని, ఇందులో భాగంగానే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే మంచి ఫలితాలు వస్తాయని మమతాబెనర్జీ, చంద్రబాబు, స్టాలిన్ తదితరులు సూచించారని తెలిపారు. తమతో పొత్తు పెట్టుకోవడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్న విషయం ఆ పార్టీ నాయకుల ప్రకటనలతో అర్థమవుతున్నదని చెప్పారు. ఆప్ నేత గోపాల్‌రాయ్ అభిప్రాయంపై తాను స్పందించనని షీలా దీక్షిత్ తెలిపారు. ఢిల్లీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ తామూ ఒంటరిగా పోటీ చేస్తామన్నారు. కాగా, ఇటీవల షీలాదీక్షిత్ మాట్లాడుతూ జాతీయ పార్టీ కాంగ్రెస్, చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోదని అన్నారు. పంజాబ్‌లో ఆప్‌కు స్థానం లేదని అమరీందర్ సింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కర్ణాటకం రసవత్తరం!

- సీఎల్పీ భేటీకి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల డుమ్మా
- వారిపై కఠిన చర్యలు తప్పవని మాజీ సీఎం సిద్దరామయ్య హెచ్చరిక
- బెంగళూరు సమీపంలోని ఈగల్టన్ రిసార్ట్స్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేల తరలింపు



కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రిసార్ట్‌కు తరలిస్తున్న బస్సు

బెంగళూరు: కర్ణాటక రాజకీయాలు రోజురోజుకు రసవత్తర మలుపు తీసుకుంటున్నాయి. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు సీఎం హెచ్‌డీ కుమారస్వామి ప్రభుత్వానికి ఇటీవల మద్దతు ఉపసంహరించుకోగా, తాజాగా నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎల్పీ సమావేశానికి డుమ్మా కొట్టారు. దీంతో కాంగ్రెస్ తన ఎమ్మెల్యేల్ని బెంగళూరు శివారులోని ఈగల్టన్ రిసార్ట్స్‌కు రెండు బస్సుల్లో తరలించింది.

అనారోగ్యంతో ఒకరు.. కోర్టు కేసు పేరుతో మరొకరు..

బీజేపీకి పోటీగా తమ బల నిరూపణకు సీఎల్పీ నేత సిద్దరామయ్య అధ్యక్షతన శుక్రవారం బెంగళూరులో సీఎల్పీ భేటీ నిర్వహించారు. ఈ భేటీకి గోకక్ ఎమ్మెల్యే రమేశ్ జర్కిహోళి, చించోలి ఎమ్మెల్యే ఉమేశ్ జాదవ్, అథాని ఎమ్మెల్యే మహేశ్ కుమటహళ్లి, బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బీ నాగేంద్ర గైర్హాజయ్యారు. ఇటీవల తనను క్యాబినెట్ నుంచి తప్పించడంతో రమేశ్ జర్కిహోళి తీవ్ర ఆగ్రహంతో ఉన్నా రు. కాగా, అనారోగ్యంతోనే సీఎల్పీ భేటీకి రాలేనని ఎమ్మెల్యే ఉమేశ్ జాదవ్, కోర్టు కేసుతో రావడం లేదని నాగేంద్ర కబురు చేశారు. మిగతా ఇద్దరు రెబెల్ ఎమ్మెల్యేలు టచ్‌లో లేరు. నలుగురు ఎమ్మెల్యేల గైర్హాజరుపై సిద్దరామయ్య అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. 'వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్-జేడీఎస్ కలిసి పోటీ చేస్తే రాష్ట్రంలో బీజేపీ అడ్రస్ గల్లంతవుతుంది. మా ఎమ్మెల్యేలకు రూ. 50 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు బీజేపీ నేతలు ఎరవేశారు. కాపలాదారైన మోదీకి ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది. మా ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనేదే మోదీ, అమిత్‌షా లక్ష్యం. సీఎల్పీ భేటీకి 76 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మేం బీజేపీ ఎమ్మెల్యేల మాదిరిగా గుర్గావ్‌కు పారిపోలేదు' అని అన్నా రు.ముగ్గురు రెబల్ ఎమ్మెల్యేలు ముంబైలోని ఓ హోటల్‌లో బసచేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేల గైర్హాజరు అంశం కాంగ్రెస్ అంతర్గతమని, ప్రస్తుతం ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీలేదని సీఎం కుమారస్వామి మీడియాతో అన్నారు. కాంగ్రెస్‌లో పరిస్థితి సవ్యంగా లేదని బీజేపీ నేత యెడ్యూరప్ప వ్యాఖ్యానించారు.



బీజేపీ తప్పుడు పాలనకు వ్యతిరేకంగా 'ఐక్య భారత్' ర్యాలీ నిర్వహిస్తున్నాం. ఇది బీజేపీకి చావుదెబ్బ. కాషాయ పార్టీకి 125 సీట్లకు మించి రావు. ప్రాంతీయ పార్టీల కూటమికి బీజేపీకన్నా ఎక్కువ సీట్లు వస్తాయి. మేమే అధికారాన్ని చేజిక్కించుకుంటాం.

మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

బెంగళూరు సెంట్రల్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి నేను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటాను. దీనికోసం జనవరి 20 నుంచి 15 రోజులు నియోజక వర్గంలో పర్యటించి ప్రజా మ్యానిఫెస్టోను తయారుచేస్తాను. నేను ఏ పార్టీలో చేరను. ప్రజల అభ్యర్థిగా స్వతంత్రంగానే ఉంటాను.

ప్రకాశ్‌రాజ్, ప్రముఖ సినీ నటుడు



చరిత్రలో నేడు



1941
ఎరిత్రియా పై బ్రిటన్ దాడి.

1942
బర్మాను ఆక్రమించిన జపాన్ సేనలు.





1966
భారత 4వ ప్రధానిగా ఇందిరాగాంధీ ఎన్నిక.

సుప్రీం న్యాయమూర్తుల నియామకంలో కొలీజియం పాత్ర మరోసారి వివాదాస్పదమవుతున్నది. న్యాయవ్యవస్థ ఉన్నత స్థానాల్లోని వర్గాల్లే గాక, ప్రజల్లో కూడా కొలీజియం పనితీరు చర్చనీయాంశమవుతున్నది. గత డిసెంబర్ 12న చేసిన నిర్ణయాలకు విరుద్ధంగా తాజా నియామకాలు జరిగాయని విమర్శలొస్తున్నాయి. అనుభవాన్ని గాలికివదిలి ఇష్టానుసారం నియామకాలు చేపట్టారనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. ఏదేమైనా న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత, నిష్పాక్షికత లోపించటం శ్రేయస్కరం కాదు.

ది హిందూ

'ఎన్ని ఓటములు ఎదురైనా సిగ్గుపడకు, ప్రయత్నాలు ఆపొద్దు' అన్నది బీజేపీ తన విధానంగా స్వీకరించినట్టు ఉన్నది. కర్ణాటకలో బీజేపీ ఇదే తీరుగా వ్యవహరిస్తున్నది. అధికార జేడీ(ఎస్)-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ పట్టువదలకుండా ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే అధికారపక్షాన్ని అస్థిరపరచేందుకు రెండుసార్లు ప్రయత్నించి విఫలమైంది. తాజాగా ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ప్రయత్నించి ఘోరంగా విఫలమైంది. అధికారపక్షంలో కుమ్ములాటలు ముదిరి పాకాన పడకముందే బీజేపీ తొందరపాటుతో వ్యవహరిస్తున్న తీరు విడ్డూరంగా ఉన్నది.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

కేటీఆర్-జగన్ భేటీ

టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇటీవల వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో జరిపిన సమావేశం పలువిధాలుగా ప్రాధాన్యం గలది. ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నం దేశ రాజకీయ స్వరూపాన్ని సమూలంగా మార్చే మహత్తర ప్రయోగం. ఇదే జరిగితే రాష్ర్టాలకు అధికారాలు పెరిగి దేశ సమాఖ్య స్వభావమే మారిపోతుంది. తెలంగాణ, ఏపీ రాష్ర్టాల ఎంపీలు పార్లమెంట్‌లో సమన్వయంతో వ్యవహరిస్తే బలమైన జట్టుగా ఏర్పడి తమ డిమాండ్లను సులభంగా సాధించుకోవచ్చు. ప్రతిదానికి కేంద్రాన్ని బతిమాలుకోవలసిన దుస్థితి ఉండదు. తెలంగాణ, ఏపీలలోని రాజకీయపక్షాల మధ్య సత్సంబంధాలు నెలకొంటే రెండు రాష్ర్టాలను వేధిస్తున్న అనేక సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు. నిజానికి ఈ సమస్యలన్నీ రాజకీయ నాయకులు స్వార్థం కోసం సృష్టించినవి. నాయకులు విజ్ఞతతో వ్యవహరిస్తే ప్రజలు హర్షిస్తారు. కేటీఆర్, జగన్ భేటీ వల్ల ఏ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం లేదు. అయినా ఈ భేటీపై టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన అనుచరగణాలు కొంపలు మునిగిపోయినట్టు గగ్గోలు పెట్టడం విచిత్రంగా ఉన్నది. ఈ ఇరువురు యువనాయకుల భేటీ అంతరంగంలో చంద్రబాబు అనుసరించిన కుత్సిత రాజకీయాలకు భిన్నంగా ఉండటం వల్లనే ఇంత రాద్ధాంతం చేస్తున్నారు. ఎన్నికలు సమీపించినప్పుడు, బాబ్లీ ప్రాజెక్టు దగ్గరకు పోయి చొక్కా చింపుకొని ప్రజలను రెచ్చగొట్టాలనుకోవడం చంద్రబాబు తరహా రాజకీయం. గోదావరి నదిపై ప్రాజెక్టులకు సంబంధించి ముంబై వెళ్లి మహారాష్ట్ర ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా చర్చించి ఒప్పందం కుదుర్చుకోవడం కేసీఆర్ తరహా రాజనీతి. ఈ దృక్కోణంలో తేడానే కేటీఆర్-జగన్ భేటీపై చంద్రబాబు చిందులు వేయడానికి కారణం.

ఇప్పుడు ఏకంగా వైఎస్సార్సీపీ చర్చలు కూడా జరుపుతుండటంతో పాతకాలపు రోత రాజకీయాలకు అలవాటుపడిన చంద్రబాబుకు ఒంటినిండా జెర్రులు పాకినట్టుగా ఉన్నది. చంద్రబాబు వంటి కుటిల రాజకీయ నాయకులు, వారి గణాలు ఎంత మొత్తుకున్నా, తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య సంఘీభావాన్ని పెంపొందించి, అభివృద్ధిపథంలో నడిపించవలసిన బాధ్యత రెండు రాష్ర్టాల్లోని బాధ్యతాయుత రాజకీయపక్షాలపై ఉన్నది.

ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలు ఇప్పటికే ఫలితాన్నిచ్చాయనేది జాతీయ రాజకీయాలను గమనించేవారికి ఎవరికైనా అర్థమవుతుంది. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణానికి ప్రయత్నించేనాటికి ఏదో జాతీయపార్టీని ఆలంబన చేసుకొని నిలబడాలనే దుర్బల మనస్తత్వం ప్రాంతీయ పార్టీలకు ఉండేది. లోక్‌సభ ఎన్నికల్లో ఏ జాతీయపార్టీకి మెజార్టీ రానప్పటికీ రెండింటిలో ఏదో ఒకదానిని భుజాన మోయడం తప్ప గత్యంతరం లేదనే అభిప్రాయం పాతుకపోయి ఉన్నది. ఏదో ఒక జాతీయపార్టీతో అవగాహన కుదుర్చుకొని, యూపీఏలో లేదా ఎన్డీయేలో చేరడం వరకు మాత్రమే ప్రాంతీయపార్టీల నాయకులు ఆలోచించేవారు. కేసీఆర్ ముందుకు వచ్చేవరకు ఈ చట్రం నుంచి ప్రాంతీయ నాయకులు బయటపడలేదు. ప్రాంతీయ పార్టీల బలహీనత జాతీయపార్టీలకు పెద్దరికాన్ని ఇచ్చింది. ఆయా జాతీయపార్టీల నాయకులు ప్రాంతీయ పార్టీల అధినేతలతో నయా జమీందారుల్లా అహంకార పూరితంగా వ్యవహరించిన సందర్భాలూ ఉన్నాయి. కేంద్రంతో సఖ్యత లేకపోతే నిధులు రావని, కేసులు పెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తాయని, రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోస్తాయని భయాందోళనలు ఉండేవి. ఏదో ఒక జాతీయపార్టీని పట్టుకొని యాల్లాడాలనే పాతకాలపు మనో దౌర్బల్యంతోనే టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీజేపీని మోసినంత కాలం మోసి, ఇప్పుడు యూపీఏ పల్లకీని మోస్తున్నాడు. కాంగ్రెస్ కూటమిలో కొనసాగుతూ అందుకు అనుగుణంగా వివిధ పార్టీల నాయకులను వెళ్ళి కలుసుకున్నా డు. ఫెడరల్ స్ఫూర్తితో సాగుతున్న యత్నాలను హర్షించాలనే సోయి కూడా కలుగడం లేదు.

కేసీఆర్ ప్రతిపాదన కార్యరూపం దాల్చకముందే విజయ సౌరభాన్ని వెదజల్లుతున్నది. కేసీఆర్ యత్నాల వల్ల ప్రాంతీయపార్టీల నాయకుల్లో ధీమా పెరిగింది. దీంతో జాతీయపార్టీలు బావురుమంటూ ప్రాంతీయ పార్టీల చుట్టూ తిరుగడం మొదలైంది రాష్ర్టాలకు మరిన్ని అధికారాలు ఉండాలనే సైద్ధాంతిక పునాది ఉండటం వల్ల దాదాపు ప్రాంతీయ పార్టీలన్నీ ఈ కొత్త ప్రయత్నాలకు సూత్రప్రాయంగా అంగీకరించాయి. ప్రాంతీయపార్టీల మధ్య సంఘీభావం పెరిగింది. ఈ క్రమంలోనే ఏపీలో బలమైన పార్టీ అయిన వైఎస్సార్సీపీతో చర్చలు సాగిస్తున్నారు. దేశ రాజకీయాలు సమూల మార్పులకు లోనవుతున్న చారిత్రక పరిణామంలో తెలంగాణ, ఆంధ్ర ప్రజలు భాగస్వాములు కావడం సంతోషకరం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం స్వపరిపాలన కోసమే తప్ప తమకు వ్యతిరేకం కాదనేది ఆంధ్ర ప్రజలకు ఇప్పటికే స్పష్టమైంది. తెలంగాణ ఉద్యమ విలువలు, టీఆర్ఎస్ సమర్థవంతమైన పాలన నేపథ్యంలో ఆంధ్ర ప్రజలు కూడా తమ రాష్ట్ర రాజకీయాలను కొత్త కోణంలో చూస్తున్నారు. తెలంగాణ నాయకులకు సౌహార్ద్ర స్వాగతం పలుకుతున్నారు. ఇప్పుడు ఏకంగా వైఎస్సార్సీపీ చర్చలు కూడా జరుపుతుండటంతో పాతకాలపు రోత రాజకీయాలకు అలవాటుపడిన చంద్రబాబుకు ఒంటినిండా జెర్రులు పాకినట్టుగా ఉన్నది. చంద్రబాబు వంటి కుటిల రాజకీయ నాయకులు, వారి గణాలు ఎంత మొత్తుకున్నా, తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య సంఘీభావాన్ని పెంపొందించి, అభివృద్ధిపథంలో నడిపించవలసిన బాధ్యత రెండు రాష్ర్టాల్లోని బాధ్యతాయుత రాజకీయపక్షాలపై ఉన్నది.

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

చచ్చిపోయిన ఒక బర్రె ఇచ్చెనంట!

కమ్యూనికేషన్ వ్యవస్థను, బోఫోర్స్‌ను మించిన శతఘ్నులను, రాఫెల్స్‌ను తలదన్నే యుద్ధ విమానాలను సృష్టించగలిగారని, క్లిష్టమైన శస్త్ర చికిత్సలను అవలీలగా చేయగలిగారన్నారు. నాడే భార్యాభర్తలకు ఎటువంటి ఆయాస ప్రయాసల్లేకుండా టెస్ట్‌ట్యూబ్ బేబీలను ఉత్పత్తి చేశారని, వంద మంది కౌరవులు టెస్ట్‌ట్యూబ్ బేబీలేనని ఒకాయన, పెద్దమనిషే, జలంధర్ సైన్స్ కాంగ్రెస్‌లో బల్లగుద్ది చెప్పారు. ద్రోణాచార్యుల వారు కుంభ సంభవులే గదా! వేదాల్లోకి వెళ్లితే ఇంతటితో తెగదు, అది వేదారణ్యం.

వేదాల్లో ఎన్ని నిగూఢ సంపదలు ఉన్నప్పటికీ 'మంచి గతమున కొంచెమేనోయి' అని ఓ మహాకవి వందేండ్ల కిందటనే అన్నారు. గతంలోనే మంచి అంతా ఉందని గర్జించేవాళ్లకు సమాధానంగా ఆయన ఈ మాట అని ఉంటారు.

మన తాతలు నేతులు తాగారని చెప్పి పొంగిపోవడం, భుజాలు ఎగురేయడం హద్దుల్లో ఉన్నంతవరకు తప్పేమీ కాకపోవచ్చు. గత వైభవాన్ని తలచుకొని, తీరికగా నెమరేసుకుంటూ సంతృప్తి పొందే స్వేచ్ఛ ప్రతి ఒకరికి ఉండవలసిందే. 120 ఏండ్ల కిందట మహాకవి గురజాడ రచించిన రసవత్తర నాటకం 'కన్యాశుల్కం'లో అగ్నిహోత్రావధానులు జంద్యాలు కూర్చుతూ ఇంగ్లీష్ చదువులను తిడుతూ 'మన వేదాల్లో అన్నీ ఉన్నాయట' అంటాడు. అవధానులు కేవలం సనాతనత్వం, ప్రాచీనత పట్ల పరమ అభిమానంతో ఆ మాటలు అన్నాడు, ఆయనకు స్వార్థం లేదు, రాజకీయాలు అసలే లేని అమాయకుడు, అజ్ఞాని ఆయన. ఇప్పటి సంగతి వేరు. ఇప్పుడు అజ్ఞానం, మూర్ఖత్వం, రాజకీయాలు, మతోన్మాదం మేళవించి తాండవిస్తున్నాయి. 104 ఏండ్ల నుంచి ఏటా దేశంలో ఏదో ఒక చోట ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్యానంతరం అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దాదాపు ఏటా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ప్రారంభించి సైన్స్ విషయాలే మాట్లాడి సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌కు స్ఫూర్తినిచ్చేవాడు. అష్టగ్రహ కూటమి జరుగబోతున్నదని (ఈ మధ్య ఎన్నికల సమయాన తెలంగాణలో ఒక కూటమి ఏర్పడినప్పుడు సీఎం కేసీఆర్ కర్రు కాల్చి వాత పెట్టడం, ఆ వాత నుంచి ఆ కూటమి ఇంకా కోలుకోకపోవడం జగద్విదితం!). అందరు భయపడ్డప్పుడు, అదొక మూఢ విశ్వాసం అని నెహ్రూ భావించారు. అలహాబాద్‌లో బ్రిటిష్ పాలకులు ఓసారి కుంభమేళా సందర్భాన గంగ స్నానాన్ని నిషేధించారు. ఆ నిషేధాన్ని ధిక్కరించి గంగ స్నానం ఆచరించడానికి పండిత్ మదన్‌మోహన్ మాలవీయ తమ అనుచరులతో వచ్చారు. బ్రిటిష్ పోలీసులు అడ్డుకున్నారు, బారికేడ్లు పెట్టారు. మాలవీయాజీ హఠాత్తుగా వెళ్లి గంగ ప్రవాహంలో దుంకారు. అనుచరులంతా తమాషా చూస్తూ నిల్చున్నారు. నెహ్రూ ఒక్కడే పోలీసు బలగాన్ని ఖాతరు చేయకుండా గంగలో దుంకి మాలవీయాజీకి అండగా ఉన్నారు. ఆ తృటిలో నెహ్రూ ప్రేరణ కలిగించింది దేశభక్తి, పెద్దమనిషి మాలవీయ పట్ల ఉన్న గౌరవం మాత్రమే. సైద్ధాంతికంగా విధానపరంగా మాలవీయాజీ, నెహ్రూ ఉత్తర దక్షిణ ధృవాలు. కుంభస్నానంలో నెహ్రూకు ఆసక్తి లేదని అందరికీ తెలుసు. పాలకుల, రాజకీయ నాయకుల ప్రమేయం, జోక్యం, ప్రభావం లేకుండా వందేండ్ల ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరిగి దేశంలో శాస్త్రీయ, వైజ్ఞానిక భావనలకు స్ఫూర్తినిచ్చాయి. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ స్థాపకులు ఇద్దరు ఆంగ్లేయ సైంటిస్టులు. అంతవరకు సవ్యంగా, సజావుగా, సామరస్యపూర్వకంగా, ఫలప్రదంగా కొనసాగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో రాజకీయ విస్ఫోటనం ఏదో జరిగి ఆ సంస్థ ఫిజిక్స్‌లో, కెమిస్ట్రీలో కలవర కారకమైన మార్పు వస్తున్న సంకేతాలు కనిపించాయి. ఏటా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొని క్రియాశీల పాత్ర నిర్వహిస్తున్న దేశ, విదేశీ సైంటిస్టుల్లో (వారిలో కొందరు నోబెల్ బహుమతి గ్రహీతలు) ఇక ఈ సమావేశాలకు దూరంగా ఉండటం మంచిదన్న అభిప్రాయం బలపడుతున్నది. ఎందువల్ల ఈ మార్పు సంభవిస్తున్నది, కారణాలేమిటి? ఈ (2019) జనవరి తొలివారంలో 3-7 తేదీల్లో పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ తీరుతెన్నులపై, సమావేశ ప్రసంగాల సరళిపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. శాస్త్రీయ ప్రాతిపదిక, వైజ్ఞానిక ఆధారాల్లేని అంశాలతో కూడిన, కట్టు కథలు, పిట్ట కథలు, పుక్కిటి పురాణాలతో నిండిన, వాస్తవ నిరూపణ కొరవడిన, దురభిమాన పూరిత ప్రసంగాలను నిర్వాహకులు ఏవిధంగా అనుమతిస్తున్నారని అనేకులు ప్రశ్నిస్తున్నారు. అయిదేండ్ల కిందట కేంద్రంలో ప్రభుత్వం, పాలకులు మారినప్పటి నుంచి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశాల్లో, దేశమంతటా వివిధ వేదికలపై ఈ ఆధారరహిత, అశాస్త్రీయ ప్రలాపాల ప్రచారం జోరుగా జరుగుతున్నది. తత్ఫలితంగా దేశంలో వైజ్ఞానిక పరిశోధనలకు, ప్రగతికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఏర్పడుతున్నది.

ప్రపంచ ప్రఖ్యాత భౌతిక, గణిత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అపార మేధోమథనం అనంతరం ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతం (థియరీ ఆఫ్ రిలేటివిటీ) తప్పని మొన్న జలంధర్ సైన్స్ కాంగ్రెస్‌లో ఒకాయన వేదాలను ఉదహరిస్తూ అన్నాడు. ఐన్‌స్టీన్ తప్పని నిరూపించే విశ్లేషణాత్మక, తర్క వితర్క పరిశోధనా పత్రాన్ని ఈయన సమర్పించినట్లయితే, ఆ పత్రంపై కూలంకషంగా చర్చ జరిగినట్లయితే వైజ్ఞానిక ప్రపంచం నిజంగా హర్షించేది. అది జరుగలేదు. అగ్నిహోత్రావధానులు అన్నట్లు 'వేదాల్లో అన్నీ ఉన్నాయి' అని అనడం సులభం. నిరూపించి నిజానిజాలను నిర్ధారించడం ముఖ్యం. ప్రధాని నుంచి గ్రామ పంచ్ వరకు, చాలక్‌లు, సంచాలక్‌లు అందరూ 'వేదాల్లో అన్నీ ఉన్నాయి' అంటూ నిర్విరామ జపం చేయవచ్చు. వేదాల్లో నిజంగానే అన్నీ ఉంటే సంతోషించని, గర్వపడని భారతీయుడు ఉండడు. వేదాల్లో అన్నీ ఉన్నాయని కళ్లు మూసుకొని అన్నవాళ్లు, తందాన తాన అంటూ వంత పలికినవాళ్లు మాత్రమే దేశభక్తులు, 'హై హై నాయకా' అంటూ సై కొట్టనివాళ్లు దేశద్రోహులు అనడం సమంజసం కాదు. బ్రిటిష్ పాలకులు దత్తపరిచిన సెడిషన్ (దేశద్రోహం) చట్టం ఈరోజు పాలకులకు బాగా ఉపయోగపడుతున్నది. ఇప్పటికే దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీం ముందు మూడో, నాలుగో దేశద్రోహం కేసులు విచారణలో ఉన్నాయి. క్రమంగా దేశద్రోహం ముద్ర పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నదని అనిపిస్తున్నది. ఈ పెరుగుదలకు కారణాలేమిటో సామాజిక శాస్త్రజ్ఞులు పరిశీలించాలి. ఈ ముగ్గురు, నలుగురు లేక 30 మంది దేశద్రోహులు భారత ప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర జరుపుతున్నారంటే భారత ప్రభుత్వం ఎంతో బలహీనంగా ఉందనిపిస్తున్నది. మోదీజీ ప్రభుత్వం అయిదేండ్ల కిందట అంకురించగానే కేదార్‌నాథ్‌లోనో, బద్రీనాథ్‌లోనో ఒక వేద విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, వేదాల్లోని ఆధ్యాత్మిక, ధార్మిక, మార్మిక, వైద్య, ఆరోగ్య, అస్త్రశస్త్ర, క్షిపణి సంబంధ, అంతరిక్ష, సంగీత, సాహిత్య, సాంకేతిక తదితర అంశాలపై సమగ్ర పరిశోధనలను ప్రోత్సహించి ఉంటే, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లోనే కాదు, ప్రపంచ సైన్స్ వేదికపై కూడా మన వేదఘోష అద్భుతంగా వినిపించేది. 120 ఏండ్ల కిందట షికాగో (అమెరికా), యూరప్ దేశాల్లో పర్యటించిన వివేకానందస్వామి 'మా వేదాల్లో అన్నీ ఉన్నాయి' అనలేదు. అమెరికా, యూరప్ దేశాల నుంచి వైజ్ఞానికంగా మనం నేర్చుకోవలసింది చాలా ఉందని తన మాతృదేశం వాళ్లకు చెప్పాడు.

నాడే, వేదకాలంలోనే, మనోళ్లు ఖండాంతర క్షిపణులను, అంతరిక్షంలోకి చొచ్చుకపోయే వ్యోమనౌకలను, అణ్వాయుధాలను, టెలివిజన్ సదుపాయం గల (లైవ్ టెలికాస్ట్ సదుపాయం ఉన్నది గనుకనే సంజయుడు కౌరవ అధిపతి ధృతరాష్ట్రునికి కురుక్షేత్ర సంగ్రామం గురించి కళ్లకు కట్టినట్లు వివరించగలిగాడని వేదిస్టులు అంటారు!) కమ్యూనికేషన్ వ్యవస్థను, బోఫోర్స్‌ను మించిన శతఘ్నులను, రాఫెల్స్‌ను తలదన్నే యుద్ధ విమానాలను సృష్టించగలిగారని, క్లిష్టమైన శస్త్ర చికిత్సలను అవలీలగా చేయగలిగారన్నారు. నాడే భార్యాభర్తలకు ఎటువంటి ఆయాస ప్రయాసల్లేకుండా టెస్ట్ ట్యూబ్ బేబీలను ఉత్పత్తి చేశారని, వంద మంది కౌరవులు టెస్ట్‌ట్యూబ్ బేబీలేనని ఒకాయన, పెద్దమనిషే, జలంధర్ సైన్స్ కాంగ్రెస్‌లో బల్లగుద్ది చెప్పారు. ద్రోణాచార్యుల వారు కుంభ సంభవులే గదా! వేదాల్లోకి వెళ్లితే ఇంతటితో తెగదు, అది వేదారణ్యం.

ఆంగ్ల పాలకులు పెట్టిన భిక్ష సెడిషన్ చట్టం ఒకటి నోరుమూయించే చట్టం ఉన్నప్పటికీ ధైర్యంగా నోరు విప్పినవాళ్లు కొందరు ఎళ్లకాలాల్లో కొల్లలుగా ఉంటున్నారు. గోరఖ్‌పూర్ పీఠాధిపతి, ప్రస్తుత యూపీ సీఎం సన్యాసి ఆదిత్యనాథ్‌జీకి కోపం వస్తే ఎన్‌కౌంటర్ జరుగుతుందని తెలిసినా కొందరు గొంతు విప్పడానికి సాహసిస్తున్నారు. యోగి సంవత్సర పదవీకాలంలో యూపీలో 11 వందల పోలీస్ ఎన్‌కౌంటర్లు జరిగాయని తెలిసి సుప్రీంకోర్టుకు మూర్ఛ వచ్చినంత పనయింది. వేదాల్లో ఎన్ని నిగూఢ సంపదలు ఉన్నప్పటికీ 'మంచి గతమున కొంచెమేనోయి' అని ఓ మహాకవి వందేండ్ల కిందటనే అన్నారు. గతంలోనే మంచి అంతా ఉందని గర్జించేవాళ్లకు సమాధానంగా ఆయన ఈ మాట అని ఉంటా రు. తెలంగాణ ఆధునిక కవి ఒకరు 'ఎన్ని సంపదలుడిన నేమి ఫలము, చచ్చిపోయిన ఒక బర్రె యిచ్చెనంట పగిలిపోయిన కుండెడు పాలు మాకు, నిద్దురను వీడు తమ్ముడా పొద్దు వోయే' అంటూ అమిత వేదనను వ్యక్తపరిచారు. ఆధునిక తెలుగు కవులకు, రచయితలకు గతమంతా గబ్బిలాలు వేలాడుతున్న చీకటి కూపం వలె కనిపించింది. తిరోగమన వాదులు మాత్రమే గతాన్ని గాఢంగా ప్రేమిస్తారని, పురోగమించడం వాళ్లకు ఇష్టంకాదని ఆధునిక మేధావులు, బుద్ధిజీవులు, ప్రగతిశీలురు భావిస్తారు. ప్రగతిశీలుర కోవలో ప్రథముడైన మహాకవి దాశరథి మాటలివి.. 'అంతా వెనుకటే ఉందని ఆనందపడే పెద్దలు ఇవాళ యేమీ లేదని యేడ్పు మొహం పెట్టారు..?' కవులు, రచయితలు, మేధావులు ఎవరేమి చెప్పినా గత అయిదేండ్ల నుంచి 'వేదాల్లో అన్నీ ఉన్నా యి' అని పదేపదే అంటున్నవారు పవిత్ర వేదాలను సైతం వక్రభాష్యాలతో తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని అనుకుంటున్నారు. చిత్తశుద్ధితో వేద వాఙ్మయాన్ని, ప్రాచీన భారతీయ విజ్ఞాన నిధులను శోధించి, వెలికి తెచ్చిన ఆధునిక యుగ శాస్త్రవేత్తలు, విజ్ఞాన విదులు కొందరు లేకపోలేదు. రసాయనిక శాస్త్ర రంగంలో ప్రపంచ ప్రసిద్ధుడు అయిన పి.సి. రే (1920లో ఆయన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు) 'హిందూ రసాయనిక శాస్త్రం చరిత్ర' పేరిట రెండు సంపుటాల ఉద్గ్రంథం రచించారు. 'ప్రాచీన హిందూ సకారాత్మక శాస్త్రాలు' అంశంపై తత్త్వవేత్త బ్రజేంద్రనాథ్ సీల్ అమూల్య పరిశోధన జరిపారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రాలకు అత్యధిక ప్రాధాన్యం లభించినప్పుడే స్వతంత్ర భారతదేశం సర్వతోముఖాభ్యుదయాన్ని సాధించగలుగుతుంది, సందేహం లేదు.

నిజాం పాలనలో తెలుగు బోధన

విద్య



ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ

ఉన్నత విద్యనభ్యసించడానికి గోండు, కోయ, బంజారా, చెంచు విద్యార్థుల్లో ప్రతిభావంతులైన వారికి తగిన ప్రోత్సాహకాలను నిజాం ప్రభుత్వం అందించింది. తద్వారా వెనుకబడిన జాతుల్లోని మొదటితరం ఆధునిక విద్యను అందుకొని ఉపాధి రంగంలో అడుగుపెట్టారు. విద్యావంతులైన ఆదివాసీ యువతరం తమ జాతిలో నూతన ఆకాంక్షలను రేకెత్తించి చైతన్యవంతమైన అస్తిత్వ, ఆత్మగౌరవ ఉద్యమాలను నిర్మించారు.

ఆధునిక తెలంగాణ చరిత్రలో అసఫ్‌జాహీల పాలన గురించి, ముఖ్యంగా చివరి నిజాం కాలానికి సంబంధించి మేధావుల్లో భిన్న దృక్పథాలు, విశ్లేషణలు, సూత్రీకరణలున్నాయి. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం పట్ల నిజాం ప్రభుత్వ విధానాలపై చరిత్రకారుల్లో బేధాభిప్రాయాలున్నాయి. మొత్తంగా నిజాం రాజ్యంలో ఉర్దూ బోధనాభాషగా ఉన్నప్పటికీ, మిగితా ప్రాంతీయ భాషల పట్ల ముఖ్యంగా తెలుగుభాషలో విద్యాబోధనకు మీర్ ఉస్మాన్ అలీఖాన్ సుముఖంగా ఉన్నట్లు చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. తెలంగాణ ప్రాంతంలో ప్రైవేట్ ఖాన్గీ పాఠశాలల్లో తెలుగు బోధనాభాషగా కొనసాగింది. ఈ స్కూల్స్ ప్రధానంగా విద్యావంతులైన వ్యక్తుల అజమాయిషీలో నిర్వహించబడినాయి. గ్రామంలో అక్షరాస్యత, గ్రంథపఠనలో నిష్ణాతులైన బ్రాహ్మణ, సాతాని, శ్రీవైష్ణవ శాఖలకు చెందినవారు ఉపాధ్యాయులుగా ఉన్నారు. మత, సాంస్కృతిక, పౌరాణిక అంశాలు, గణితం, వ్యాకరణం పాఠ్యాంశాలుగా ఉన్నాయి. అయితే ఖాన్గీ పాఠశాలలను నిజాం ప్రభుత్వం గుర్తించలేదు. అందువల్ల తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. నైజాం పాలనలో తెలుగు మాధ్యమ విద్య వివక్షకు గురైంది. అయినా తెలుగు భాషా, సంస్కృతులను పరిరక్షించుకునేందుకు పలువురు విద్యావంతులు కృషిచేశారు.

ఇరువయ్యో శతాబ్దం మొదటి దశకంలో దళితుల్లో విద్యావ్యాప్తి చేసిన ఘనత ఆది హిందూ ఉద్యమ నాయకుడు భాగ్యరెడ్డి వర్మకు దక్కుతుంది. సంఘ సంస్కరణలో భాగంగా ఆయన 1910లో మొదటి దళిత పాఠశాలను స్థాపించాడు. ఆ తర్వాత మొత్తం 26 తెలుగు మీడియం పాఠశాలలను స్థాపించి, 2,500 మంది దళిత విద్యార్థులకు స్వచ్ఛందంగా విద్యాబోధన జరిపించాడు. అయితే కొంతకాలం తర్వాత పాఠశాలల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆర్థిక సహాయం చేయాలని నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను కోరాడు. అందుకు నిజాం ప్రభుత్వం అంగీకరించి ఆ పాఠశాలలను 1934లో అధీనంలోకి తీసుకున్నది. 1934లో నిజాం ప్రభుత్వం డిప్రెస్డ్ క్లాసెస్ విద్యావ్యాప్తి పథకాన్ని ప్రవేశపెట్టింది. దానికి అనుగుణంగా నిమ్న వర్గాలకు 101 ప్రత్యేక తెలుగు మీడియం పాఠశాలలను స్థాపించి 3,514 విద్యార్థులను చేర్చుకున్నది. 1945 నాటికి వాటి సంఖ్య 186కు పెరిగింది. వాటిలో 8,764 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. వాటికి తోడుగా మిగితా ప్రభుత్వ పాఠశాలల్లో వేల సంఖ్యలో అట్టడుగువర్గాలకు చెందిన విద్యార్థులు ప్రవేశం పొందారు. దీన్నిబట్టి 1930-40 దశకాల్లో హైదరాబాద్ రాజ్యంలో దళిత, బడుగు వర్గాల్లో విద్యావ్యాప్తి జరిగిందనే విషయం స్పష్టమవుతున్నది.

ఆదివాసీ, సంచారజాతుల్లో విద్యాభివృద్ధి చేయడానికి నిజాం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నది. ముఖ్యంగా 1940 దశకంలో కుమ్రం భీం తిరుగుబాటు తర్వాత ట్రైబల్ సమస్య పరిష్కారానికి బ్రిటిష్ విద్యావేత్త హైమన్‌డార్ఫ్ సూచన మేరకు గోండు, కోయ, చెంచు లంబాడా/బంజారా జాతుల్లో అక్షరాస్యత పెంచడానికి ఆశ్రమ పాఠశాలలను స్థాపించారు. మొదటిసారిగా 1943లో రూ.46,267 గ్రాంట్‌తో నిజాం ప్రభుత్వం గోండ్ ఎడ్యుకేషన్ పథకాన్ని ప్రారంభించింది. దీనికి అనుగుణంగా పూర్వపు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ తాలూకాలోని మర్లవాయిలో గోండ్ విద్యార్థులకు పాఠశాల, టీచర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. గోండి భాషలో తొలిసారిగా ముప్పై మంది విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలలో విద్యాబోధన జరిగింది. ఆ తర్వాత జిల్లాలో మొత్తం 72 పాఠశాలలు స్థాపించబడినాయి. విద్యార్థులకు అర్థమయ్యేట్లు గోండి భాషలో దేవనాగరి లిపిలో పుస్తకాలు ముద్రించబడినాయి. గోండి రీడింగ్, గోండి ప్రైమరీ లాంటి పుస్తకాల ముద్రణకు నిజాం ప్రభుత్వం రూ.1.34 లక్షల గ్రాంటును మంజూరుచేసి, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసింది. గోండు ఎడ్యుకేషన్ పథకం తరహాలోనే 1946లో వరంగల్ జిల్లాలో ప్రభుత్వం కోయ జాతి విద్యాభివృద్ధికి కృషిచేసింది. ఎల్లెందు తాలూకా సుదిమళ్లలో మొట్టమొదట కోయ విద్యాకేంద్రాన్ని స్థాపించి వందలాది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించింది. పూర్వపు వరంగల్ జిల్లాలో బంజారా/లంబాడా తెగకు చెందినవారు అధికంగా నివసించారు. వారిలో అక్షరాస్యతను పెంపొందించడానికి మహబూబాబాద్ తాలూకా తొర్రూరులో పాఠశాల, ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని నిజాం ప్రభుత్వం ప్రారంభించి వందల సంఖ్యల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించింది. బంజారా భాషకు లిపి లేనందువల్ల తెలుగు, దేవనాగరి లిపిలో పాఠ్యపుస్తకాలు ముద్రించింది. బంజారా బాలశిక్ష, బంజారా రీడర్, బంజారా వయోజన చార్ట్, బంజారా నాటకం లాంటి పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసింది. బంజారా ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక టీచర్లు వారి మాతృభాషలోనే విద్యాబోధన చేశారు. అదేవిధంగా చెంచు జాతి ప్రజలు మహబూబ్‌నగర్ జిల్లాలో అధికంగా నివసించారు. 1948లో మన్ననూర్‌లో ప్రభుత్వ పాఠశాల స్థాపించబడింది. దానిలో 77 మంది బాల, బాలికలకు ఉచిత విద్యనందించి, వారిలో ప్రతిభ కలిగినవారికి ప్రభుత్వం మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహించింది. దానికి తోడు ఉన్నత విద్యనభ్యసించడానికి గోండు, కోయ, బంజారా, చెంచు విద్యార్థుల్లో ప్రతిభావంతులైన వారికి తగిన ప్రోత్సాహకాలను నిజాం ప్రభుత్వం అందించింది. తద్వారా వెనుకబడిన జాతుల్లోని మొదటితరం ఆధునిక విద్యను అందుకొని ఉపాధి రంగంలో అడుగుపెట్టింది. విద్యావంతులైన ఆదివాసీ యువతరం తమ జాతిలో నూతన ఆకాంక్షలను రేకెత్తించి చైతన్యవంతమైన అస్తిత్వ, ఆత్మగౌరవ ఉద్యమాలను నిర్మించారు. ఆశ్రమ పాఠశాలల స్థాపన, మాతృభాషలో ఆదివాసీ సమూహాలకు ఉచిత విద్యాబోధన అనేది మీర్ ఉస్మాన్‌అలీఖాన్ పాలనాకాలంలో ప్రవేశపెట్టిన ముఖ్యమైన విద్యా సంస్కరణగా పేరొందింది. తెలంగాణలో చెలరేగిన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాల ప్రభావం కూడా నిజాం విద్యావిధానంపై ఉన్నదని చెప్పవచ్చు. 1930-40 దశకాల్లో నిజాం ప్రభుత్వం చేపట్టిన విద్యాభివృద్ధి పథకాలు స్వాతంత్ర్యానంతరం సమగ్ర గిరిజన అభివృద్ధి పథకాలకు బీజాలు వేశాయి.

జనగళం

గ్రామ ప్రశాంతతను కాపాడాలె

తెలంగాణ ప్రాంతంలోని గ్రామాలు ప్రశాంతతకు మారుపేరుగా నిలిచాయి. ఎన్నికల వాతావరణం ఉన్నా, సాధారణ సమయాల్లోనూ గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంతో శాంతిని కాపాడిన చరిత్ర తెలంగాణది. ఇదే సంప్రదాయాన్ని గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కూడా కొనసాగించాలె. పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో ప్రజలు గ్రామాభివృద్ధికి పాటుపడే వ్యక్తిని గెలిపించుకోవాలె. అంతేకానీ రాజకీయాలకు తావిచ్చి ఆధిపత్య పోరుతో కక్షలు, కొట్లాటలకు తావివ్వరాదు. ఎన్నికలు ఓ వారం తర్వాత ముగిసిపోతాయి. ఆ తర్వాత ఏండ్ల తరబడి ఊర్లో కలిసి ఉండాల్సింది ప్రజలే. కాబట్టి ఆధిపత్య రాజకీయాలకు చోటివ్వకుండా శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలె.

- బేగరి ప్రవీణ్ కుమార్, అంతారం, చేవెళ్ల, రంగారెడ్డి

ఆర్టీసీకి మనవి

రోడ్డు రవాణా సంస్థ వికలాంగులకు పలురకాల వైకల్యంలో ఉన్న శాతాన్ని బట్టి రాయితీతో బస్‌పాసులు ఇస్తున్నది. కానీ అంధులకు మాత్రం వంద శాతం అంధత్వం ఉంటేనే బస్ పాస్ రాయితీ ఇస్తామని చెప్పటం సమంజసంగా లేదు. అంధత్వం ఎంత శాతం ఉన్నా అలాంటి వారందరికీ బస్ పాస్‌లో రాయితీ ఇచ్చి సహకరించాల్సిన అవసరం ఉన్నది.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

కాలుష్యం పెంచొద్దు

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరానికి శివారు ప్రాంతాలుగా ఉన్న జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటు వేగం పుంజుకున్నది. ముఖ్యంగా ఆర్.ఆర్.ఆర్. ప్రతిపాదన ముందుకు వచ్చినప్పటి నుంచి ఆ పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు వెలిసి అభివృద్ధి చెందుతాయి. కానీ అదే సమయంలో పారిశ్రామిక కాలుష్య నియంత్రణకు మొదటినుంచే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

- జంపాల అంజయ్య, సామాజిక కార్యకర్త, భువనగిరి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com, Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



సింగోటం జనసంద్రం

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటంలో వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు తెలంగాణతోపాటు ఆంధ్ర, కర్ణాటకకు చెందిన వేలాది మంది తరలిరావడంతో సింగోటం జనసంద్రమైంది. -నమస్తే తెలంగాణ, కొల్లాపూర్



అగ్నిగుండాల కార్యక్రమానికి వెళ్తున్న జంగమ పూజారులు



భక్తిపారవశ్యంతో నిప్పుకణికలపై నడుస్తున్న భక్తుడు

మార్మోగిన కొత్తకొండ

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు

భీమదేవరపల్లి: వీరభద్రస్వామి నామస్మరణతో కొత్తకొండ మార్మోగింది. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు శరభ శరభ అంటూ నిప్పుకణికలపై నడిచి భక్తిప్రపత్తులను చాటుకున్నారు. టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, అర్చకులు తదితరులు భక్తులతోపాటు అగ్నిగుండాలపై నడిచారు. జంగమ పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు గ్రామంలో సాయంత్రం వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి ఉత్సవమూర్తులను డప్పుచప్పుళ్ల మధ్య పల్లకీలో ఊరేగించి శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజయ్య, సదానందం, వినయ్‌శర్మ, శ్రీకాంత్, రమేశ్, హంసారెడ్డి, మల్లారెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

నందికొండ: నాగార్జునసాగర్ ఎడుమకాల్వకు నీటి విడుదలను ఎన్నెస్పీ అధికారులు శుక్రవారం తిరిగి ప్రారంభించారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి ఎడమకాల్వ పరిధిలోని సుమారు 3 లక్షల ఎకరాలకు 23 టీఎంసీల నీటిని రెండో పంటకు కేటాయించి డిసెంబర్ 26న నీటి విడుదలను మొదలుపెట్టారు. వారబందీ పద్ధతిలో నీటి విడుదల కొనసాగిస్తూ జనవరి 10 వరకు 5.48 టీఎంసీలు విడుదలచేసి ఆపై నిలిపేశారు. తిరిగి శుక్రవారం 4,287 క్యూసెక్కులతో నీటి విడుదలను ప్రారంభించారు. తొమ్మిదిరోజులపాటు నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను ప్రస్తుతం 539.50 అడుగుల వద్ద నీరు నిల్వ ఉన్నది. శుక్రవారం శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం నుంచి 31,784 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగడంతో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో 187.2875 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ డ్యాం నుంచి ఎడమకాల్వ ద్వారా 4,287 క్యూసెక్కులు, కుడికాల్వకు 3,031 క్యూసెక్కులు, ఎస్‌ఎల్బీసీ ద్వారా 550 క్యూసెక్కులు, డీటీ గేట్స్ ద్వారా 10 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. శ్రీశైలంలో ప్రస్తుతం 837 అడుగులకు నీరు చేరుకొని.. 57.5860 టీఎంసీలు నిల్వ ఉన్నది.



కరీంనగర్ జిల్లా పెన్షనర్ల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బీ వినోద్‌కుమార్

రిటైర్డ్ ఉద్యోగులపై సీఎంకు అమిత ప్రేమ

పెన్షనర్ల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా: ఎంపీ వినోద్

కరీంనగర్ కల్చరల్: రిటైర్డ్ ఉద్యోగుల పట్ల సీఎం కేసీఆర్‌కు అమితమైన ప్రేమ ఉన్నదని, పెన్షనర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తానని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల కరీంనగర్ జిల్లా పెన్షనర్స్ సర్వసభ్య సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేయబోయే డైరెక్టరేట్ పని విధానంపై సలహాలు ఇవ్వాలని కోరారు. అందరి ఆశీర్వాదంతో మరోసారి టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిందని, రాబోయే ఐదేండ్లలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌స్థానంలో ఉండబోతుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ విశ్వాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య, సెక్రటరీ జనరల్ జీ దామోదర్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ పీఆర్ మోహన్, కోశాధికారి పీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో సమీక్ష సందర్భంగా మాట్లాడుతున్న ట్రాన్స్‌కో సీఎండీ రఘుమారెడ్డి

వందశాతం బిల్లులు వసూలుచేయండి

ట్రాన్స్‌కో సీఎండీ రఘుమారెడ్డి ఆదేశం

నల్లగొండ క్రైం: నూటికి నూరుశాతం విద్యుత్ బిల్లులు వసూలుచేయాలని ట్రాన్స్‌కో సీఎండీ రఘుమారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యుత్‌చౌర్యం అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి రూ.125కే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై దృష్టిపెట్టి, మార్చిలోపు కనెక్షన్లు పూర్తిచేయాలని చెప్పారు. వేసవిలో విద్యుత్ అంతరాయాల్లేకుండా సరఫరా చేయాలన్నారు. ఐపీడీఎస్ కింద నిర్వహిస్తున్న పనులను నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని, విద్యుత్ బ్రేక్ డౌన్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, సీజీఎం పాండ్యనాయక్, డైరెక్టర్ రాములు, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లా గర్మిళ్లపల్లిలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న విదేశీయులు

గర్మిళ్లపల్లిలో విదేశీ బృందం పర్యటన

సేంద్రియ సాగు పరిశీలన

ఐనవోలు: కెన్యా, ఈజిప్టు, సుడాన్ దేశాలకు చెందిన పలువురు శుక్రవారం వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి, గర్మిళ్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఎన్‌ఆర్డీపీలో భాగంగా బాలవికాస ఆధ్వర్యంలో ఒంటిమామిడిపల్లి గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను, గర్మిళ్లపల్లి సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధన తీరును వారికి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పొన్నల రాజు వివరించారు. అనంతరం సేంద్రియ సాగు, మార్కెటింగ్ గురించి విదేశీ బృందం.. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నది.

మల్యాలలో విరిగిన రైలు పట్టా

కీమెన్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

మల్యాల: జగిత్యాల జిల్లాలో కీమెన్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. శుక్రవారం మల్యాల మండలకేంద్రంలోని నూకపెల్లి శివారులో ఉన్న రైల్వే స్టేషన్‌కు 700 మీటర్ల దూరంలో జగిత్యాల వైపు రైలుపట్టా విరిగింది. గమనించిన కీమెన్ నక్క వెంకటేశ్.. అప్రమత్తమై రామగుడం నుంచి నిజామాబాద్ వైపు బొగ్గులోడ్‌తో వెళ్తున్న రైలు మల్యాల మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరగా మార్గమధ్యలోనే ఆపేశారు. 25 నిమిషాలపాటు అక్కడే నిలిపివేశారు. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రైల్వే లైన్‌ను పునరుద్ధరించారు. కీమెన్ అప్రమత్తతతో రూ.కోటికిపైగా సంపదను కాపాడినట్టు అధికారులు తెలిపారు.

అతివేగానికి తండ్రీకొడుకు బలి

మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వర్టును ఢీకొట్టిన కారు

అడ్డాకుల: అతివేగంగా వెళ్తున్న కారు కల్వర్టును ఢీకొట్టడంతో తండ్రీకొడుకు మృత్యువాతపడగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామస్థుడు ఇలియాజ్ బాషా (32).. భార్య షబానా, కుమారుడు అల్లవల్లి(2)తో కలిసి కర్నూలు నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. అడ్డాకుల సమీపంలోకి రాగానే కారు వేగంగా వెళ్తూ కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో బాషా, అల్లవల్లి అక్కడికక్కడే మృతిచెందగా, షబానాకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

బరిలో బంధుగణం

రసవత్తరంగా 'పంచాయతీ' రాజకీయం.. ప్రత్యర్థులుగా దగ్గరి బంధువులు.. పోటాపోటీగా ప్రచారం



నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికరమైన పోటీ ఆవిష్కృతం అవుతున్నది. దగ్గరి బంధువులే ఒకరిపై ఒకరు పోటీకి సై అంటున్నారు. అన్నదమ్ములు, అక్కాచెల్లెలు, బావాబామ్మర్దులు.. ఇలా సమీప బంధువులే రాజకీయ ప్రత్యర్థులుగా మారారు. గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఇలాంటి సన్నివేశాలు కనిపిస్తున్నాయి.

పోటాపోటీగా వదిన, మరదలు

కరీనగర్ జిల్లా గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ సర్పంచ్ పోరులో వదినామరదళ్లు నిలిచారు. సర్పంచ్ స్థానం బీసీ మహిళ రిజర్వేషన్ రావడంతో మాజీ సర్పంచ్ సుధగోని మల్లేశం తన భార్య రజితను బరిలో నిలుపగా, ఆయన బామ్మర్ది తాళ్లపెల్లి శ్రీనివాస్ తన భార్య లతతో నామినేషన్ వేయించారు. బరిలో మరో ముగ్గురు ఉన్నా వీరిద్దరి పోటీపైనే ఆసక్తి నెలకొన్నది.

అనుముల శ్రీనివాస్‌రెడ్డి వర్సెస్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి(కొడుకు), శ్రీనివాస్‌రెడ్డి(బాబాయ్)

నల్లగొండ జిల్లా త్రిపురారం పంచాయతీ పోరులో ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు బాబాయ్, కొడుకు సిద్ధమయ్యారు. వారు బంధువులే కాకుండా.. ఇద్దరి పేర్లు కూడా ఒక్కటే కావడం విశేషం. దీంతో స్థానికులు తికమకకు గురవుతున్నారు. నిడమనూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి(కొడుకు) పోటీ చేస్తుండగా, కాంగ్రెస్‌పార్టీ తరపున అనుముల శ్రీనివాస్‌రెడ్డి(బాబాయ్) పోటీ చేస్తున్నారు. బాబాయ్‌కి సీనియర్ నాయకుడిగా పేరుండగా, కొడుకుకు తెలంగాణ ఉద్యమకారుడిగా పేరున్నది. దీంతో ఇద్దరూ గెలుపుపై ధీమాగా ఉన్నారు.

బావ, బామ్మర్ది సవాల్

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తొగర్రాయి సర్పంచ్ బరిలో బావ, బామ్మర్ది నిలిచారు. టీఆర్‌ఎస్ బలపరచిన దొంగల లక్ష్మీనారాయణపై ఆయన సొంత బావ లిక్కి వెంకటయ్య పోటీలో నిలిచారు. దీంతో వీరి మధ్య పోటీ ఆసక్తి నెలకొన్నది.

అక్కాచెల్లెళ్ల సై

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలలో సర్పంచ్ పదవి కోసం అక్కాచెల్లెళ్లు పోటీపడుతున్నారు. లంక రాజేశ్వరి, ఆకునూరి పద్మ బరిలో నిలవడంతో ఆసక్తికర పోటీ నెలకొంది. ఎవరికి వారే ప్రచారంలో నిమగ్నమయ్యారు.

బోయినపల్లిలో తల్లీ కూతుళ్లు..

సిరిసిల్ల జిల్లా బోయినపల్లి సర్పంచ్ బరిలో వరుసకు తల్లీకూతుళ్లు బరిలో నిలిచారు. మొత్తం నలుగురు అభ్యర్థులు పోటీ పడుతుండగా సంబ బుచ్చమ్మ, గుంటి లతశ్రీ వరుసకు తల్లీకూతుళ్లు కావడం ఆసక్తిని రేపుతున్నది. బుచ్చమ్మ గతంలో సర్పంచ్‌గా పనిచేశారు.

బరిలో అత్తాకోడళ్లు

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని పేపర్‌మిల్ పంచాయతీ బరిలో అత్తాకోడళ్లు బరిలో ఉన్నారు. నఫీజ్ సుల్తానా, ఆమె అన్నకూతురు ఫోజియా నాజ్ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు.

బరిలో ముగ్గురు అన్నదమ్ములు

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో నూతనంగా ఏర్పడిన బసంత్‌నగర్ పంచాయతీలో ముగ్గురు అన్నదమ్ములు పోటీపడుతున్నారు. గ్రామానికి చెందిన సొంత అన్నదమ్ములైన పాత రవీందర్, పాత దేవేందర్‌తోపాటు వారికి వరుసకు సోదరుడయ్యే పాత లింగమూర్తి కూడా నామినేషన్ దాఖలు చేసుకుంటున్నారు. వారి కుటుంబసభ్యులు ఎవరికివారే ప్రచారం చేసుకుంటున్నారు. సర్పంచ్ బరిలో పదిమంది ఉన్నా ఈ ముగ్గురు వ్యాపారుల మధ్య పోటీ గ్రామంలో చర్చనీయాంశమైంది.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..: వాంకిడి మండలంలోని ఖిర్డి, సరండి పంచాయతీలకు నిర్వహిస్తున్న ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులుగా అన్నదమ్ములు బరిలో నిలిచారు. ఖిర్డి పంచాయతీలో 18 ఏండ్లుగా అంబారావు కుటుంబం నుంచే సర్పంచ్‌గా ఎన్నికవుతున్నారు. ఈసారి మాజీ సర్పంచ్ అంబారావు బరిలో ఉండగా, ఆయనకు పోటీగా తమ్ముడు గంగారం నామినేషన్ వేశారు. ఖిర్డి నుంచి విడివడి కొత్తగా ఏర్పడిన సరండి గ్రామ పంచాయతీలోనూ ఇదే పరిస్థితి. గ్రామానికి చెందిన దుర్గం తిరుపతి నామినేషన్ వేయగా, ఆయనకు పోటీగా తమ్ముడు దుర్గం కమలాకర్ బరిలో నిలిచారు.

మంచిర్యాల జిల్లాలో..: జన్నారం మండలం ధర్మారం గ్రామంలోనూ అన్నదమ్ములు సర్పంచ్ పదవికి పోటీపడుతున్నారు. గ్రామానికి చెందిన దుర్గం గంగాధర్, దుర్గం చంద్రశేఖర్ ఈసారి పోటాపోటీగా నామినేషన్లు వేశారు. వీరు గతంలోనూ ఇలాగే సర్పంచ్ పదవి కోసం పోటీపడ్డారు. మూడోవక్తి గెలిచారు. దీంతో ఇప్పుడు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.



భర్త సర్పంచ్, భార్య ఉపసర్పంచ్

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం గుడుదొడ్డిలో భార్యాభర్తలు సర్పంచ్, ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్ అభ్యర్థిగా హనుమంతురెడ్డి, ఆయన భార్య రాధమ్మ ఒకటో వార్డు సభ్యురాలిగా నామినేషన్ దాఖలు చేశారు. మిగతా ఏడువార్డులకు సైతం ఒక్కొక్కరే నామినేషన్‌వేశారు. దీంతో గ్రామం ఏకగ్రీవమైంది. గ్రామస్థులు ఉప సర్పంచ్‌గా రాధమ్మకు మద్దతు పలికారు.

ఏకగ్రీవాల జాతర

- అభివృద్ధి నినాదంతో ఏకతాటిపైకి వస్తున్న గ్రామస్థులు
- పలు పంచాయతీల్లో తీర్మానాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: మూడోవిడుత పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాలు ఏకగ్రీవం అవుతున్నాయి. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు అందిస్తుండటం, వాటితో మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉండటంతో గ్రామస్థులంతా చర్చించుకొని ఏకగ్రీవానికి మొగ్గుచూపుతున్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం సింగరాయిపేట ఏకగ్రీవమైంది. టీఆర్‌ఎస్ మద్దతుతో బరిలో నిలిచిన జైనేని నడిపి భీమయ్య శుక్రవారం నామినేషన్ దాఖలుచేశారు. 8 వార్డులు సైతం ఏకగ్రీవమయ్యాయి. ఇదే జిల్లాలోని దండేపల్లి మండలం తానిమడుగు ఏకగ్రీవమైంది. పెంద్రం ప్రేమల సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం ఇందిరానగర్ తండా సర్పంచ్‌గా కేతావత్ లలితను, ఉపసర్పంచ్‌గా మాలవత్ నరేందర్‌ను, వార్డుసభ్యులను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోపాల్ మండలంలోని గుడితండాకు కేతావత్ లక్ష్మి, ఎల్లమ్మకుంట పంచాయతీకి బాదావత్ బుజ్జి, ధర్మారం తండాకు దారం గంగారాం, కులాస్‌పూర్ తండాకు శ్రావణ్‌కుమార్, బైరాపూర్‌కు సరిచంద్ నాయక్ మాత్రమే నామినేషన్ వేయడంతో అవన్నీ ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రంలోనే అతితక్కువ ఓటర్లు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని దొంగతోగు పంచాయతీ ఏకగ్రీవమైంది. ఇక్కడ జనాభా 106.. ఓటర్లు 34 మందే.. అంతా కలిసి సర్పంచ్‌గా కొమరం బాయమ్మను, ఉప సర్పంచ్‌గా బచ్చల పాపారావును ఎన్నుకున్నారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని చింతల్లపల్లికి మల్యాల మహిపాల్, కొండాపూర్‌కు సామంతుల ప్రభాకర్, గుడిపేటకు హన్మాండ్లు యాదవ్, గొల్లపల్లి మండలం ఆత్మకూర్‌కు మానాల తిరుపతి, నందిపల్లికి ఎక్కలదేవి శంకర్, దట్నూర్‌కు ఆకుల పావనిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.



నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం ఇందిరానగర్ తండాలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ లలిత, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న స్థానికులు

సర్పంచ్‌కు 78 ఏండ్ల మహిళ నామినేషన్



నామినేషన్ వేస్తున్న దేవ హేమలత

ఎలిగేడు: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామ సర్పంచ్ స్థానానికి 78 ఏండ్ల వృద్ధురాలు దేవ హేమలత శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ధూళికట్ట సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ మహిళకు రిజర్వు చేయడంతో హేమలత కొడుకు, మాజీ సర్పంచ్ దేవ శ్రీనివాస్ తన తల్లితో నామినేషన్ వేయించారు. వృద్ధురాలు సర్పంచ్ బరిలో నిలువడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.



పంచాయతీ పోరులోనూ సినీ గ్లామర్ సందడి నెలకొంది. లవ్‌టచ్ హీరో జయంత్‌రెడ్డి తన స్వగ్రామమైన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీఆర్‌ఎస్ మద్దతుతో పోటీచేస్తున్న అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. యువకులు ప్రచారంలో ఆయన వెంట నడుస్తూ, ఫొటోలు దిగేందుకు ఆసక్తి కనబరిచారు. - అందోల్, నమస్తే తెలంగాణ

ఏసీబీకి చిక్కిన కోదాడ పట్టణ ఎస్సై

రూ.1.9 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత



ఎస్సై కేటీ మల్లేశ్

కోదాడ రూరల్: కోదాడ పట్టణ ఎస్సై కేటీ మల్లేశ్ ఓ కేసులో బాధితుడి నుంచి శుక్రవారం రూ.1.9 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు నల్లగొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. కొత్తగూడెం బొగ్గు గనుల నుంచి కర్ణాటకలోని ఓ కంపెనీకి బొగ్గును రవాణా చేసేందుకు ఏపీలోని విజయవాడకు చెందిన వెంకటేశ్వరావు అనుమతులు పొందాడు. బొగ్గు నాణ్యత లేదంటూ నవంబర్‌లో ఆ కంపెనీ బొగ్గు లారీలను వెనక్కి పంపి, కోదాడ ప్రాంతంలో బొగ్గు కల్తీ అవుతున్నదని పోలీసులకు ఫిర్యాదుచేసింది. అదే సమయంలో కోదాడ గ్రామీణ ప్రాంతంలో కల్తీ బొగ్గును తరలిస్తున్న మూడు లారీలను అధికారులు పట్టుకొని దర్యాప్తు బాధ్యతలను ఎస్సై మల్లేశ్‌కు అప్పగించారు. లారీల విడుదలకు హైకోర్టు నుంచి అనుమతులు పొందిన వెంకటేశ్వరావు.. లారీలను విడిచిపెట్టాలని ఎస్సైని కోరగా రూ.3 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. చివరికి రూ.1.9 లక్షలకు బేరం కుదిరింది. వెంకటేశ్వరావు శుక్రవారం నగదు ఇచ్చేందుకు తనతోపాటు శ్రీకాంత్ అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చాడు. నగదు బ్యాగుతో స్టేషన్‌లోనే ఉన్న తన కారులో ఉండాలని శ్రీకాంత్‌కు ఎస్సై సూచించాడు. తర్వాత ఇద్దరూ కలిసి కారులో పట్టణంలోని శ్రీరంగాపురం వద్దకు చేరుకున్నారు. ఇంతలో ఏసీబీ అధికారులు తమను వెంబడిస్తున్న విషయం పసిగట్టి నగదుబ్యాగుతో సహా శ్రీకాంత్‌ను కారునుంచి దించి పారిపోయేందుకు ప్రయత్నించాడు. కానీ ఏసీబీ అధికారులు ఎస్సైని అదుపులోకి తీసుకుని, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు.

అంబులెన్సులో మందు తరలింపు

కరీంనగర్ క్రైం: పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఓ అంబులెన్సులో తరలిస్తున్న మద్యాన్ని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. రూ.1.20 లక్షల విలువైన మందును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఏసీపీ అశోక్‌కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్ మండలం ముప్పిరితోట గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న నారగోని విజయ్.. మందు బాటిళ్లను ఓటర్లకు పంచేందుకు కరీంనగర్ నుంచి గ్రామానికి అంబులెన్సులో మద్యం తరలిస్తుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. డ్రైవర్ తిరుపతి, విజయ్ తదితరులపై కేసులు నమోదు చేశారు.



ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురిలో ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన గిరిజనులు



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో టీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులకు గులాబీ కండువాలు కప్పుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



నిజామాబాద్‌లో టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావు, విఠల్ రావు సమక్షంలో పార్టీలో చేరుతున్న వ్యాపారవేత్త ఏటీఎస్ శ్రీనివాస్, కమల, కాంగ్రెస్ నేత సాయిరెడ్డి

గులాబీ పార్టీలోకి చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా టీఆర్‌ఎస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. అభివృద్ధిని కాంక్షిస్తూ.. శుక్రవారం సైతం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు గులాబీ కండువా కప్పుకొంటున్నారు. నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్ దంపతులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోస్రా సాయిరెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల నాయకుడు ముస్తాక్, 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జిల్లాకేంద్రంలో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత మామ, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ రాంకిషన్‌రావు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదన్నగారి విఠల్‌రావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని పొనుగోడుకు చెందిన 30 మంది వివిధ పార్టీల నాయకులు టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాటికొండ కృష్ణారెడ్డి తన 60 మంది అనుచరులు, బీజేపీ కార్యకర్తలతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలోని నెమలిపురి గ్రామంలో మహబూబాబాద్ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో 80 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీని వీడి గులాబీగూటికి చేరాయి.



సూర్యాపేట జిల్లా పొనుగోడుకు చెందిన వివిధ పార్టీల నాయకులను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి



శుక్రవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలుసుకొని రామగుండం మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేయాలంటూ వినతిపత్రం అందజేస్తున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్. చిత్రంలో టీఆర్ఎస్ ఎన్నారై సెల్ చైర్మన్ అనిల్ కూర్మాచలం కూడా ఉన్నారు.

గగనతలం నుంచి పచ్చదనం పరిశీలన

- హరితహారం, అర్బన్‌పార్క్‌లు, అడవుల పునరుజ్జీవాన్ని పరిశీలించిన కేంద్ర అటవీశాఖ డీజీ సిద్ధాంతదాస్
- నర్సరీ అభివృద్ధికి నిధులను కేటాయించాలని వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ సిద్ధాంతదాస్ తెలంగాణలో పచ్చదనాన్ని పరిశీలించారు. రాష్ట్ర అధికారుల ఆహ్వానం మేరకు తెలంగాణలో హరితహారం, అర్బన్ పార్కుల నిర్మాణం, అడవుల పునరుజ్జీవాన్ని హెలికాప్టర్ నుంచి చూశారు. శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న ఆయనకు తెలంగాణ అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్‌ఝా, సీఎంఓఎస్డీ ప్రియాంక వర్గీస్ స్వాగతం పలికారు. మహబూబ్‌నగర్ శివారులోని మయూరి అర్బన్‌పార్క్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రొనాల్డ్‌రోస్ స్వాగతం పలికారు. నర్సరీని ప్రధాన పర్యాటక స్థలంగా రూపొందించడానికి తీసుకున్న చర్యల గురించి



మహబూబ్‌నగర్ శివారులోని మయూరి నర్సరీలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను కేంద్ర అటవీశాఖ డీజీ సిద్ధాంతదాస్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. హంసలకొలను, చిల్డ్రన్స్‌పార్కు, గార్డెన్, రోప్‌వే, నేషనల్ ఫ్లాగ్ ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం రెయిన్‌ఫాల్స్, వాటర్‌ఫాల్స్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు. మూడున్నరేండ్లలోనే నర్సరీని ఇంత అద్భుతంగా రూపుదిద్దడంపై అటవీశాఖ డీజీ సిద్ధాంతదాస్ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రెయిన్‌ఫారెస్ట్‌లో మొక్కలను నాటారు. నర్సరీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ డీజీ సిద్ధాంతదాస్‌కు వినతిపత్రం అందజేశారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కోమటిబండలో హరితహారం కింద నాటిన చెట్లు, సంగాపూర్, నర్సంపల్లిలో అడవుల పునరుజ్జీవ కార్యక్రమాలను శనివారం ఉదయం పరిశీలించనున్నట్టు అధికారులు తెలిపారు.



రెయిన్ ఫారెస్ట్‌లో మొక్క నాటుతున్న కేంద్ర అటవీశాఖ డీజీ సిద్ధాంతదాస్

కొలీర్‌విలి దుర్ఘటన మృతుల అంత్యక్రియలు నేడు



దేవరకొండలో కొవ్వొత్తులతో విద్యార్థుల నివాళి

అమెరికా అగ్నిప్రమాదం మృతులు సాత్విక (18), సుచిత(14), సుహాస్ (16)



శుక్రవారం నారాయణగూడ బాప్టిస్ట్ చర్చిలో నివాళులర్పిస్తున్న మృతుల బంధువులు

- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మృతదేహాల తరలింపు
- నారాయణగూడ బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రత్యేక అంబులెన్సులలో స్వగ్రామానికి తరలింపు
- నేడు నల్లగొండ జిల్లా గుర్రపుతండాలో అంత్యక్రియలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ /హిమాయత్‌నగర్/శంషాబాద్/ దేవరకొండ : క్రిస్మస్ వేడుకల సందర్భంగా అమెరికా కొలీర్‌విలి పట్టణంలో సంభవించిన అగ్నిప్రమాదంలో మృతిచెందినవారి భౌతిక కాయాలను శుక్రవారం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. శనివారం వారి స్వస్థలమైన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం గుర్రపుతండాల్లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా గుర్రపుతండాకు చెందిన కేతావత్ శ్రీనివాస్ నాయక్, సుజాత దంపతుల కూతుళ్లు సాత్విక, జయసుచిత.. కుమారుడు సుహాస్ అమెరికాలోని టెన్నెస్సీ రాష్ట్రం కొలీర్‌విలి పట్టణంలో గత నెల 24న సంభవించిన అగ్ని ప్రమాదంలో సజీవదహనమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం చొరవచూపి అమెరికాలోనే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసింది. బంధువులను అమెరికా తీసుకెళ్లేందుకు ఎదురైన పలు సాంకేతిక సమస్యల కారణంగా మృతదేహాలను స్వస్థలానికే తేవాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక చొరువతో యూఎస్ఏలోని కొలీర్‌విలి నుంచి సాత్విక(18), జయసుచిత(14), సుహాస్ నాయక్(16) మృతదేహాలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. శంషాబాద్ విమానాశ్రయానికి చేరిన శవపేటికల వద్ద పలువురు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అక్కడి నుంచి నారాయణగూడ బాప్టిస్ట్ చర్చికి తరలించారు. అక్కడ తెలంగాణ మైనార్టీ కమిషన్ వైస్‌చైర్మన్ శంకర్‌ల్యూక్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ డీ రాజేశ్వరరావు, మైనార్టీ కమిషన్ సభ్యులు డాక్టర్ విద్యాస్రవంతి, గుస్తయ్‌నోరియా, బాపిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ సామ్యూల్‌తోపాటు క్రైస్తవులు, బంధువులు నివాళులర్పించారు. అనంతరం నాలుగు గంటలపాటు ప్రత్యేక ప్రార్థనలు జరిపి వారి స్వస్థలమైన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం గుర్రపు తండాకు తరలించారు.

సీఎం చొరవతోనే మృతదేహాల తరలింపు

సీఎం కేసీఆర్ సూచనలకు అనుగుణంగా మృతదేహాలను తరలించామని తెలంగాణ మైనార్టీ కమిషన్ వైస్‌చైర్మన్ శంకర్‌ల్యూక్ తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మృతదేహాలను అప్పగించామని, ప్రభుత్వం చూపిన ప్రత్యేక శ్రద్ధను క్రిస్టియన్లు మనస్ఫూర్తిగా హర్షిస్తున్నారని ఆయన చెప్పారు.



టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కల్వకుంట్ల తారకరామారావును శుక్రవారం ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఆర్ఎస్ ఎన్నారై లండన్ అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం, ఎన్నారై అధికార ప్రతినిధి సిక్క చంద్రశేఖర్, మహేశ్ కాసుల
- నమస్తే తెలంగాణ, బేగంబజార్.

హౌసింగ్ సొసైటీ ఎన్నికలు ఏకపక్షమే!

- నేడు ఎన్నికలు, వెంటనే ఫలితాలు
- సత్యనారాయణ ప్యానెల్‌కు టీజీవో, టీఎన్జీవో, ఏపీ ఉద్యోగుల మద్దతు
- ఏపీఎన్జీవోల కుట్రపై మండిపడుతున్న ఏపీ ఉద్యోగులు



శుక్రవారం టీఎన్జీవోభవన్‌లో తెలంగాణ ఉపాధి, శిక్షణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికలు ఏకపక్షమనే చర్చ ఉద్యోగ సంఘాల్లో కొనసాగుతున్నది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు జరుగనున్నాయి. సాయంత్రం ఫలితాలు వెలువడనున్నాయి. కొన్నేండ్లుగా స్థలాలు కేటాయించకుండా, ఉద్యోగుల వాటా సొమ్మును వాడుకుంటూ కోట్లు మింగేసిన ఏపీ ఎన్జీవోలు కూడా పోటీకి దిగుతున్నారు. దీంతో ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. గచ్చిబౌలి హౌసింగ్‌సొసైటీలో సభ్యుల సొంతింటి కల నెరవేర్చేందుకు ఐదేండ్లుగా పోరాడుతున్న భాగ్యనగర్ తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(బీటీఎన్జీవో) ఎట్టకేలకు ఎన్నికలు నిర్వహించేంలా కోర్టు, ప్రభుత్వం నుంచి ఆదేశాలు సాధించింది. ఈ నేపథ్యంలో బీటీఎన్జీవో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్ ప్యానెల్‌కు, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ప్యానెల్‌కు ఈ ఎన్నికలు సవాల్‌గా మారాయి. తమను మోసం చేస్తున్నారని ఏపీ ఎన్జీవోలపై ఏపీకి చెందిన ఉద్యోగులు మండిపడుతున్నారు. వీరికి న్యాయం చేస్తామని బీటీఎన్జీవో భరోసా కల్పించింది. ఈ నేపథ్యంలో ఏపీ ఎన్జీవో నేతలను తరిమికొట్టాలనే ఉద్దేశంలో ఏపీకి చెందిన ఉద్యోగులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఓడిపోతే ఏపీలో పరువుపోతుందని, ఏపీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందంటూ ఏపీఎన్జీవో అధ్యక్షుడు, ఏపీ నేతలు ఉద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి కుట్రలను గమనిస్తున్న ఏపీ ఉద్యోగులు కూడా బీటీఎన్జీవోలకు మద్దతుగా నిలుస్తున్నారు. సత్యనారాయణగౌడ్ ప్యానెల్ విజయం సాధిస్తేనే స్థలాలు దక్కుతాయని భావిస్తున్నారు. శుక్రవారం టీజీవో, టీఎన్జీవో ఆధ్వర్యంలో సత్యనారాయణగౌడ్ ప్యానెల్ పలుకార్యాలయాల్లో ప్రచారం చేసింది. ఏపీఎన్జీవోల కుట్రలకు బలికావొద్దంటూ ఉద్యోగులకు అవగాహన కల్పించింది. తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్ల మాదిరిగానే ప్లాట్లు అందిస్తామని ఏపీ ఉద్యోగులకు బీటీఎన్జీవో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్ హామీఇచ్చారు. ప్రచారంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, రామినేని శ్రీనివాసరావు, బీటీఎన్జీవో కార్యదర్శి పీ బలరాం, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి మల్లారెడ్డి, ప్యానెల్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమాల పుట్ట..ఏపీ ఎన్జీవో

గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో తెలంగాణ, ఏపీకి చెందిన దాదాపు 4,600 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో ఈ సొసైటీకి 180 ఎకరాల స్థలం కేటాయించారు. అప్పటి ఏపీ ఎన్జీవోలోని రెండు గ్రూపుల మధ్య ఆధిపత్యంతో స్థలాల పంపిణీ వాయిదాపడింది. అప్పటికే స్థలాలు పంచుతామంటూ వాటా ధనంగా ఒక్కో ఉద్యోగి నుంచి రూ.2 లక్షల చొప్పున రూ.22 కోట్లు వసూలుచేశారు. వీటిపై వచ్చే వడ్డీ, అసలుతో అప్పటి ఎన్జీవో నేతలు జల్సా చేశారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఏపీ ఎన్జీవోల తరుపున పోటీచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి రూ.18 కోట్లు కాజేశారంటూ కేసు కూడా నమోదైంది. ఇండ్ల స్థలాలు కేటాయించకుండా, సొసైటీకి కొత్త కార్యవర్గం ఏర్పాటుకాకుండా ఏపీ ఎన్జీవో నేతలు కోర్టు స్టే తీసుకొచ్చారు. ఈ వివాదాల నడుమ దాదాపు 90 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. ఉన్నస్థలాన్ని ప్లాట్లు చేసేందుకు కూడా ఏపీఎన్జీవోలు సహకరించడంలేదు. ఈ నేపథ్యంలో బీటీఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎం సత్యనారాయణ సమస్యను పరిష్కరించేందుకు నడుంబిగించారు. సొంతనిధులతో భూమిని అభివృద్ధి చేసి కబ్జాకాకుండా కట్టడిచేశారు. సొసైటీ కార్యవర్గం ఎన్నుకునే అవకాశం ఇవ్వాలని కోర్టుకు, ప్రభుత్వానికి బీటీఎన్జీవో విన్నవించగా ఎన్నికలు జరుగుతున్నాయి.

హైదరాబాద్‌కు చేరిన రఫీక్ మృతదేహం

కేసీఆర్, కేటీఆర్, కవితకు టీఆర్ఎస్ చైనా ప్రతినిధుల కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల చైనాలో గుండెపోటుతో మృతిచెందిన సయ్యద్ రఫీక్ (33) మృతదేహం శుక్రవారం హైదరాబాద్ చేరుకొన్నట్టు టీఆర్ఎస్ చైనా శాఖ ప్రతినిధులు తెలిపారు. రఫీక్ మృతదేహాన్ని ప్రభుత్వ ఖర్చులతో హైదరాబాద్‌కు చేర్చడంలో సహకరించినందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. సయ్యద్ చనిపోయిన సమాచారం అందిన వెంటనే టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేష్ బిగాల సహాయ సహకారాలు అందించారని తెలిపారు. మృతదేహాన్ని తీసుకురావడానికి చైనాలోని భారత కాన్సులేట్ అధికారులతో చర్చించి, రెండువారాల్లోనే అవసరమైన చర్యలు తీసుకోవడంలో టీఆర్ఎస్ ఎన్నారై శాఖ చొరవ చూపిందని పేర్కొన్నారు.

గబ్బిలాల్లా వేలాడింది మీరే

- చంద్రబాబు, టీడీపీ నేతలపై ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఫైర్
- సీఎం కేసీఆర్ ప్రధాని కావడం ఖాయమని ధీమా



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణను గబ్బిలాల్లా పట్టుకుని వేలాడింది చంద్రబాబు, టీడీపీ నాయకులేనని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ నాయకులు గబ్బిలాల్లా ఏపీపై పడుతున్నారనే చంద్రబాబు వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియాపాయింట్‌లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ ప్రతిపక్ష నేత జగన్‌ను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిస్తే, చంద్రబాబు, లోకేశ్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఫెడరల్‌ఫ్రంట్ ఏర్పాటులో ఇతర రాష్ట్రాల నేతలను కలిసినట్టుగానే జగన్‌తో కేటీఆర్ భేటీ అయ్యారని, ఈ పరిణామాణంతో టీడీపీ నాయకులు భూకంపం వచ్చినట్టు ఉలిక్కిపడుతున్నారని ఎద్దేవాచేశారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న పథకాలను ఏపీ ప్రభుత్వం కాపీ కొడుతున్నదని, చంద్రబాబులా డబ్బింగ్ సినిమాలు చేయబోమని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ చంద్రబాబు బొక్కబోర్లాపడ్డారని, ఆంధ్రాలోనూ అదే జరుగబోతున్నదని పేర్కొన్నారు. టీఆర్ఎస్ పార్టీ జాతీయపార్టీగా అవతరించడంతోపాటు సీఎం కేసీఆర్ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

మరోచోటకు పోతిరెడ్డిపాడు టెలిమెట్రీ

- 1-3 కిలోమీటర్ల మధ్య ఏర్పాటుకు నిర్ణయం!
- 21 నుంచి టెలిమెట్రీపై సీడబ్ల్యూపీఆర్ఎస్ సర్వే
- 18 చోట్ల వివిధ సెన్సార్ల ఏర్పాటుకు అధ్యయనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోతిరెడ్డిపాడుపై కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏర్పాటుచేసిన లోపభూయిష్టమైన టెలిమెట్రీని ఎట్టకేలకు మార్చేందుకు రంగం సిద్ధమవుతున్నది. ఐదేండ్లుగా లెక్కల చిక్కులతో అయోమయంగా మారిన కృష్ణాజలాల పంపిణీకి సాంకేతిక పరిష్కారదిశగా అడుగులు పడుతున్నాయి. రూ.రెండు కోట్లు వెచ్చించి.. నిరుపయోగంగా మారిన టెలిమెట్రీని చక్కబెట్టేందుకుగాను కేంద్రప్రభుత్వ ఆధీనంలోని సెంట్రల్ వాటర్, పవర్ రీసెర్చి సెంటర్ చేపట్టనున్న కీలకసర్వే ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నది. ఆ సంస్థ శాస్త్రవేత్తలు 18 ప్రదేశాల్లో ఏ పాయింట్ వద్ద సర్వే నిర్వహిస్తారనే దానిపై తాజాగా స్పష్టత వచ్చింది. ఇందులో ప్రధానంగా పోతిరెడ్డిపాడుకు సంబంధించి గతంలో ఏర్పాటుచేసిన టెలిమెట్రీని మార్చేందుకు నిర్ణయించడం విశేషం. గతంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ దిగువన 12.264 కిలోమీటర్ వద్ద టెలిమెట్రీని ఏర్పాటుచేయగా.. అది కచ్చితమైన లెక్కల్ని అందించలేకపోయింది. పైగా, సాంకేతికంగానూ ఆ ప్రదేశం, అక్కడ ఏర్పాటుచేసిన పరికరం సరైనది కాదని నిపుణుల కమిటీ సైతం తేల్చింది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ దిగువన 1-3 కిలోమీటర్ల దూరంలోనే సైడ్‌లుకింగ్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్‌ను ఏర్పాటుచేసేందుకు సర్వే నిర్వహించనున్నారు.

18 పాయింట్ల వద్ద సర్వే..

పోతిరెడ్డిపాడుతోపాటు మరో 17 పాయింట్ల వద్ద కూడా సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు సర్వే నిర్వహించనున్నారు. గతంలోనే పదకొండు చోట్ల సర్వేకు ఈ షెడ్యూల్ ఖరారైనప్పటికీ.. తాజాగా బోర్డు అధికారులు వాటిసంఖ్యను 18కి పెంచారు. ఇందులో పది పాయింట్లు ఏపీ పరిధిలో, ఏడు పాయింట్లు తెలంగాణ పరిధిలో ఉండగా.. మరో పాయింట్ రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉంది. పైగా గతంలో నిర్ణయించిన సెన్సార్లలోనూ తాజాగా మార్పులు చేశారు. నాగార్జునసాగర్ ఎడమ, కుడి కాల్వలు, పాలేరు రిజర్వాయర్ ఇన్‌టేక్ పాయింట్, ఎడమ కాల్వపై ఏపీ-తెలంగాణ సరిహద్దు అయిన 101.362 కిలోమీటర్ వద్ద, ప్రకాశం బరాజ్ సమీపంలోని పోలవరం కాల్వ కలిసే పాయింట్, బరాజ్ తూర్పు, పశ్చిమ ప్రధాన కాల్వలు, కేసీ కెనాల్‌పై సుంకేశుల వద్ద, నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్, పులిచింతల రిజర్వాయర్, ప్రకాశం బరాజ్, గుంటూరు చానెల్, ఆర్డీఎస్ కాల్వకు సంబంధించి కర్ణాటక-తెలంగాణ సరిహద్దు, జూరాల ఎడమ, కుడి కాల్వలు, నెట్టెంపాడుతోపాటు హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం వద్ద టెలిమెట్రీ ఏర్పాటుపై సర్వే జరుగనున్నది. వీటిలో తొమ్మిదిచోట్ల సైడ్‌లుకింగ్ డాప్లర్స్, నాలుగుచోట్ల లెవల్ సెన్సార్లు, ఆరుచోట్ల లెవల్ కమ్ వెలాసిటీ సెన్సార్లు ఏర్పాటుచేయనున్నారు.

వంద కోట్ల మొక్కలు నాటడంపై కార్యాచరణ!

- గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుపై 23న ఉన్నతస్థాయి సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రానున్న వానాకాలం నుంచి ఏడాదికి వంద కోట్ల మొక్కలు నాటడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అన్నిశాఖలతో కలిపి ఉమ్మడి ప్రణాళిక సిద్ధమవుతున్నది. ప్రతి గ్రామానికి నర్సరీ నెలకొల్పేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వంద కోట్ల మొక్కలు నాటే కార్యాచరణపై చర్చించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధ్యక్షతన ఈ నెల 23న ఉన్నతస్థాయి సమావేశం జరుగనున్నది. 20 శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. అడవుల రక్షణ, పర్యావరణ పరిరక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సీఎం కే చంద్రశేఖర్‌రావు ఇటీవల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దాంతో వంద కోట్ల మొక్కల కోసం నర్సరీల ఏర్పాటు, శాఖలవారీగా లక్ష్యాలను నిర్దేశించడం వంటి అంశాలపై చర్చించనున్నారు. ప్రస్తుతం సుమారు 3,500 నర్సరీలు ఉండగా.. మరో 9 వేల నర్సరీలను ఏర్పాటుచేయాలని అధికారులు భావిస్తున్నారు. అటవీశాఖ ఈసారి 22 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకొన్నది.

హెల్మెట్ ధరించు.. ప్రమాదాలు నియంత్రించు

- కరీంనగర్‌లో పోలీసుల భారీ ర్యాలీ

కరీంనగర్ క్రైం: హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచిస్తూ కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు శుక్రవారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడమే కాకుండా, హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలు కావడం వల్లే మృతుల సంఖ్య పెరుగుతున్నదని, దానిని నివారించేందుకు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఫిబ్రవరి 1 నుంచి హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు అశోక్, శ్యాంసుందర్, సీఐలు సీతారెడ్డి, శ్రీలత, శ్రీనివాసరావు, దేవారెడ్డి, విజయ్‌కుమార్, ఎల్అండ్‌టీ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

21న పెన్షనర్ల సమస్యలపై భేటీ

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:పెన్షనర్ల సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 21న సీఎస్ ఎస్కే జోషి హైదరాబాద్‌లో సమావేశాన్ని నిర్వహించనన్నట్టు ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోసం అంజయ్య తదితరులు ఎంపీని కలిసి సమస్యలను విన్నవించగా, ఆయన ఈ మేరకు సీఎస్‌తో సమావేశం ఏర్పాటుచేయించనున్నారు.

వరంగల్ అబ్బాయి.. ఫిలిప్పైన్స్ అమ్మాయి



పనిచేసేచోట చిగురించిన ప్రేమ.. ఖండాలు దాటి ఇద్దరిని ఒక్కటి చేసింది. వరంగల్‌లోని హన్మకొండ గుడిబండల్‌కు చెందిన దండ్రె మొగిలయ్య, సంతోష కుమారుడు చతుర్వేద్ మలేషియాలో ఉద్యోగం చేస్తుండగా, ఫిలిప్పైన్స్‌కు చెందిన మారిలిన్ మొల్లానిడ కూడా అక్కడే పనిచేస్తున్నారు. వీరిరువురు ప్రేమించుకొని పెద్దలను ఒప్పంచి శుక్రవారం హన్మకొండ బొక్కలగడ్డ సమీపంలోని సీఎస్ఐ చర్చిలో పెండ్లి చేసుకున్నారు.
–రెడ్డికాలనీ (వరంగల్)

ఒకే కుటుంబానికి నాలుగు పదవులు ఏకగ్రీవం

- సర్పంచ్‌తో పాటు, మూడు వార్డు స్థానాలు



పోతినేని శివశంకర్, ఇస్తారి, జయమ్మ, సావిత్రి

పినపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సీతంపేట పంచాయతీ ఎన్నికల్లో ప్రత్యేకతను సంతరించుకున్నది.. రెండో విడుతలో భాగంగా ఎన్నిక జరగాల్సి ఉన్న ఈ పంచాయతీ పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. పంచాయతీ ఎస్టీలకు రిజర్వ్ కాగా గ్రామంలో టీఆర్‌ఎస్ మద్దతు ఇచ్చిన పోతినేని శివశంకర్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఎనిమిదివార్డులకుగాను పోతినేని శివశంకర్ కుటుంబసభ్యులు ముగ్గురు వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిలో శివశంకర్ తండ్రి పోతినేని ఇస్తారి (ఈయనకు ఇద్దరు భార్యలు), పినతల్లి సావిత్రమ్మ, తల్లి జయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా ఐదు వార్డులు ఇతరులకు దక్కాయి.



మీ జగ్గులు మాకొద్దు!

వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 6వ వార్డు , 7వ వార్డు అభ్యర్థులు తమ ఎన్నికల గుర్తైన జగ్గులను పంపిణీ చేశారు. శుక్రవారం దీనిపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. తాము టీఆర్‌ఎస్ బలపర్చినవారికే మద్దతు తెలుపుతామంటూ కాంగ్రెస్ వారు పంపిణీ చేసిన స్టీల్ జగ్గులను తిరిగి వారి ఇంటి వద్ద పెట్టి నిరసన తెలిపారు.

-ధర్మసాగర్



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో అమరేందర్ రాజు

మూడు గ్రామాల్లో ఎన్నికల బహిష్కరణ

ఇందల్వాయి /ఇల్లంతకుంట: నిజామాబాద్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లోని మూడు గ్రామాల ప్రజలు పంచాయతీ ఎన్నికలు బహిష్కరించారు. శుక్రవారం నామినేషన్లకు చివరి రోజైనప్పటికీ ఈ గ్రామాల్లో ఎలాంటి నామినేషన్లు దాఖలుకాలేదు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి, గన్నారం తండా కొత్త పంచాయతీల ఏర్పాటు చేసింది. గన్నారం తండాను వేరుచేసి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసినా.. విభజన సరిగ్గా చేయలేదంటూ ఎన్నికలు బహిష్కరించారు. తిర్మన్‌పల్లి, గన్నారం తండాల్లో వార్డు స్థానాలు, సర్పంచ్ పదవులకు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఇందల్వాయి మండల ఎన్నికల అధికారి గణపతినాయక్ వెల్లడించారు. సమస్యను జిల్లా పంచాయతీ అధికారికి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా గొల్లపల్లి గ్రామస్థులు ఎన్నికలు బహిష్కరించారు. గొల్లపల్లి నుంచి వెంకట్రావుపల్లి నూతన పంచాయతీగా ఏర్పడింది. ఇందులో గొల్లపల్లి గ్రామంలో ఉన్న 150 మంది ఓటర్లను, ప్రభుత్వ పాఠశాలను వెంకట్రావుపల్లి గ్రామంలో కలిపారు. ఈ క్రమంలో 300 పై చిలుకు ఓట్లతో గొల్లపల్లి చిన్నగ్రామంగా మారింది. తమ గ్రామానికి చెందిన 150 ఓట్లను వెంకట్రావుపల్లిలో కలుపడం సరికాదంటూ గొల్లపల్లి గ్రామస్తులు ఓట్లను బహిష్కరించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తామని ఇల్లంతకుంట ఎంపీడీవో అమరేందర్‌రాజు మీడియాకు తెలిపారు.

ఫిబ్రవరిలో కొత్త సర్పంచ్‌లకు శిక్షణ!

- ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం
- రెండ్రోజులపాటు పలుఅంశాలపై స్వయంగా అవగాహన కల్పించనున్న ముఖ్యమంత్రి
- గ్రామ పంచాయతీల విధులు-నిర్వహణ, అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రతపై ఫోకస్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు. అలాంటి పల్లెల అభివృద్ధిపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక దృష్టిసారించారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సరఫరా వ్యవస్థతోపాటు వీధిలైట్లు, శ్మశానవాటికలు వంటి వసతుల కల్పించడం, ఖాళీస్థలాల్లో మొక్కలు పెంచేవిధంగా కార్యాచరణ రూపొందించారు. గ్రామ అభివృద్ధి బాధ్యతను నేరుగా సర్పంచ్‌లకే అప్పగించారు. ఈ కార్యక్రమాల నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం కోసం గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తికాగానే ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్వయంగా కొత్త సర్పంచ్‌లకు రెండ్రోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లుచేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ముఖ్యంగా పంచాయతీల అభివృద్ధికి పారదర్శకంగా నిధుల ఖర్చు, పచ్చదనం పెంపు, పరిశుభ్రత, చెత్త నిర్వహణ వంటి గ్రామాభివృద్ధికి ఉపయోగపడే ప్రతి అంశంపై కూలంకుశంగా సర్పంచ్‌లకు అవగాహన కల్పిస్తారు. ఇదే సమయంలో సర్పంచ్‌లకు విధుల నిర్వహణ ఏవిధంగా చేయాలో కూడా వివరిస్తారు. ఇప్పటికే గ్రామీ ణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేదిశగా విప్లవాత్మకమైన చర్య లు తీసుకున్న ముఖ్యమంత్రి.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, అద్దంలా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

గ్రామాలకు పెద్దఎత్తున నిధులు

గ్రామపంచాయతీలకు జవసత్వాలు కల్పించేలా బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తూ, విధులను స్పష్టంచేస్తూ నూతన గ్రామపంచాయతీ చట్టాన్ని సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. దీంతో గ్రామ పంచాయతీలకు నిధులు వరదలాపారనున్నాయి. ప్రతి పంచాయతీకి రాష్ట్ర బడ్జెట్ నుంచి ఏడాదికి రూ.20 లక్షల నుంచి తక్కువలో తక్కువ అతిచిన్న గ్రామ పంచాయతీకి కూడా రూ.5 లక్షలకు తగ్గకుండా నిధులు వస్తాయి. ఈ నిధులతో ఆయా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, ప్రజలు గ్రామసభలో చర్చించి అభివృద్ధి చేసుకోవచ్చు. ఇవికాకుండా 14వ ఆర్థికసంఘం ద్వారా గ్రామాలకు కేంద్ర నిధులు వస్తాయి. వీటిని ఎంపీ, ఎమ్మెల్యేల అనుమతితో సంబంధం లేకుండా నేరుగా పంచాయతీలే అభివృద్ధి పనులకు వెచ్చించవచ్చు. ఇవి కాకుండా ఇంటి పన్నులు, గృహ నిర్మాణ అనుమతుల ఫీజుల ద్వారా వచ్చే ఆదాయంతోపాటు పంచాయతీల పరిధిలో ఏవైనా పరిశ్రమలు ఏర్పాటుచేస్తే వాటినుంచి కూడా నిధులు వస్తాయి. ఎమ్మెల్యే, ఎంపీ కోటానుంచి నిధులు వస్తాయి.

శరవేగంగా అభివృద్ధి

గ్రామాల అభివృద్ధికి పరిపాలన వికేంద్రీకరణ అవసరమని సీఎం కేసీఆర్ భావించారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో 'మా తండాలో మా రాజ్యం' అనే గిరిజనుల నినాదాన్ని నిజంచేసిన సీఎం కేసీఆర్.. దాదాపు నాలుగువేలకుపైగా కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటుచేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలుచేస్తున్నారు. ఇప్పటికే కులవృత్తులకు జీవం పోశారు. రైతులకు భరోసా ఇచ్చారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామీణ ఆర్థికవ్యవస్థ గాడిన పడింది. గ్రామీణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రతి ఇంటికి నల్లాల ద్వారా సురక్షిత మంచినీటిని అందించడానికి మిషన్ భగీరథను అమలుచేస్తున్నారు. గ్రామస్థాయిలోనే నిర్ణయం తీసుకొని అమలుచేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌లోనే నిధులు కేటాయించారు. ఇప్పుడు వాటిని సరిగ్గా వినియోగించి గ్రామాలను శరవేగంగా అభివృద్ధి చేయడం కోసం నూతన సర్పంచ్‌లకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

సోపానం

వార్డు సభ్యుడి నుంచి అసెంబ్లీ దాకా

- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి రాజకీయ ప్రస్థానం



కల్వకుర్తి, నమస్తే తెలంగాణ: వార్డు సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టి ఐదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ రెండుసార్లు ఎమ్మెల్యే పదవి చేపట్టారు కల్వకుర్తి మాజీ శాసనసభ్యుడు ఎడ్మ కిష్టారెడ్డి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన ఎడ్మ కిష్టారెడ్డి 1947లో జన్మించారు. పీయూసీ వరకు చదివారు. 20 ఏండ్ల వయసులో సంయుక్త సోషలిస్టు పార్టీ ద్వారా రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1970లో కల్వకుర్తి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా విజయం సాధించారు. 1973లో కల్వకుర్తి పంచాయతీకి జరిగిన ఉప ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందారు. సామ్యవాదభావాలు, సిద్ధాంతాలు కలిగిన కిష్టారెడ్డి.. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని వ్యతిరేకించడంతో 1975 డిసెంబర్ 31న అరెస్టయ్యారు. 14 నెలలు చంచల్‌గూడ జైలులో గడిపారు. 1981లో రెండోసారి కల్వకుర్తి సర్పంచ్‌గా గెలిచారు. సర్పంచ్‌గా కొనసాగుతూనే.. 1985లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచి ఓడిపోయారు. అనంతరం టీడీపీలో చేరి, 1986లో జరిగిన మండల పరిషత్ ప్రత్యక్ష ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో ఎంపీపీగా గెలుపొందారు. అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా కిష్టారెడ్డి టీడీపీకి రాజీనామా చేసి.. 1994లో కల్వకుర్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీచేసి విజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ పార్టీలో చేరి ఓడిపోగా, 2004లో రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం టీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పాటుపడుతున్నారు. పదవీ ఉన్నా.. లేకున్నా ప్రజలపక్షాన ఉండాలన్నదే తన ఆశయమని, ప్రజలకు సేవ చేయాలనే అంకితభావం లేనివారు, ప్రజా సమస్యలపై అవగాహన లేనివారు సుదీర్ఘ రాజకీయాల్లో కొనసాగడం కష్టమని, నాయకుడనే వాడు గ్రామస్థాయినుంచి ఎదగాలని మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి అంటున్నారు.

నిన్న ఎమ్మెల్యే అభ్యర్థి.. నేడు సర్పంచ్

- పెద్దపల్లి జిల్లా కుర్మపల్లి పంచాయతీకి బాపయ్య ఏకగ్రీవ ఎన్నిక



పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలైన వ్యక్తి తాజాగా పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం కుర్మపల్లికి చెందిన మామిడిపల్లి బాపయ్య గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పెద్దపల్లి అభ్యర్థిగా బరిలోకి దిగారు. కేవలం 876 ఓట్లు సాధించి ఓడిపోయారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో పెద్దపల్లి మండలంలో కొత్తగా ఏర్పడ్డ కుర్మపల్లి గ్రామ పంచాయతీ నుంచి సర్పంచ్‌గా నామినేషన్ వేశారు. రెండోవిడుత పంచాయతీ ఎన్నికల్లో నోటిఫికేషన్ వేసినవారిలో బాపయ్య మినహా మిగతా అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో బాపయ్య ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామంలో ఎనిమిది వార్డుస్థానాలు కూడా ఏకగ్రీవమయ్యాయి.

మూడోవిడుతకు ముగిసిన నామినేషన్లు

- నేడు పరిశీలన.. అర్హుల జాబితా ప్రకటన
- రేపు అభ్యంతరాల స్వీకరణ
- తొలివిడుత ప్రచారానికి నేటితో తెర
- కొనసాగుతున్న రెండోవిడుత ప్రచారం
- పోలింగ్‌కు 44గంటల ముందు ప్రచారం బంద్
- మరోసారి రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: మూడోవిడుత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ ముగిసింది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ఆయాగ్రామాల్లో నామినేషన్లు దాఖలుచేసేందుకు అభ్యర్థులు బారులుతీరారు. మొత్తం 4,116 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు గురువారం వరకు 9,773 నామినేషన్లు దాఖలయ్యాయి. 36,729 వార్డుస్థానాలకు 27,273 నామినేషన్లు వచ్చాయి. ఈ విడుతలో భాగంగా శనివారం నామినేషన్ల పరిశీలనచేసి, అర్హతపొందిన నామినేషన్ల జాబితాను విడుదల చేయనున్నారు. ఈ నెల 20న అభ్యంతరాలను స్వీకరించి, 22న తుది జాబితా ప్రకటించనున్నారు. శుక్రవారం రాత్రివరకు అందిన సమాచారం ప్రకారం కామారెడ్డి జిల్లాలో 23, ఆదిలాబాద్‌లో 50, నిర్మల్‌లో 8, నిజామాబాద్‌లో 38, వరంగల్ రూరల్‌లో 18, వరంగల్ అర్బన్‌లో 3, నల్లగొండలో 4, కరీంనగర్‌లో మూడు, పెద్దపల్లిలో ఒకటి, జగిత్యాలలో 6, రాజన్న సిరిసిల్లలో 9, జోగులాంబ గద్వాలలో 2, వికారాబాద్‌లో 10, జనగామ 4, మంచిర్యాలలో 2, జగిత్యాలలో 6 చొప్పున పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

తొలివిడుత పోలింగ్‌కు సిద్ధం

పంచాయతీ ఎన్నికల తొలితవిడుత పోలింగ్‌కు సర్వం సిద్ధమయింది. తొలివిడుత పోలింగ్ ఈ నెల 21న జరుగనుండగా.. శనివారం సాయంత్రం 5 గంటలతో ప్రచారపర్వానికి తెరపడనున్నది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను మూడువిడుతల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి విడుతలో పోలింగ్‌కు 44 గంటల ముందు ప్రచారం ముగించాలని రాష్ట్రఎన్నికల సంఘం శుక్రవారం మరోసారి ఉత్తర్వులు జారీచేసింది. తొలివిడుతలో 4,479 గ్రామాలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా.. రిజర్వేషన్లు, కోర్టుకేసుల నేపథ్యంలో తొమ్మిదిచోట్ల నిర్వహించడం లేదు. ఈ పంచాయతీల్లో ఒక్కనామినేషన్ కూడా దాఖలుకాలేదు. మంచిర్యాల జిల్లాలో 2, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2, నాగర్‌కర్నూల్ జిల్లాలో 5 గ్రామాల సర్పంచ్‌లు, వాటి పరిధిలోని మొత్తం 192 వార్డులకు ఎన్నికలు జరుగడం లేదు. తొలివిడుతలో మొత్తం 769 పంచాయతీల్లో పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన 3,701 పంచాయతీల్లో సర్పంచ్‌స్థానాలకు 12,202 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అదేవిధంగా 10,654 వార్డుస్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 28,976 వార్డుల్లో 70,094 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. తొలివిడుత ప్రచారం ఈ నెల 14న ప్రారంభమైంది. తమకు కేటాయించిన గుర్తులతో అభ్యర్థులు విస్తృతంగా ప్రచారంచేశారు. టీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులపక్షాన పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ప్రచారం చేశారు. రెండో విడుత ప్రచారం కొనసాగుతున్నది. పంచాయతీ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్రఎన్నికల సంఘం శుక్రవారం అత్యవసర ఉత్తర్వులు జారీచేసింది. అన్ని విడుతల్లో పోలింగ్‌కు 44 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలని.. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే రెండేండ్ల జైలుశిక్షతోపాటు, ఒకటర్మ్ ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హత వేటువేస్తామని హెచ్చరించింది. మొదటివిడుతలో ఈనెల 19న సాయంత్రం 5 గంటలు, రెండోవిడుతలో 23న సాయంత్రం 5 గంటలు, మూడోవిడుతలో 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం ముగించాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. అభ్యర్థులు నేరుగా, టీవీ, మీడియా, పత్రికల్లోనూ ప్రచారం చేయరాదని పేర్కొన్నది. ప్రచార గడువు ముగిశాక పబ్లిక్ సమావేశాలు నిర్వహించినా, మైక్‌లు వినియోగించినా చర్యలుతీసుకుంటామని, అభ్యర్థులు, ప్రచార నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ సూచించారు.

ఒక్కతాటిపైకి 788 గ్రామాలు

- రెండో విడుతలో పెరిగిన ఏకగ్రీవాలు
- ఏకగ్రీవంగా 10,317 వార్డులు
- ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 65 పంచాయతీలు ఏకగ్రీవం
- ప్రారంభమైన ప్రచారం.. 25న పోలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ గ్రామాలు రికార్డు సృష్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా పలు గ్రామాల్లో ప్రజలు ఒక్కతాటిపై నిలుస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన పంచాయతీలతోపాటు, పాతగ్రామాలనూ ప్రజలు ఏకవాక్య తీర్మానంతో ఏకగ్రీవం చేసుకొంటున్నారు. సర్కారు నజరానా, ఎమ్మెల్యేల ప్రోత్సాహకాలతోపాటు నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎక్కువ నిధులు వస్తుండటంతో గ్రామాల అభివృద్ధికి ముందడుగువేస్తున్నారు. తొలివిడుతలో 769 పంచాయతీలు ఏకగ్రీవమైతే.. రెండోవిడుతలో వీటిసంఖ్య 788కి చేరింది. ఇందులో 700 గ్రామాల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొదటివిడుతలో 10,654 వార్డులు ఏకగ్రీవమైతే.. రెండోవిడుతలో 10,317 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండోవిడుత నామినేషన్లపై స్పష్టత వచ్చింది. రెండోవిడుతలో ఎన్నికలు జరుగుతున్న 4,134 గ్రామపంచాయతీలకుగాను 788 పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రెండోవిడుతలో ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 65 పంచాయతీలు ఏకగ్రీవం కాగా.. తర్వాతిస్థానంలో మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాలు నిలిచాయి. ఇక ఈ విడుతలో ఎన్నికలు జరుగనున్న 3,342 పంచాయతీల్లో 10,668 మంది అభ్యర్థులు సర్పంచ్ స్థానాల్లో, 26,191 వార్డులకు 63,480 మంది పోటీపడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసి, అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. సర్పంచ్‌తో పాటు, వార్డు అభ్యర్థులు కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రెండోవిడుత పోలింగ్ ఈ నెల 25న జరుగుతుండగా, 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగియనున్నది.

రెండో విడుతలో సర్పంచ్ స్థానాల వివరాలు

జిల్లా	మొత్తం పంచాయతీలు	ఏకగ్రీవం	ఎన్నికలు జరిగేవి	పోటీపడుతున్న అభ్యర్థులు
ఆదిలాబాద్	149	65	83	306
కుమ్రంభీం ఆసిఫాబాద్	107	19	86	285
మంచిర్యాల	102	14	88	283
నిర్మల్	131	25	106	360
జగిత్యాల	122	22	100	426
కరీంనగర్	107	5	102	432
పెద్దపల్లి	76	9	67	312
రాజన్న సిరిసిల్ల	84	16	68	376
భద్రాద్రి కొత్తగూడెం	142	17	125	343
ఖమ్మం	204	35	168	468
జోగులాంబ గద్వాల	74	14	60	160
మహబూబ్‌నగర్	243	58	185	594
నాగర్‌కర్నూల్	141	21	120	381
వనపర్తి	88	20	68	200
మెదక్	170	40	130	350
సంగారెడ్డి	190	52	138	342
సిద్దిపేట	191	19	172	550
నల్లగొండ	276	52	224	678
సూర్యాపేట	160	29	131	345
యాదాద్రి భువనగిరి	129	16	113	309
కామారెడ్డి	192	52	140	432
నిజామాబాద్	142	33	109	348
మేడ్చల్ మల్కాజిగిరి	28	5	23	93
రంగారెడ్డి	181	21	160	489
వికారాబాద్	168	18	150	469
జనగామ	109	27	82	234
జయశంకర్ భూపాలపల్లి	124	7	116	420
మహబూబాబాద్	147	42	105	296
వరంగల్ రూరల్	136	33	103	309
వరంగల్ అర్బన్	22	2	20	77
మొత్తం	4135	788	3342	10668

రెండో విడుతలో వార్డుసభ్యుల వివరాలు

జిల్లా	మొత్తం వార్డులు	ఏకగ్రీవం	ఎన్నికలు జరిగేవి	పోటీపడుతున్న అభ్యర్థులు
ఆదిలాబాద్	1208	839	362	886
కుమ్రంభీం ఆసిఫాబాద్	928	311	648	1368
మంచిర్యాల	868	219	648	1553
నిర్మల్	1170	420	748	1681
జగిత్యాల	1172	395	776	1983
కరీంనగర్	1014	167	847	2354
పెద్దపల్లి	718	164	554	1508
రాజన్న సిరిసిల్ల	744	236	508	1542
భద్రాద్రి కొత్తగూడెం	1294	289	1000	2325
ఖమ్మం	1862	469	1376	3120
జోగులాంబ గద్వాల	716	170	546	1147
మహబూబ్‌నగర్	2068	698	1368	3427
నాగర్‌కర్నూల్	1240	260	980	2417
వనపర్తి	814	253	561	1350
మెదక్	1444	427	1017	2391
సంగారెడ్డి	1598	579	1019	2114
సిద్దిపేట	1698	238	1460	3706
నల్లగొండ	2376	585	1786	4125
సూర్యాపేట	1462	261	1201	2651
యాదాద్రి భువనగిరి	1150	160	989	2318
కామారెడ్డి	1622	720	901	2159
నిజామాబాద్	1296	452	841	2002
మేడ్చల్ మల్కాజిగిరి	274	50	223	719
రంగారెడ్డి	1656	256	1400	3844
వికారాబాద్	1474	308	1166	2802
జనగామ	966	317	649	1512
జయశంకర్ భూపాలపల్లి	1076	201	858	2160
మహబూబాబాద్	1276	438	838	1981
వరంగల్ రూరల్	1210	396	810	1885
వరంగల్ అర్బన్	208	39	169	450
మొత్తం	36602	10317	26191	63480

అధికారులకు మెజిస్టీరియల్ పవర్స్

- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిఘా, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నియామకం
- ఉత్తర్వులు జారీచేసిన న్యాయశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మూడు దశల్లో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణకుగాను సంగారెడ్డి, జోగుళాంబ గద్వాల, సూర్యాపేట, నిజామాబాద్ జిల్లాల్లో అధికారులకు మెజిస్టీరియల్ అధికారాలను కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జిల్లాలవారీగా ఉత్తర్వులు జారీచేసింది. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యేవరకు ప్రభుత్వాధికారులకు ఈ ప్రత్యేకాధికారాలు కొనసాగుతాయని న్యాయశాఖ పేర్కొన్నది. ఈ జిల్లాల్లో రెవెన్యూ డివిజన్లవారీగా ప్రత్యేక నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు. అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువుల తరలింపును అడ్డుకొనేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. తమకు కేటాయించిన ప్రాంతాల్లో క్రిమినల్ ప్రొసీజర్ చట్టంలోని 37, 44, 103, 129, 133, 143, 144, 174(4), 176 సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకొనే అధికారం ప్రత్యేకాధికారులకు ఉంటుంది.

83 వేల నగదు పట్టివేత

- ఇప్పటివరకు రూ.1.22 కోట్ల నగదు, రూ.14లక్షల మద్యం సీజ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత తనిఖీలు చేపట్టి పెద్దమొత్తంలో నగదు, మద్యం సీజ్ చేసింది. శుక్రవారం ఖమ్మం జిల్లాలో రూ.83,180 నగదు, రూ.15,820 విలువచేసే మద్యం స్వాధీనం చేసుకొన్నారు. అలాగే జగిత్యాల జిల్లాలో రూ.11,140, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రూ.15,225, మెదక్ జిల్లాలో రూ.25,960, వనపర్తి జిల్లాలో రూ.12,250, నల్లగొండ జిల్లాలో రూ.69 వేలు, కరీంనగర్ జిల్లాలో రూ.2,42,075, రాచకొండ కమిషనరేట్ పరిధిలో రూ.12,050 విలువైన మద్యం పట్టుకొన్నట్టు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. 25 కేసులు నమోదుచేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.1,22,07,000 నగదు, రూ.14,09,322 విలువైన మద్యం సీజ్ చేసి మొత్తం 88 కేసులు నమోదుచేసి 62 మందిని అరెస్టు చేసినట్టు, 11 మంది అభ్యర్థులపై కేసు నమోదుచేసినట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది.

ఆడలేడన్నారు.. ఆట అయిపోయిందన్నారు.. పరుగెత్తలేడన్నారు.. పరుగులు చేయడం మర్చిపోయాడన్నారు.. వయసైపోయిందన్నారు.. వికెట్ల వెనుక చురుకుగా కదల్లేడన్నారు.. ఫినిషర్‌గా పనికిరాడన్నారు.. జట్టులో చోటే దండుగన్నారు.. తప్పకుంటే మరీ మంచిదన్నారు.. ఇలా.. ఒకటా, రెండా.. వందలకొద్ది విమర్శలు.. ఒకరా ఇద్దరా.. క్రికెట్ అనే మూడక్షరాల గురించి తెలిసిన ప్రతి ఒక్కరు.. మాటల బాణాలు సంధించినవారే..! అయినా ఏనాడూ తొణకలేదు.. బెణకలేదు.. తానెంటో.. తన సత్తా ఏంటో.. తన అవసరం ఏంటో... స్పష్టంగా తెలిసిన మహేంద్రుడు.. ఆస్ట్రేలియా గడ్డపై మహాద్భుతం చేశాడు. వరుసగా మూడో అర్ధసెంచరీతో అటు సిరీస్‌ను.. ఇటు చరిత్రను ఒకేసారి తిరుగరాశాడు. ఫలితంగా మూడో వన్డేలో ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియా కంగారూ గడ్డపై ద్వైపాక్షిక సిరీస్ గెలిచిన తొలి భారత జట్టుగా రికార్డులకెక్కడంతో పాటు.. ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా ఆసీస్ పర్యటనను ముగించిన తొలి దేశంగా ఆవిర్భవించింది.


చాహల్ (6/42)

ధోనీ జాదూ..

మూడో వన్డేలో 7 వికెట్ల తేడాతో భారత్ గెలుపు

2-1తో సిరీస్ సొంతం

కంగారూ గడ్డపై తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ నెగ్గిన టీమిండియా

సిరీస్ ఓటమి లేకుండా ఆసీస్ టూర్‌ను ముగించిన జట్టుగా రికార్డు


వన్డే సిరీస్ ట్రోఫీతో టీమ్ ఇండియా

కేదార్ జాదవ్ (61★)

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో భారత్ జట్టు సంచలనం..! టెస్ట్ సిరీస్‌తో పాటు వన్డే సిరీస్‌నూ గెలిచిన తొలి భారత జట్టుగా సరికొత్త చరిత్ర. మణికట్టు మాంత్రికుడు యజ్వేంద్ర చాహల్ (6/42) టర్నింగ్ మంత్రకు తోడుగా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ (114 బంతుల్లో 87 నాటౌట్; 6 ఫోర్లు), కేదార్ జాదవ్ (57 బంతుల్లో 61 నాటౌట్; 7 ఫోర్లు) సాహసోపేత ఇన్నింగ్స్ ఆడటంతో.. శుక్రవారం జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో ఆసీస్‌పై గెలిచింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. ఫలితంగా కంగారూల ఇలాకాలో తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ నెగ్గిన జట్టుగా అవతరించింది. అలాగే ఒక్క సిరీస్ కూడా కోల్పోకుండా ఆసీస్ టూర్‌ను ముగించిన తొలి దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. మొన్న 1–1తో టీ20 సిరీస్‌ను డ్రా చేసుకున్న విరాట్‌సేన, 2–1తో టెస్ట్ సిరీస్‌ను, 2–1తో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్నది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మూడో వన్డేలో... టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 48.4 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. హ్యాండ్స్‌కోంబ్ (58) టాప్ స్కోరర్. షాన్ మార్ష్ (39), ఖవాజ (34) ఫర్వాలేదనిపించారు. లక్ష్య ఛేదనలో భారత్ 49.2 ఓవర్లలో 3 వికెట్లకు 234 పరుగులు చేసి నెగ్గింది. కెప్టెన్ కోహ్లీ (46) రాణించాడు. చాహల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', ధోనీకి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

ధోనీ 3.0

లక్ష్యం (231) మోస్తరుదే అయినా.. భారత్ ఓపెనర్లు రోహిత్ (9), ధవన్ (23) సరైన ఆరంభాన్నివ్వలేదు. పిచ్ మందకొడిగా ఉండటం, బ్యాటింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో ఆసీస్ పేసర్లు ఒత్తిడి పెంచారు. ముఖ్యంగా రిచర్డ్‌సన్ (1/27) బౌలింగ్‌ను ఆడటంలో ఇబ్బందిపడ్డ రోహిత్ ఆరో ఓవర్‌లో ఔటయ్యాడు. దీంతో 15 పరుగులకే టీమ్‌ఇండియా తొలి వికెట్ చేజార్చుకుంది. కోహ్లీ మెల్లగా ఆడే ప్రయత్నం చేసినా 12వ ఓవర్‌లో హ్యాండ్స్‌కోంబ్ క్యాచ్ వదిలేయడంతో గట్టెక్కాడు. రెండో ఎండ్‌లో ధవన్ ఫర్వాలేదనిపించినా 17వ ఓవర్‌లో స్టొయినిస్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. ఫలితంగా 59 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన ధోనీ.. విరాట్‌తో కలిసి సాహసోపేత ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టాడు. బంతి బ్యాట్‌పైకి రాకపోవడంతో మొదట డిఫెన్స్‌కు ప్రాధాన్యమిచ్చిన మహీ.. తర్వాతి దశలో తన విశ్వరూపాన్ని చూపెట్టాడు. ఎదుర్కొన్న తొలి బంతికి, 74 పరుగుల వద్ద క్యాచ్ ఔట్‌ల నుంచి బయటపడ్డాడు. ముందు మ్యాక్స్‌వెల్, తర్వాత ఫించ్ ఈ క్యాచ్‌లను వదిలేసి భారీ మూల్యం చెల్లించుకున్నారు. 21 పరుగుల వద్ద డైరెక్ట్ త్రో నుంచి తప్పించుకున్న విరాట్ మూడో వికెట్‌కు 82 బంతుల్లో 54 పరుగులు జోడించి ఔటయ్యాడు. అప్పటికి చేయాల్సిన పరుగులు 100కు పైగానే ఉన్నా.. ధోనీ తన ఫినిషింగ్ నైపుణ్యాన్ని మరోసారి చూపెట్టాడు. కేదార్‌తో కలిసి స్ట్రయిక్ రొటేట్ చేస్తూ సింగిల్స్‌ను రాబట్టాడు. కుర్రాడిలా వికెట్ల మధ్య వేగంగా పరుగులు తీస్తూ రన్‌రేట్‌ను తగ్గకుండా చూశాడు. ఓ లెక్క ప్రకారం ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మహీ.. ఎక్కడా తడబాటు లేకుండా అటు పేసర్లను, ఇటు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఫలితంగా 74 బంతుల్లో కెరీర్‌లో 70వ అర్ధసెంచరీని పూర్తి చేశాడు. ఓవరాల్‌గా ఈ సిరీస్‌లో వరుసగా మూడో అర్ధసెంచరీ చేసి ధోనీ 3.0గా మారిపోయాడు. ఇందులో రెండు మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ కావడం విశేషం. గెలువాలంటే చివరి 12 బంతుల్లో 14 పరుగులు చేయాల్సిన దశలో 49వ ఓవర్‌లో చెరో ఫోర్‌తో 13 పరుగులు రాబట్టారు. తర్వాతి ఓవర్‌లో కేదార్ బౌండరీతో విజయ లాంఛనం పూర్తి చేశాడు. ఈ ఇద్దరు నాలుగో వికెట్‌కు అజేయంగా 121 పరుగులు జత చేశారు.

చాహల్ 'సిక్సర్'

అంతకుముందు ఆసీస్ ఇన్నింగ్స్‌ను చాహల్ (6/42) చాపలా చుట్టేశాడు. భువనేశ్వర్ (2/28), షమీ (2/47) ఇచ్చిన మెరుపు ఆరంభాన్ని రెండు చేతులా ఒడిసిపడుతూ భిన్నమైన టర్నింగ్, లో బౌన్స్, ఫ్లయిట్ బంతులతో కంగారూలను ముప్పుతిప్పలు పెట్టాడు. ఆరు వికెట్లు తీసిన చాహల్.. జనవరి 2018 సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికా (5/22)పై నెలకొల్పిన తన బెస్ట్‌ను అధిగమించాడు. ఇక 2004లో ఆసీస్ గడ్డపై అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన అగార్కర్ (6/42) రికార్డును సమం చేశాడు. 27 పరుగులకే ఓపెనర్లు ఇద్దరూ ఔటైనా.. ఖవాజ, మార్ష్ కాసేపు పోరాడారు. మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌లో నిలకడ తెచ్చారు. కానీ మూడు బంతుల తేడాలో ఈ ఇద్దరు ఔట్‌కావడం, కొద్దిసేపటికే స్టొయినిస్ (10) వెనుదిరగడంతో (123/5) మళ్లీ తడబడిన ఆసీస్ ఇన్నింగ్స్‌ను హ్యాండ్స్‌కోంబ్ ఆదుకున్నాడు. స్టొయినిస్‌తో ఐదో వికెట్‌కు 22, మ్యాక్స్‌వెల్ (26)తో ఆరో వికెట్‌కు 38, రిచర్డ్‌సన్ (16)తో ఏడో వికెట్‌కు 45 పరుగులు జత చేయడంతో ఆసీస్ స్కోరు 200లు దాటింది. హ్యాండ్స్‌కోంబ్ ఔటైన తర్వాత జంపా (8), స్టాన్‌లేక్ (0) వికెట్లను కాపాడుకోకపోవడంతో పూర్తి ఓవర్లు ఆడకుండానే ఇన్నింగ్స్ ముగిసింది.


మరీ ఇంత పిసినారితనమా?

ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర సృష్టించిన భారత జట్టుకు నగదు పురస్కారం ఇవ్వకపోవడంపై బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మండిపడ్డాడు. తమ ఆట ద్వారా ఆదాయాన్ని సృష్టించిన ఆటగాళ్లు అందులో వాటా పొందేందుకు అర్హులన్నాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్‌గా ఎంపికైన చాహల్, ధోనీలకు 500ల డాలర్లు ఇవ్వడాన్ని సన్నీ తప్పుబట్టాడు. 'మా ఆటగాళ్లను క్రికెట్ ఆస్ట్రేలియా అవమానించింది. ముష్టి వేసినట్లు చెరో 500ల డాలర్లు ఇస్తారా? మరి ఇంత పిసినారితనమా? ఆ ఇద్దరు వాటిని కూడా చారిటీకి విరాళంగా ఇచ్చేశారు. అంటే ఉత్త ట్రోఫీని చేతుల్లో పెట్టారు. మ్యాచ్ ప్రసార హక్కుల ద్వారా నిర్వాహకులు పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించారు. అలాంటప్పుడు ఆటగాళ్లకు నగదు ప్రోత్సాహకాలు ఎందుకు ఇవ్వరు? ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు రావడానికి కారణం క్రికెటర్లే కాదా? ఒకసారి వింబుల్డన్‌ను చూడండి. ఎంత ఇస్తున్నారో పరిశీలించండి. భారీ మొత్తంలో ఆదాయాన్ని సృష్టిస్తున్న ఆటగాళ్లను నగదు పురస్కారాలతో సత్కరించాలి' అని సన్నీ వ్యాఖ్యానించాడు.

స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: క్యారీ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 5, ఫించ్ ఎల్బీ (బి) భువనేశ్వర్ 14, ఖవాజ (సి అండ్ బి) చాహల్ 34, షాన్ మార్ష్ (స్టంప్) ధోనీ (బి) చాహల్ 39, హ్యాండ్స్‌కోంబ్ ఎల్బీ (బి) చాహల్ 58, స్టొయినిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 10, మ్యాక్స్‌వెల్ (సి) భువనేశ్వర్ (బి) షమీ 26, రిచర్డ్‌సన్ (సి) జాదవ్ (బి) చాహల్ 16, జంపా (సి) శంకర్ (బి) చాహల్ 8, సిడెల్ నాటౌట్ 10, స్టాన్‌లేక్ (బి) షమీ 0, **ఎక్స్‌ట్రాలు:** 10, **మొత్తం:** 48.4 ఓవర్లలో 230 ఆలౌట్. **వికెట్లపతనం:** 1–8, 2–27, 3–100, 4–101, 5–123, 6–161, 7–206, 8–219, 9–228, 10–230. **బౌలింగ్:** భువనేశ్వర్ 8–1–28–2, షమీ 9.4–0–47–2, శంకర్ 6–0–23–0, జాదవ్ 6–0–35–0, జడేజా 9–0–53–0, చాహల్ 10–0–42–6.

భారత్: రోహిత్ (సి) మార్ష్ (బి) సిడెల్ 9, ధవన్ (సి అండ్ బి) స్టొయినిస్ 23, కోహ్లీ (సి) క్యారీ (బి) రిచర్డ్‌సన్ 46, ధోనీ నాటౌట్ 87, జాదవ్ నాటౌట్ 61, **ఎక్స్‌ట్రాలు:** 8, **మొత్తం:** 49.2 ఓవర్లలో 234/3. **వికెట్లపతనం:** 1–15, 2–59, 3–113. **బౌలింగ్:** రిచర్డ్‌సన్ 10–1–27–1, సిడెల్ 9–1–56–1, స్టాన్‌లేక్ 10–0–49–0, మ్యాక్స్‌వెల్ 1–0–7–0, జంపా 10–0–34–0, స్టొయినిస్ 9.2–0–60–1.9


ధోనీ (87★)

ద ఫినిషర్

ఎక్కడైనా బ్యాటింగ్‌కు సిద్ధమన్న మహీ

మెల్‌బోర్న్: భారత సీనియర్ క్రికెటర్ ధోనీ మాయ చేశాడు. బ్యాటింగ్‌లో ఆనాటి మెరుపులు కరువై జట్టుకు భారమయ్యాడనుకున్న మహేంద్రుడు తన విలువేంటో చాటిచెప్పాడు. వన్నె తరుగని వజ్రంలా మెరుస్తూనే ఉన్నాడు. బంతులు వృథా చేస్తూ సహచరులపై ఒత్తిడి తీసుకొస్తున్నాడంటూ వస్తున్న అపవాదులను చెరిపేస్తూ పరుగులు కొల్లగొడుతున్నాడు. యువ క్రికెటర్లకు సవాలు విసురుతూ మైదానంలో తనను కొట్టే మగాడే లేడన్న రీతిలో దూసుకెళుతున్నాడు. తనదైన ఫామ్‌ను కొనసాగిస్తూ జట్టు కష్టాల్లో ఉన్న ప్రతిసారి ఆపద్బాంధవునిలా ఒడ్డున పడేస్తున్నాడు. సిరీస్‌లో అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ సిరీస్ దక్కించుకోవాలంటే తప్పక గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో జూలు విదిల్చాడు. అజేయ అర్ధసెంచరీ(114 బంతుల్లో 87 నాటౌట్, 6ఫోర్లు)తో జట్టు సిరీస్ విజయంలో కీలక భూమిక పోషించాడు. కేదార్ జాదవ్(57 బంతుల్లో 61 నాటౌట్, 7ఫోర్లు)తో కలిసి కంగారూల గడ్డపై చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టిన ధోనీ మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడాడు. 'నాలుగో నంబర్‌లో బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తున్నా. అలాగనీ ఒకే స్థానానికి పరిమితం కాలేను. నాలుగో స్థానంలో వచ్చినా..ఆరులో బ్యాటింగ్‌కు వచ్చినా జట్టు సమతుల్యత అనేది ప్రధానం. 14 ఏండ్లు జాతీయ జట్టుకు ఆడిన తర్వాత కూడా ఆరో నంబర్‌లో బ్యాటింగ్ చేయలేనని చెప్పలేను. జట్టును గెలిపించేందుకు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధంగా ఉన్నాను. మెల్‌బోర్న్ వికెట్ చాలా స్లోగా ఉంది. కొట్టాలనుకున్న షాట్ అంత సులభంగా ఆడలేకపోయాం. ఆసీస్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. అందుకే మ్యాచ్‌ను పొడిగిస్తూ ఆట కొనసాగించాలనుకున్నాం. కేదార్ జాదవ్ చక్కని సహకారం అందించాడు. కీలక సమయాల్లో బౌండరీలు బాదుతూ ఆసీస్ బౌలర్లపై ఒత్తిడి తీసుకొచ్చాడు' అని ధోనీ అన్నాడు.


తెలంగాణ భవన్‌లో శుక్రవారం 35వ జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ లోగోను ఆవిష్కరించిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో సాట్స్ చైర్మన్ ఏ వెంకటేశ్వరరెడ్డి, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం శ్రీనివాస్ తదితరులు.

జాతీయస్థాయి కరాటే పోటీలు ప్రారంభం



కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌స్టేడియంలో శుక్రవారం జాతీయ స్థాయి కరాటే పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాంటినెంటల్ షాటోకాన్ కరాటే డొ ఇండియా (సీఎస్‌కేఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను కరీంనగర్ సీపీ వీబీ కమలాసన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతులు, విద్యార్థినులు యుద్ధ క్రీడ కరాటేపై తప్పక దృష్టిసారించాలని సూచించారు. ఈ పోటీల్లో దాదాపు 15 రాష్ర్టాల నుంచి కరాటే క్రీడాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌కేఐ చైర్మన్ చల్ల హరిశంకర్, సీఎస్‌కేఐ ఇండియా చీఫ్ శ్రీనివాస్, రామస్వామి, ప్రవీణ్, ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయినుంచే కరాటే శిక్షణ తరగుతులకు కృషి

మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



శేరిలింగంపల్లి: పాఠశాల స్థాయి నుంచే కరాటే, యోగా శిక్షణ తరగతులు ప్రవేశ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. గచ్చిబౌలిలోని బాలయోగి అథ్లెటిక్స్ క్రీడా స్టేడియంలో శుక్రవారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో నేషనల్ కరాటే చాంపియన్ షిప్–2019ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే ఆత్మరక్షణకు కరాటే, మార్షల్‌ఆర్ట్స్‌పై శిక్షణను అందించాల్సిన అవసరాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కరాటే, యోగా శిక్షణ తరగతులు ప్రవేశపెట్టే ఆలోచన దిశగా అడుగులు వేస్తే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో నిలుస్తుందన్నారు.సినీనటుడు సుమన్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఆత్మరక్షణ అంశంగా పరిగణలోకి తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరాటేను పాఠశాల విద్యకు అనుసంధానం చేయాలన్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల పాటు ఈ కరాటే చాంపియన్‌షిప్ కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జపాన్ కరాటే అసోసియేషన్ మేనేజింగ్ డైరక్టర్ వై ఒరుగా, ఇన్‌స్ట్రక్టర్ షిమోగీ, తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లో సైనా

జపాన్ షట్లర్ ఒకుహరను ఓడించిన హైదరాబాద్ స్టార్

క్వార్టర్స్‌లో శ్రీకాంత్ ఓటమి ■ మలేషియా ఓపెన్



కౌలాలంపూర్: స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేషియా ఓపెన్‌లో సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్ 2, జపాన్ షట్లర్ నజోమి ఒకుహరపై హోరాహోరీగా పోరాడి విజయం సాధించింది. ఒకుహరను గతంలో అత్యధికసార్లు ఓడించిన అనుభవంతో హైదరాబాదీ 21–18,23–21 స్కోరుతో ఒకుహరను ఓడించింది. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ పరాజయం పాలయ్యాడు. క్వార్టర్‌ఫైనల్లో శ్రీకాంత్ 23–21, 16–21, 17–21 స్కోరుతో నాలుగోసీడ్, కొరియాకు చెందిన సన్ వాన్ హో చేతిలో పరాజయంతో మలేషియా ఓపెన్ నుంచి ఇంటిదారి పట్టాడు. 12 మ్యాచ్‌లలో ఒకుహరతో తలపడిన సైనా..8 మ్యాచ్‌లలో విజయం సాధించి మరో నాలుగు మ్యాచ్‌లలో ఓడింది. తొలిగేమ్‌లో 9–15 స్కోరుతో వెనుకబడిన సైనా ఈ మ్యాచ్‌లో ఓడిపోయేలా కనిపించింది. అద్భుతంగా పుంజుకున్న సైనా 17–17తో స్కోరు సమం చేసి అదే ఊపులో తొలిగేమ్ గెలుచుకుంది. కాగా, రెండో గేమ్‌లోనూ 14–18 తేడాతో సైనా వెనుకంజ వేసినా తుదికంటా పోరాడి మరోసారి ఒకుహరపై ఆధిపత్యం చాటింది. సెమీస్‌లో సైనాకు స్పెయిన్ స్టార్ షట్లర్ కరోలినా మారిన్ ఎదురవనుంది. ముఖాముఖీ మ్యాచ్‌ల్లో సైనాపై 10 సార్లు మారిన్ గెలువగా..కేవలం 5 మ్యాచ్‌లలో మాత్రమే ఓడింది. ఇద్దరు షట్లర్లు మాంచి ఊపుమీద ఉండడంతో వీరిద్దరి మధ్య సెమీఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగనుంది.


షరపోవా

ప్రి క్వార్టర్స్‌లో షరపోవా

డిఫెండింగ్ చాంపియన్ వోజ్నియాకిని ఓడించిన రష్యా స్టార్

సునాయాస విజయాలతో నాలుగోరౌండ్‌లో ఫెదరర్, నాదల్

మెల్‌బోర్న్: మరియా షరపోవా ఆస్ట్రేలియా ఓపెన్‌లో అదరగొడుతున్నది. నిషేధిత మెల్డోనియం వాడి నిషేధానికి గురైన అనంతరం 2017లో మళ్లీ టెన్నిస్ రాకెట్ చేతబట్టింది. కాగా, మైదానంలో మునుపటిలా రాణించలేకపోవడంతో ఆమె పనైపోయిందని అందరూ భావిస్తున్న వేళ..ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పాత షరపోవాను తలపిస్తున్నది. శుక్రవారం డిఫెండింగ్ చాంపియన్, డెన్మార్క్ అమ్మాయి కరోలిన్ వోజ్నియాకిని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ ప్రవేశించింది. కోర్టులో చిరుతను తలపించిన షరపోవా 6–4,4–6,6–3 స్కోరుతో వోజ్నియాకిని ఓడించి తన పూర్వపు ఆటతీరును ప్రదర్శించింది. సర్వీస్‌పై అద్భుత నియంత్రణ..ఫోర్‌హ్యాండ్ షాట్లతో పాయింట్లు సాధిస్తూ..బ్యాక్‌హ్యాండ్ స్ట్రోకులతో వోజ్నియాకి సర్వీస్‌ను ఎదుర్కొని షరపోవా కెరీర్‌లోనే అత్యుత్తమ విజయంసాధించింది. ప్రిక్వార్టర్స్‌లో స్థానిక టెన్నిస్ ప్లేయర్ అష్లే బార్టీతో షరపోవా తలపడనుంది. మూడోరౌండ్‌లో బార్టీ 7–5,6–1 స్కోరుతో గ్రీస్‌కు చెందిన సక్కారిని ఓడించింది. శుక్రవారం జరిగిన ఇతర మ్యాచ్‌లలో జర్మనీ అమ్మాయి ఎంజెలికా కెర్బర్ 6–1,6–0 స్కోరుతో బిర్రెల్‌పై, అమెరికా స్టార్ స్లోన్ స్టీఫెన్స్ 7–6(8–6),7–6(7–5) స్కోరుతో మాట్రిచ్‌పై,చెక్ భామ పెట్రా క్విటోవా 6–1,6–4 స్కోరుతో బెనిసిచ్‌ను ఓడించి నాలుగోరౌండ్‌లో చోటు సంపాదించుకుంది.

జోరుగా ఫెదరర్.. హుషారుగా నాదల్

స్విస్ టెన్నిస్ యోధుడు రోజర్ ఫెదరర్, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందుకు దూసుకెళుతున్నారు. కుర్రాళ్లతోనూ పోటీలో తనకు ఎదురులేదనేలా ఫెదరర్ 6–2,7–5,6–2స్కోరుతో అమెరికా టెన్నిస్ ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్‌ను వరుసగేముల్లో ఓడించి టోర్నీలో ప్రిక్వార్టర్స్ చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌తో మెల్‌బోర్న్ సెంటర్ కోర్టులో 100వ మ్యాచ్ ఆడిన ఫెదరర్ టోర్నీలో 17వ సారి ప్రి క్వార్టర్స్ చేరుకున్నాడు.'టేలర్ ఇంకా కుర్రాడు. అతను మంచి ఆటగాడు. అతను మరి కొన్నేండ్ల పాటు గ్రాండ్ స్లామ్ టోర్నీలలో నిలకడగా ఆడే సత్తా ఉంది. కఠినమైన ప్రత్యర్థిపై విజయం అందుకోవడం సంతోషంగా ఉంది' అని ఫెదరర్ అన్నాడు. ప్రి క్వార్టర్స్‌లో ఫెదరర్..గ్రీస్‌కు చెందిన 14వ సీడ్ స్టెఫానోస్ సిట్సిపాస్‌ను ఎదుర్కోనున్నాడు. మూడో రౌండ్ మ్యాచ్‌లో నాదల్ 6–1,6–2,6–4 స్కోరుతో అలెక్స్‌పై వరుససెట్లలో విజయం సాధించాడు. ప్రి క్వార్టర్స్‌లో నాదల్.. చెక్ రిపబ్లిక్‌కు చెందిన థామస్ బెర్డిచ్‌తో తలపడనున్నాడు. బెర్డిచ్ 5–7.6–3,7–5,6–4 స్కోరుతో అర్జెంటీనా ఆటగాడు డీగో స్క్వార్ట్జమన్‌ను ఓడించాడు.బెర్డిచ్ 2–14,15 ఏడాదిలో వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్ చేరాడు. క్రొయేషియా ఆటగాడు మారిన్ సిలిచ్ 4–6,3–6,6–1,7–6(10–8),6–3 స్కోరుతో స్పెయిన్ వెటరన్ ఫెర్నాండో వెర్దాస్కోపై, రష్యా స్టార్ దిమిత్రోవ్ 7–6(7–5), 6–4,6–4 స్కోరుతో ఫ్యాబియానూ ఓడించి ప్రి క్వార్టర్స్ చేరుకున్నాడు.


వోజ్నియాకి

సూచీలను కాపాడిన రిలయన్స్

■ ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు.. నష్టాల్లో 1230 షేర్లు



స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఏమాత్రం తగ్గడం లేదు. రిలయన్స్, విప్రో షేర్లు భారీగా లాభపడినప్పటికీ ప్రధాన సూచీలు ఫ్లాట్ ముగిశాయి. ఐటీ, ఎనర్జీ సూచీలు మాత్రమే లాభాలతో గట్టెక్కాయి. నిఫ్టీ కేవలం 1.75 పాయింట్ల లాభంతో 10,906.95 వద్ద ముగిసింది. కాగా, సెన్సెక్స్ 12.53 పాయింట్ల లాభంతో 36,386.61 వద్దముగిసింది. గురువారం మార్కెట్ ముగిసిన తర్వాత ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించిన రిలయన్స్ షేరు ఏకంగా 4.53 శాతం పెరగడంతో ఇండెక్స్‌లు నష్టాలనుంచి గట్టెక్కాయి. ఫార్మా షేర్ల పతనం, రూపాయి మారకం విలువ బలహీన పడడం వంటి కారణాలతో గ్లోబల్ మార్కెట్ల పాజిటివ్ ధోరణి ప్రయోజనం లేకుండా పోయింది. మార్కెట్‌లో మంగళవారంనాడు వచ్చిన పెరుగుదల తర్వాత కొనసాగింపుగా కొనుగోళ్ల మద్దతు లభించలేదు. దీంతో ఊగిసలాట ధోరణి కొనసాగుతున్నది. విప్రో, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు గణనీయంగా లాభపడడంతో ఐటీ ఇండెక్స్ 0.63 శాతం పెరిగింది. అలాగే రిలయన్స్ లాభంతో ఎనర్జీ ఇండెక్స్ దాదాపు రెండున్నర శాతం లాభపడింది. ఇక మిగిలిన ఇండెక్స్‌లన్నీ నష్టాల్లోనే ముగిశాయి. ఫార్మా ఇండెక్స్ గరిష్ఠంగా 2. 7 శాతం, రియల్టీ ఇండెక్స్ 1.28 శాతం, మీడియా 1.61 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.28 శాతం, ఆటో 0.38 శాతం చొప్పున నష్టపోయాయి. కాగా, నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.67 శాతం, స్మాల్‌క్యాప్ 1.07 శాతం చొప్పున నష్టపోయాయి. ఇండెక్స్‌లు స్వల్పలాభంతో ముగిసినప్పటికీ మార్కెట్ బ్రెడ్త్ చాలా నెగటివ్‌గా ఉంది. ఎన్‌ఎస్‌ఈలో మొత్తం 1230 షేర్లు నష్టాల్లో ముగిస్తే కేవలం 519 షేర్లు మాత్రమే లాభాలతో గట్టెక్కాయి. నిఫ్టీలోనూ 34 షేర్లు నష్టపోతే 16 షేర్లు లాభాలను ఆర్జించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ గరిష్టంగా 4.53 శాతం లాభపడింది. విప్రో 3.32 శాతం, కోటక్ బ్యాంక్ 1.66 శాతం, హిందాల్కో 1.43 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 1.39 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, సన్‌ఫార్మా 8.51 శాతం నష్టపోగా, భారతీ ఎయిర్‌టెల్ 6.47 శాతం, గెయిల్ 3.28 శాతం, హెచ్‌పీసీఎల్ 2.01 శాతం ఎల్‌అండ్‌టీ 1.97 శాతం చొప్పున నష్టపోయాయి. కేవలం 7 షేర్లు మాత్రమే కొత్త 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకోగా, 68 షేర్లు కొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేశాయి. ఎఫ్‌ఐఐలు రూ. 124.91 కోట్లు, డీఐఐలు కూడా రూ. 97 కోట్ల అమ్మకాలు జరిపారు.

టార్గెట్ టాప్ 50



సులభతర వాణిజ్యంలో లక్ష్యాన్ని నిర్దేశించిన ప్రధాని మోదీ • వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సుకు అతిరథ మహారథులు

గాంధీనగర్, జనవరి 18: వచ్చే ఏడాది కల్లా సులభతర వాణిజ్యంలో ప్రపంచంలో టాప్-50 లోపు ర్యాంక్ లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. గత ఏడాది మన దేశం 75 స్థానాలు అధిగమించి ప్రపంచంలో 77వ ర్యాంకును సాధించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఏడాదికి టాప్ 50 ర్యాంకింగ్స్‌లోకి చేరుకోవడానికి కష్టించి పనిచేయాలని తన టీమ్‌ను కోరాననీ, ప్రపంచంలో మరే దేశంతోనూ తీసిపోని విధంగా నిబంధనలు, అనుమతుల ప్రక్రియలు ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా ఉండాలనీ ఆయన చెప్పారు. శుక్రవారం నాడిక్కడ మొదలైె వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన వ్యాపార ప్రతినిధులు, రాజకీయ రంగ ప్రముఖులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. సామర్థ్యానికి తగ్గట్టుగా ఇంతకాలం వృద్ధిచెందడానికి అడ్డుగా నిలిచిన ఆటంకాలన్నింటినీ తొలగిస్తున్నామనీ, సంస్కరణలు, డీరెగ్యులేషన్‌ల వేగం కొనసాగిస్తామని తెలిపారు. జీఎస్టీ అమలు, పన్నుల సరళీకరణతో లావాదేవీల వ్యయాలు తగ్గి వ్యాపార ప్రక్రియలన్ని సులభతరం అయ్యాయని అన్నారు. డిజిటల్ ప్రాసెస్, ఆన్‌లైన్ లావాదేవీలతో వ్యాపారాలు వేగంగా చేయడానికి వీలైందని చెప్పారు. వ్యాపారాన్ని మరింత స్మార్ట్‌గా నిర్వహించుకునే వాతావరణం కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన పునరు ద్ఘాటించారు. దేశ పరిపాలన వ్యవస్థ గవర్నెన్స్‌ను మెరుగుపరిచే దిశగా పనిచేస్తున్నదని అన్నారు. 'సంస్కరించుకు, నిరూపించు, పరిణతి చెందు మరింతగా సంస్కరించు' అనే ఏకైక మంత్రంతో తమ ప్రభు త్వం పని చేస్తున్నట్టు ఆయన తెలిపారు. గత నాలుగేండ్లు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అనేక సంస్కరణలు చేపట్టినట్టు తెలిపారు. తమ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ వంటి సంస్థలతో పాటు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ కూడా దేశ ఆర్థిక వ్యవస్థపై విశ్వాసాన్ని వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తమ ప్రభుత్వ విధానాలతో దేశంలోకి 263 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గత నాలుగేండ్లలో వచ్చాయనీ, గత 18 ఏండ్లలో వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలలో ఇవి దాదాపు 45 శాతంగా ఉన్నాయని అన్నారు. దేశంలో అనేక రంగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుకూలంగా నిర్ణయాలను తీసుకున్నామనీ, దీంతో దేశ వృద్ధి రేటు గాడిలో పడిందని చెప్పారు.

తొలిరోజు రూ.56 వేల కోట్ల ఒప్పందాలు

గుజరాత్‌కు పెట్టుబడులు వరదలా వస్తున్నాయి. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో తొలిరోజు రూ.56 వేల కోట్ల విలువైన 130 ఒప్పందాలు జరిగాయని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వీటిలో దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయి.

మూడేండ్లలో రూ.15 వేల కోట్లు: ఆదిత్యా బిర్లా

గుజరాత్‌లో వ్యాపారాన్ని విస్తరించడానికి వచ్చే మూడేండ్లకాలంలో రూ.15 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టవచ్చునని ఆదిత్యా బిర్లా గ్రూపు చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. ప్రస్తుతం ఉన్న యూనిట్ల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు నూతన యూనిట్లను నెలకొల్పడానికి ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. వీటిలో అత్యధికంగా టెక్స్‌టైల్స్, కెమికల్స్, గనులు, ఖనిజాల అన్వేషణకు వినియోగించనున్నది. ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.30 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టగా, భవిష్యత్తులో మరో రూ.15 వేల కోట్లను ఇన్వెస్ట్ చేసే ఆలోచనలో సంస్థ ఉందన్నారు. ప్రస్తుతం కంపెనీకి ఉన్న 15 ఉత్పత్తి కేంద్రాల ద్వారా 26 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

టోరెంట్ గ్రూపు రూ.10 వేల కోట్లు

టోరెంట్ ఫార్మా కూడా గుజరాత్‌లో పది వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టబోతున్నది. ఈ విషయాన్ని కంపెనీ చైర్మన్ సుధీర్ మెహతా వెల్లడించారు. ఇప్పటికే రూ.30 వేల కోట్లను విద్యుత్, ఫార్మాస్యూటికల్స్ రంగంలో పెట్టుబడి పెట్టిన సంస్థ..మరో రూ.10 వేల కోట్లను పునరుత్పాదక విద్యుత్, ఇంధనం, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విభాగాల్లో ఇన్వెస్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థ 3,152 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది.

పదేండ్లలో రూ.3 లక్షల కోట్లు

రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ

వచ్చే పదేండ్లకాలంలో గుజరాత్‌లో రూ.3 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు భారత కుబేరుడైన రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఈ నిధులను ఇంధనం, పెట్రోకెమికల్స్, నూతన టెక్నాలజీ, డిజిటల్ వ్యాపారాలను మరింత బలోపేతం చేయడానికి వినియోగించనున్నట్లు వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో చెప్పారు. ప్రపంచంలో అతిపెద్ద చమురు రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ యూనిట్‌ను గుజరాత్‌లోని జామ్‌నగర్ వద్ద ఏర్పాటు చేసింది. ఇప్పటికే రూ.3 లక్షల కోట్ల మేర పెట్టుబడులతో సుమారు పది లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు, వచ్చే పదేండ్లకాలంలో వీటిని రెట్టింపు చేయడానికి కృషి చేయనున్నట్లు ప్రకటించారు. టెలికం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన జియో..5జీ సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కాగా, రిలయన్స్ ఫౌండేషన్ కింద రూ.150 కోట్లను పండిత్ దీన్‌దయాల్ యూనివర్సిటీకోసం ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు భారతీయులకు సంబంధించిన వివరాలపై విదేశీ సంస్థల గుత్తాధిపత్యం అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రధానికి సూచించారు.

ఐదేండ్లలో రూ.55 వేల కోట్లు

అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ

అదానీ గ్రూపు కూడా గుజరాత్‌లో భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమైంది. వచ్చే ఐదేండ్లకాలంలో రూ.55 వేల కోట్ల నిధులతో ప్రపంచంలో అతిపెద్ద సోలార్ పార్క్, కాపర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ముంద్ర రేవును నిర్వహిస్తున్న కంపెనీ..జర్మనీకి చెందిన కెమికల్ దిగ్గజం బీఏఎస్‌ఎఫ్‌తో కలిసి రూ.16 వేల కోట్లతో పెట్రో కెమికల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే ముంద్రా వద్ద గిగావాట్ల డాటా సెంటర్‌ను ఏర్పాటు చేసే ఆలోచన కూడా సంస్థకు ఉందన్నారు. తద్వారా 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసల జల్లు కురిపించిన ఆయన..ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంజిన్‌గా మారిందన్నారు. ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవడం, ద్రవ్యలోటును కట్టడి చేయడం, జీఎస్టీ అమలులోకి తేవడం, దివాలా చట్టం, అభివృద్ధి చెందుతున్న దేశాలతో సఖ్యతగా మెలుగడం భారత్‌కు లాభం చేకూరుస్తుందన్నారు. దీంతో సులభతర వాణిజ్య విధానంలో భారత ర్యాంక్ 53 పాయింట్లు ఎగబాకింది.

లిథియం బ్యాటరీ ప్లాంట్ ఇక్కడే: టాటా

గుజరాత్‌లో లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. టాటా కెమికల్స్, టాటా మోటార్స్‌లు ఇప్పటికే రాష్ట్రంలో కీలకపాత్ర పోషిస్తున్న సంస్థలు..భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని చెప్పారు. సనంద్ వద్ద ఏర్పాటు చేసిన ప్లాంట్లోనే టిగోర్ ఎలక్ట్రిక్ కారును తయారు చేస్తున్నట్లు ప్రకటించిన ఆయన..వీటితోపాటు టియాగో, కాంపాక్ట్ సెడాన్ టిగోర్, నానోలు కూడా ఇక్కడే రూపొందుతున్నాయి. టాటా గ్రూపునకు వచ్చిన మొత్తం ఆదాయంలో గుజరాత్ చాలా కీలకమని, గతేడాది రూ.18 వేల కోట్లు సమకూరిందన్నారు.

వచ్చే ఏడాది మూడో ప్లాంట్ సిద్ధం: సుజుకీ

గుజరాత్‌లో తాము ఏర్పాటు చేసిన మూడో ప్లాంట్ వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్నట్లు జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రకటించింది. వీటితోపాటు నూతన హైబ్రిడ్ వాహనాన్ని కూడా విడుదల చేయనున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ తెలిపారు. 2017లో గుజరాత్‌లో తొలి అసెంబ్లింగ్ ప్లాంట్‌ను ప్రారంభించిన సంస్థ.. గతేడాది రెండో యూనిట్‌ను, వచ్చే ఏడాది మూడో యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు అహ్మదాబాద్‌లో జరుగుతున్న వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిటల్‌లో చెప్పారు. ఈ మూడు ప్లాంట్లు అందుబాటులోకి వస్తే కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం 7.50 లక్షలకు చేరుకోనున్నదన్నారు. దీంతోపాటు ఇక్కడే ఇంజిన్, ట్రాన్స్‌మిషన్ ప్లాంట్‌ను నెలకొల్పే ఉద్దేశంలో సంస్థ ఉందని చెప్పారు. ఇప్పటికే మారుతి 50 ఎలక్ట్రిక్ వాహనాలను దేశీయ రోడ్లపై పరుగులు పెడుతున్నాయి.

వరంగల్‌లో ఫిన్‌కేర్ శాఖ

■ రాష్ట్రంలో మరో నాలుగు బ్రాంచ్‌ల ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 18: ఏడాది క్రితం చిన్న ఫైనాన్స్ బ్యాంక్(ఎస్‌ఎఫ్‌బీ) సేవలను ఆరంభించిన ఫిన్‌కేర్ రాష్ట్ర మార్కెట్లోకి అడుగు పెట్టింది. తన తొలి శాఖను హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో బ్యాంక్ ఎండీ, సీఈవో రాజీవ్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..వ్యాపార విస్తరణలో భాగంగా రాష్ట్రంలో మరో నాలుగు శాఖలను ఈ మార్చి నాటికి ప్రారంభించనున్నట్లు చెప్పారు. వీటిలో వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్‌లలో ఒక్కో శాఖను ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.3,500 కోట్ల రుణ వితరణ, రూ.2,500 కోట్ల డిపాజిట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్(ఏయూఎం) ఆస్తులను రూ.10 వేల కోట్లకు పైగా పెంచుకోవాలని చూస్తున్న సంస్థ..వచ్చే ఏడాది కాలంలో రూ.250-300 కోట్ల నిధులను సేకరించే ఆలోచనలో ఉన్నట్లు ఆయన చెప్పారు. 14 లక్షల మంది వినియోగదారులను కలిగివున్న సంస్థ ఈ సంఖ్యను 40 లక్షలకు పెంచుకోవడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. ద్విచక్ర వాహనాలకు, చౌక ధర కలిగిన గృహాలకు రుణాలు ఇచ్చే పథకాలను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 9.5 శాతం వడ్డీని, పొదుపు ఖాతాలపై 7 శాతం వడ్డీని చెల్లిస్తున్నది.



ఎంపీ మనోజ్‌తీవారి, నటీ పూనమ్ దిల్లాన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఈసీఐఎల్ జనరల్ మేనేజర్ డిఫెన్స్ సిద్దార్థ్ మిశ్రా

ఈసీఐఎల్‌కు పీఎస్‌యూ అవార్డు

చర్లపల్లి, జనవరి 18: ప్రపంచ దేశాలకు ధీటుగా ఎలక్ట్రానిక్స్ రంగంలో విశిష్ఠ సేవలు అందిస్తున్న ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) సంస్థకు పీఎస్‌యూ అవార్డు వరించింది. దేశ వ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ, సంస్థల పరిశోధనలు, పరికరాలు, ఉత్పత్తి, సేవలు, ఎలక్ట్రానిక్స్ రంగంలో విప్లవాత్మకంగా మార్పులు తీసుకువచ్చి నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేయడంతో ప్రతిష్ఠాత్మకమైన పీఎస్‌యూ ఆవార్డును ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మనోజ్‌తీవారి, నటీ పూనమ్ దిల్లాన్ చేతుల మీదుగా ఈసీఐఎల్ జనరల్ మేనేజర్ డిఫెన్స్ సిద్దార్థ్ మిశ్రా రిటైర్డ్, ఈసీఐఎల్ నార్త్ జనరల్ మేనేజర్ కేఎస్ దాలాల్‌లు అందుకున్నారు.

విప్రో 1:3 బోనస్

■ క్యూ3లో రూ.2,544 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 18: ప్రముఖ ఐటీ సేవల సంస్థల్లో ఒకటైన విప్రో విశ్లేషకుల అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.2,544 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.1,930.1 కోట్ల లాభంతో పోలిస్తే 31.8 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.17 శాతం పెరిగి రూ.15,059.5 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇది రూ.13,669 కోట్లుగా ఉన్నది. కంపెనీ మరోమారు బోనస్ షేరును ప్రకటించింది. రెండేండ్ల క్రితం ఒక్కటికి ఒక్కో షేరును కేటాయించిన సంస్థ..ఈసారి మాత్రం మూడింటికి ఒక్కో షేరును వాటాదారులకు పంచుతున్నది. క్లయింట్లతో ఉన్న సత్సంబంధాలు, టెక్నాలజీ రంగంలో వస్తున్న పెను మార్పులకు తగ్గట్టుగా క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడం ఇందుకు కలిసొచ్చిందని, మొత్తంమీద గడిచిన త్రైమాసికంలో అన్ని రంగాల్లో మెరుగైన వృద్ధి సాధించినట్లు విప్రో సీఈవో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి జెడ్ నీముచ్‌వాలా తెలిపారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో ఐటీ సర్వీసుల ద్వారా 2,046.5 మిలియన్ డాలర్లు(రూ.14,555 కోట్లు) లభించాయి. రెండో త్రైమాసికంలో వచ్చినదాంతో పోలిస్తే 1.8 శాతం పెరిగింది. ప్రస్తుత త్రైమాసికంలో ఈ విభాగం నుంచి 2,047 నుంచి 2,088 మిలియన్ డాలర్ల మధ్యలో ఆదాయం రావచ్చునని సంస్థ అంచనావేస్తున్నది. బోనస్ ఈక్విటీ షేరుకు సంబంధించి రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి మూడు షేర్లకుగాను అదనంగా ఇంతే విలువైన షేరును వాటాదారులకు కేటాయించనున్నట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. దీంతోపాటు రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1 లేదా 50 శాతం మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది. ఈ డివిడెండ్‌ను ఈ నెల 30న వాటాదారులకు చెల్లించనున్నది. ఏప్రిల్ 2017లో సంస్థ 1:1 బోనస్ షేరును ప్రకటించిన విషయం తెలిసిందే. డిసెంబర్ చివరి నాటికి సంస్థ వద్ద రూ.46,847 కోట్ల నగదు నిల్వలు ఉండటంతో వీటిని వాటాదారులకు పంచడం కానీ, ఇతర సంస్థల్లో పెట్టుబడి పెట్టేయోచనలో ఉన్నది. సంస్థలో వాటా మూలధనాన్ని రూ.1,126.5 కోట్ల నుంచి రూ.2,526.5 కోట్లకు పెంచుకోవడానికి అదనంగా 700 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నది.



విప్రో సీఈవో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి జెడ్ నీముచ్‌వాలాతో కంపెనీ ఉన్నతాధికారులు

స్థలయజమానులూ 'రెరా' పరిధిలోకి!

■ ప్రమోటర్లు, కొనుగోలుదారుల మధ్య వివాదాల్ని సామరస్యంగా పరిష్కరించాలి..

■ నిర్మాణం నాణ్యత బాధ్యత డెవలపర్లదే

■ స్పష్టం చేసిన 'మహా' రెరా చైర్మన్ గౌతమ్ ఛటర్జీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'రెవెన్యూ షేరింగ్' ప్రాతిపదికన భూములను అభివృద్ధి చేసేందుకు డెవలపర్లకు ఇచ్చే స్థల యజమానులూ 'రెరా' పరిధిలోకి వస్తారని మహారాష్ట్ర రెరా చైర్మన్ గౌతమ్ ఛటర్జీ స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సీడీఎంఏ ఆడిటోరియంలో తెలంగాణ రెరా అథారిటీ 'మహారాష్ట్రలో రెరా అమలు'పై ప్రత్యేకంగా అవగాహన సదస్సును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన..రెరాకు సంబంధించి తెలంగాణ ప్రమోటర్లలో నెలకొన్న సందేహాల్ని నివృత్తి చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ ఛటర్జీ మాట్లాడుతూ.. కొనుగోలుదారులు, డెవలపర్ల మధ్య నెలకొనే సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించడం మీదే రెరా దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రాజెక్టు అప్పగింత ఆలస్యమైతే ఆ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రెరా ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆతర్వాతే అందులో ఫ్లాట్లు కొన్న వారికి పరిహారం చెల్లించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. రెరా పట్ల ప్రతిఒక్కరిలో అవగాహన పెరుగడానికి మూడు నుంచి నాలుగేండ్లు పడుతుందన్నారు. కొనుగోలుదారుల నుంచి వసూలు చేసే సొమ్మును కేవలం డెవలపరే కాకుండా స్థల యజమాని కూడా ఎస్క్రో ఖాతాలో జమ చేయాలన్నారు. నిర్మాణం నాణ్యత విషయంలో డెవలపరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ, కొనుగోలుదారుడికి సకాలంలో నిర్మాణాన్ని అప్పగించకపోతే, స్థల యజమాని కూడా బాధ్యత వహించాలన్నారు. మహారాష్ట్రలో రెరాను అమలు చేసిన విధానాన్ని ప్రత్యేకంగా వివరిస్తూ, రెరాలో నమోదు అయిన ప్రాజెక్టులపై కొనుగోలుదారుల్లో విశ్వాసం త్వరలో ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నిర్మాణ సంఘాలకు చెందిన పలువురు ప్రతినిధులు అడిగిన సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రెరా చైర్మన్ రాజేశ్వర్ తివారీ, సభ్య కార్యదర్శి విద్యాధర్, జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు ధీటుగా రిలయన్స్ రిటైల్

ముంబై, జనవరి 18: ఇప్పటికే టెలికం రంగంలో సంచలనాలాకు తెర దీసిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇక రిటైల్ రంగంలో తనదైన ముద్ర వేయడానికి ప్రణాళికలు రచిస్తున్నది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు ధీటుగా రిటైల్ రంగాన్ని ఏలేందుకు సిద్ధమవుతున్నది. తొలుత పశ్చిమ భారతదేశంలోని 12 లక్షల మంది రిటైలర్లకు, స్టోర్స్ ఓనర్లకు ఒక షాపింగ్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించనున్నది. జియో టెలికామ్ సేవలు, మొబైల్ పరికరాలు, దేశవ్యాప్తంగా రిటైల్ షోరూంలను కలిగివున్న రిలయన్స్ ప్రపంచంలోనే అతి పెద్ద రిటైలర్లను ఢీకొట్టాలనుకుంటున్నది. గుజరాత్‌లోని 12 లక్షల మంది చిన్న రిటైలర్లు, షాప్‌కీపర్ల కోసం జియో, రిలయన్స్ రిటైల్ త్వరలోనే ఒక వినూత్న ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ను ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించింది. అతి వేగంగా వృద్ధి చెందుతున్న జియోకు ప్రస్తుతం మొత్తం 28 కోట్ల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. దేశవ్యాప్తంగా 6500 నగరాలు, పట్టణాల్లో రిలయన్స్ రిటైల్‌కు పది వేలకు పైగా రిటైల్ షోరూమ్‌లు ఉన్నాయి. జియో యాప్ ద్వారా చిన్న రిటైలర్లందరినీ సంఘటితం చేయనున్నట్టు రిలయన్స్ రిటైల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వీ సుబ్రమణ్యం తెలిపారు. ఇటీవల రిటైల్ రంగానికి సంబంధించి తీసుకువచ్చిన కొత్త నిబంధనలతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు ప్రతికూలంగా ఉన్నాయి. దేశీయ కంపెనీలకు మేలు చేసేవిగా ఉండడంతో రిలయన్స్ రిటైల్‌కు కలిసొచ్చే అవకాశం ఉన్నది. ఈ కామర్స్ ప్రణాళికలను త్వరలోనే ఒక్కటొక్కటిగా ముకేశ్ అంబానీ వెల్లడిస్తారని తెలిపారు.



బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి సరికొత్త ప్లాన్

హైదరాబాద్, జనవరి 18: ప్రభుత్వరంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ మరో సరికొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రీ-పెయిడ్ మొబైల్ వినియోగదారులకోసం రూ.899 ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలంగాణ టెలికం సర్కిల్ సీజీఎం వీ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి మూడు నెలలపాటు అమలులో ఉండనున్న ఈ ప్లాన్ కాలపరిమితి 180 రోజులుగా నిర్ణయించింది. ఈ ప్లాన్ కింద అన్ లిమిటెడ్ లోకల్, ఎస్టీడీ, రోమింగ్ కాల్స్, రోజుకు 1.5 జీబీల డాటా, 50 ఎస్‌ఎంఎస్‌లు ఆఫర్ చేస్తున్నది.



పండుగ సీజన్ సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో గెలుపొందిన వారికి బుల్లెట్ బైకును అందిస్తున్న రెడ్ చీఫ్ కంపెనీ ఉన్నతాధికారి



ఢిల్లీని మళ్లీ కప్పేసిన పొగమంచు

450 విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

న్యూఢిల్లీ, జనవరి 18: పొగమంచు ఢిల్లీని మళ్లీ కప్పేసింది. ప్రధానంగా ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు ఉండటంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం ఐదున్నర నుంచి మధ్యాహ్నం 1 వరకు కూడా పొగమంచు తగ్గకపోవడంతో దాదాపు 450 విమానాల రాకపోకలపై ప్రభావం పడింది. అధికార వర్గాలు మాట్లాడుతూ పొగమంచు వల్ల కొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయని, కొన్ని సర్వీసులను రద్దు చేశామని తెలిపాయి. మరి కొన్ని విమానాలను దారి మళ్లించామని పేర్కొన్నాయి. జెట్ ఎయిర్‌వేస్ ట్వీట్ చేస్తూ బెంగళూరులోనూ పొగమంచు వల్ల తమ విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నాయి.

ట్రంప్ సలహా మండలిలోకి భారతీయ అమెరికన్


ప్రేమ్ పరమేశ్వరన్

వాషింగ్టన్, జనవరి 18: అధ్యక్ష సలహా కమిటీలోకి భారత్-అమెరికా సంతతికి చెందిన ఆర్థికవేత్త ప్రేమ్ పరమేశ్వరన్ (50)ను నియమించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆసియాన్ అమెరికన్లు, పసిఫిక్ ద్వీపకల్ప వాసుల స్థితిగతులపై ఈ కమిటీ పని చేస్తుంది. ట్రంప్ నియమించనున్న ఈ కమిటీలోని 12 మంది సభ్యుల్లో పరమేశ్వరన్ ఒక్కరే భారత్-అమెరికా సంతతికి చెందిన వారు. న్యూయార్క్‌లో జీవిస్తున్న పరమేశ్వరన్ ప్రస్తుతం ఎరోస్ ఇంటర్నేషనల్ సంస్థ నార్త్ అమెరికా ఆపరేషన్స్ అధ్యక్షుడిగా, సంస్థ గ్రూపు చీఫ్ ఫైనాన్సియల్ అధికారి (సీఎఫ్ఓ)గా ఉన్నారు. ఇక వైట్‌హౌస్ ఇన్షియేటివ్ ఆన్ ఆసియాన్ అమెరికన్స్ అండ్ పసిఫిక్ ఐలాండర్స్ కమిటీ సహ అధ్యక్షులుగా ఎలైనె ఎల్ చావోను నియమించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

హిమపాతానికి 10 మంది బలి!

- కశ్మీర్‌లో దుర్ఘటన

శ్రీనగర్, జనవరి 18: జమ్ముకశ్మీర్‌లో భారీ హిమపాతానికి 10 మంది బలయ్యారు. శుక్రవారం రెండు ట్రక్కుల్లో లడక్ రీజియన్‌లోని ఖర్దుగ్లా ప్రాంతం మీదుగా వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఒక్కసారిగా హిమపాతం ట్రక్కులను కప్పేయడంతో 10 మంది సమాధి అయ్యారు. విషయం తెలిసిన వెంటనే సహాయక చర్యలుచేపట్టిన సైనికులు ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. మిగిలిన ఐదుగురు కూడా మరణించి ఉంటారని ప్రకటించారు. వారి మృతదేహాల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. అధికార వర్గాలు మాట్లాడుతూ భారీగా హిమపాతం ట్రక్కులపై పడిపోవడంతో అవి దాదాపు 20 అడుగుల లోతులో కూరుకుపోయాయని తెలిపాయి. కాగా, జమ్ముకశ్మీర్‌లో హిమాపాతం కురవడం, కొండచరియలు విరిగిపడటం సర్వసాధారణంగా మారింది. గతేడాది కుప్వారాలో హిమపాతం వల్ల 11 మంది మరణించారు. 2017లో జరిగిన హిమపాతం మూడు దుర్ఘటనల వల్ల 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే 2012లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భారీ హిమపాతం వల్ల 140 మంది మృతిచెందారు. మృతుల్లో 129 మంది పాకిస్థాన్ సైనికులు ఉన్నారు.


మృతదేహాన్ని తరలిస్తున్న సహాయక సిబ్బంది

అమెరికా నూతన 'క్షిపణి' విధానం

- రష్యా, చైనాకు చెక్ పెట్టడమే లక్ష్యం

వాషింగ్టన్, జనవరి 18: రక్షణపరంగా రష్యా, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అమెరికా నూతన క్షిపణి రక్షక విధానాన్ని ప్రకటించింది. చైనా, రష్యా అత్యాధునిక క్రూయిజ్ క్షిపణులను, సూపర్‌సోనిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నాయని, ప్రస్తుత రక్షణ వ్యవస్థలకు ఇవి సవాళ్లు విసురుతున్నాయని గురువారం విడుదల చేసిన 'మిస్సైల్ డిఫెన్సివ్ రివ్యూ' నివేదికలో అమెరికా రక్షణ వ్యవహారాల కేంద్రం పెంటగాన్ అభిప్రాయపడింది. దీంతో తమ క్షిపణి రక్షక వ్యవస్థ, వ్యూహం, సామర్థ్యాలను తప్పక సమీక్షించుకోవాల్సి ఉందని పేర్కొంది. 'రష్యా, చైనా భిన్న సవాళ్లను విసురుతున్నాయి. రెండు దేశాలూ అఫెన్సివ్ మిస్సైల్ వ్యవస్థలను బలోపేతం చేసుకుంటున్నాయి. సముద్రం, భూ ఉపరితలం ఉంచి ప్రయోగించగల అధునాతన క్రూయిజ్ క్షిపణులను పెంచుకుంటున్నాయి' అని రక్షణ శాఖ తాత్కాలిక కార్యదర్శి పాట్రిక్ సనాహన్ తెలిపారు. క్షిపణి దాడులను నిరోధించేందుకు, ప్రయోగించడానికంటే ముందే వాటిని ధ్వంసం చేసేలా సమగ్ర క్షిపణి రక్షక విధానాన్ని నివేదికలో పొందుపరిచారు. శత్రు దాడుల నుంచి దేశాన్ని, మిత్ర పక్షాలను రక్షించడంలో ఈ సమగ్ర విధానం దోహదపడుతుందని పాట్రిక్ వెల్లడించారు.

లైంగిక వేధింపులకు గురయ్యానని
కొన్నేండ్లకు తెలిసింది

బాలీవుడ్ నటి స్వర భాస్కర్



న్యూఢిల్లీ, జనవరి 18: ఓ దర్శకుడు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, ఈ విషయం గుర్తించేందుకు తనకు ఆరు నుంచి ఎనిమిదేండ్లు పట్టిందని బాలీవుడ్ నటి స్వర భాస్కర్ తెలిపారు. లైంగిక వేధింపుల గురించి మహిళలకు బోధించని మన సంస్కృతే ఇందుకు కారణమని చెప్పారు. హార్వే విన్‌స్టీన్ జీవితంపై నిర్వహించిన ఓ చర్చా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇలాంటి చర్చా కార్యక్రమాల్లో ఇతర మహిళల అనుభవాలను విని, తాను కూడా లైంగిక వేధింపులకు గురైనట్లు గుర్తించానని చెప్పారు. దేశంలో లైంగిక వేధింపుల పట్ల మౌనం వహించే సంస్కృతి ఉందని, మన దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోనూ వీటిని సరిగా గుర్తించడం లేదన్నారు. దీన్ని కేవలం అసౌకర్యంగా మాత్రమే భావించే పరిస్థితి ఉందన్నారు.

'గగన్‌యాన్'
వ్యోమగాములుగా పైలట్లు!

విమానయానంలో అనుభవమున్న వారి కోసం ఇస్రో అన్వేషణ



న్యూఢిల్లీ, జనవరి 18: గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2021 డిసెంబర్ నాటికి ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపాలని సంకల్పించిన విషయం తెలిసిందే. అయితే ఈ ముగ్గురు వ్యోమగాములు పైలట్లు అయి ఉండే అవకాశం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తాజాగా సంకేతాలిచ్చారు. 'వ్యోమగాములుగా విమానయానంలో తగిన అనుభవం ఉన్న వారి కోసం అన్వేషిస్తున్నాం' అని ఇస్రో శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. వ్యోమగాముల ఎంపికలో భారత వాయుసేన, ఇతర సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయని ఇస్రో చైర్మన్ కే శివన్ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) కూడా కీలక భూమిక షోషించనుందని మరో శాస్త్రవేత్త తెలిపారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా 2020 డిసెంబర్‌లో తొలి మానవ రహిత యాత్ర, 2021 జూలైలో రెండో మానవ రహిత యాత్ర చేపట్టి, 2021 డిసెంబర్‌లో మానవ సహిత యాత్ర చేపట్టనున్నట్లు కే శివన్ శుక్రవారం ఇక్కడ విలేకరులకు వెల్లడించారు.

24న కలాంశాట్ ప్రయోగం..

'యంగ్ సైంటిస్ట్' పేరుతో ఇస్రో త్వరలో నూతన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు శివన్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ఆధారంగా ముగ్గురిని (8,9 తరగతుల విద్యార్థులు) ఎంపిక చేసి, ఇస్రో కేంద్రాల్లో నెల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకయ్యే ఖర్చును విద్యార్థులే భరించాల్సి ఉంటుందన్నారు. చిన్న ఉపగ్రహాలు తయారు చేసేందుకు వారికి అనుమతిస్తామని, నాణ్యంగా ఉన్న వాటిని ప్రయోగిస్తామని వెల్లడించారు. మొట్టమొదటిసారిగా విద్యార్థులు రూపొందించిన శాటిలైట్‌ను ఇస్రో ప్రయోగించనుందని, చెన్నైకి చెందిన విద్యార్థులు రూపొందించిన 'కలాంశాట్' ఉపగ్రహాన్ని ఈ నెల 24న పీఎస్ఎల్వీ సీ44 రాకెట్ ద్వారా ప్రయోగిస్తామని తెలిపారు. పీఎస్ఎల్వీ సీ44 కేవలం రాకెట్ మాత్రమే కాదని, ఈ రాకెట్ చివరి దశను అంతరిక్ష పరిశోధనలకు పునర్వియోగించుకోవచ్చని శివన్ తెలిపారు.

ఈబీసీ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన డీఎంకే

చెన్నై: విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గా (ఈబీసీ)లకు కేంద్రం 10 శాతం రిజర్వేషన్లు ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ డీఎంకే పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. కేంద్రం నిర్ణయం రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి వ్యతిరేకమన్నది. అగ్ర కుల పేదలకు రిజర్వేషన్ల కల్పన రాజ్యాంగ విరుద్ధమన్నది. డీఎంకే ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్ఎస్ భారతి శుక్రవారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. 'రిజర్వేషన్ల ఉద్దేశం కేవలం పేదరిక నిర్మూలన ఒక్కటే కాదు. దశాబ్దాలుగా విద్య, ఉద్యోగాలకు నోచుకోకుండా, అభివృద్ధికి దూరంగా, అణచివేతకు గురైన అట్టడుగు వర్గాలకు చేయూతనందించేందుకే రిజర్వేషన్లు. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారు? రాజ్యాంగంలో సామాజిక రిజర్వేషన్లు అన్నారే తప్ప.. ఎక్కడా ఆర్థికపరమైన ప్రస్తావన లేదు. తరాలుగా సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారికి రిజర్వేషన్ల అవసరం ఏమిటి?' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితుల్లోనే 69 % రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుత ఈబీసీ బిల్లుతో ఇది 79 శాతానికి చేరుకుంటుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈబీసీ బిల్లు అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఈ నెల 21న పిటిషన్ విచారణకు రానున్నది.

ఈబీసీ కోటాకు యూపీ పచ్చజెండా

విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గా (ఈబీసీ)లకు రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో కోటా బిల్లుకు ఏకాభిప్రాయంతో మద్దతు తెలిపారు. జనవరి 14 నుంచే రాష్ట్రంలో ఈబీసీ కోటా అమలవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. గుజరాత్, జార్ఖండ్ తర్వాత ఈబీసీ రిజర్వేషన్లను ఆమోదించిన మూడో రాష్ట్రంగా యూపీ నిలిచింది.

కృత్రిమ ఉల్కాపాతం!

- వచ్చే ఏడాది హిరోషిమాలో ఆవిష్కృతం
- ఉపగ్రహాన్ని నింగిలోకి పంపిన జపాన్ శాస్త్రవేత్తలు

టోక్యో, జనవరి 18: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా కృత్రిమ ఉల్కాపాతాన్ని సృష్టించేందుకు జపాన్ శాస్త్రవేత్తలు శుక్రవారం ఓ రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించారు. టోక్యో కేంద్రంగా పనిచేస్తున్న ఓ స్టార్టప్ కంపెనీ ఈ మినీ శాటిలైట్‌ను రూపొందించింది. యూచినౌరా అంతరిక్ష కేంద్రం నుంచి ఎప్సిలాన్-4 రాకెట్ ద్వారా జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ శుక్రవారం ఉదయం ఈ ఉపగ్రహంతోపాటు మరో ఆరు చిన్న ఉపగ్రహాలను విజయవంతంగా నింగిలోకి పంపింది. వచ్చే ఏడాది ప్రారంభంలో హిరోషిమాలో కృత్రిమ ఉల్కాపాత ప్రదర్శనను ఆవిష్కరించనున్నారు. ఉపగ్రహంలోని చిన్న చిన్న గోళాలను కిందకు వదలడం ద్వారా అవి కొన్ని సెకండ్లపాటు ప్రకాశవంతంగా మెరిసేలా చేయనున్నారు. ఇది కృత్రిమ ఉల్కాపాతాన్ని తలపించనున్నది. మినీ ఉపగ్రహం ద్వారా 400 చిన్న గోళాలను నింగిలోకి పంపారు. 20-30 'షో'లకు ఇవి సరిపోతాయని శాటిలైట్‌ను రూపొందించిన ఏఎల్‌ఈ కంపెనీ లిమిటెడ్ తెలిపింది.


నింగిలోకి దూసుకెళ్తున్న రాకెట్

రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన ఎలిజబెత్ రాణి భర్త

లండన్: బ్రిటన్ మహారాణి ఎలిజబెత్-2 భర్త ప్రిన్స్ ఫిలిప్ రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. నూరేండ్లకు చేరువలో ఉన్న ప్రిన్స్ ఫిలిప్ నడుపుకుంటూ వెళుతున్న లాండ్ రోవర్ కారును ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటన గురువారం మహారాణి శాండ్రింఘామ్ ఎస్టేట్‌కు సమీపంలో జరిగింది. కారు నడుపుతున్న ప్రిన్స్ ఫిలిప్ అకస్మాత్తుగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో షాకయ్యారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ప్రమాదానికి గురైన కారు నుంచి ఆయనను బయటకు తీసిన పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం దవాఖానకు తరలించారు. ఆయనకు ఎటువంటి గాయాలు కాలేదని వైద్యులు తెలిపారు.


అంతర్జాతీయ మిల్లెట్ ట్రేడ్‌ఫెయిర్‌లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టాల్

అంతర్జాతీయ మిల్లెట్ ట్రేడ్‌ఫెయిర్‌లో
తెలంగాణ ప్రభుత్వ స్టాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సేంద్రియ, తృణధాన్యాల సాగు, మార్కెటింగ్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్‌లో మూడురోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ మిల్లెట్ ట్రేడ్‌ఫెయిర్ శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో తెలంగాణ వ్యవసాయశాఖ, విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర రైతులు పండిస్తున్న తృణధాన్యాలు, సేంద్రియ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటుచేసినట్టు సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు తెలిపారు.

తెలంగాణ ఉనికి విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం

- అన్నిదేశాల రచయితలతో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్
- హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 25 నుంచి నిర్వహణ
- సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యమస్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఉనికిని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా సంస్కృతి, సాహిత్యం, కళలపై ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నామని సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సాహిత్య రంగంలో అన్నిదేశాల ప్రతినిధులతో ఈ నెల 25 నుంచి 27 వరకు బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ (హెచ్‌ఎల్‌ఎఫ్) నిర్వహించనున్నట్టు చెప్పారు. శుక్రవారం సచివాలయంలోని డీబ్లాక్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రపంచదేశాలను ఆకర్షించేలా బతుకమ్మ పండుగ, సంక్రాంతి కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించామని తెలిపారు. లిటరరీ ఫెస్టివల్‌లో అంతర్జాతీయ సాహిత్య ప్రత్యేకతను చాటేలా చైనా సాహిత్యంపై చర్చగోష్ఠులు ఉంటాయన్నారు. దేశ భాషల ప్రాముఖ్యం తెలిపేలా గుజరాతీ భాషపై ప్రత్యేక సదస్సు ఉంటుందని చెప్పారు. దేశంలోని అన్ని భాషల సాహిత్యం, పద్యాలు, ఇతర సాహిత్య ప్రక్రియలపై మూడురోజులు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

తెలంగాణ అర్చకసమాఖ్య డైరీ ఆవిష్కరణ

టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చేతులమీదుగా తెలంగాణ అర్చక సమాఖ్య 2019 డైరీని శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేటీఆర్‌తోపాటు తెలంగాణ అర్చకసమాఖ్య ప్రతినిధులు గంగుల ఉపేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలో హైదరాబాద్ లిటరసీ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర టూరిజం కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటుచేయాలి

- కేంద్రాన్ని కోరిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాతయాదవ్


కేంద్రసాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ అజయ్‌తిర్కీకి వినతిపత్రం ఇస్తున్న రాగం సుజాత యాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను ఏర్పాటు చేసి వాటి నిర్వహణను రాష్ట్ర సాంఘిక సంక్షేమబోర్డుకు అప్పగించాలని బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాతయాదవ్ కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్రప్రభుత్వ మహిళా సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి, కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఇంచార్జ్ చైర్మన్ అజయ్‌తిర్కీని కలిసి విజ్ఞప్తిచేశారు. నిర్భయ చట్టం కింద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరినట్టు ఆమె తెలిపారు. మహిళలకు ప్రత్యేకించి ఒకేషనల్ ట్రెయినింగ్, అవగాహన కార్యక్రమాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్రంలో పెరిగిన జిల్లాలను దృష్టిలో పెట్టుకుని అదనంగా కుటుంబ సలహా కేంద్రాలను మంజూరుచేయాలని కోరగా.. అజయ్‌తిర్కీ సానుకూలంగా స్పందించినట్టు సుజాత వెల్లడించారు.

జగన్‌పై హత్యాయత్నం కేసు
నిందితుడికి 25 వరకు రిమాండ్

- భద్రత మధ్య రాజమండ్రి జైలుకు శ్రీనివాసరావు తరలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై దాడి చేసిన శ్రీనివాసరావుకు ఎన్ఐఏ కోర్టు ఈ నెల 25 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వారంరోజుల ఎన్ఐఏ కస్టడీ ముగియడంతో అంతకుముందు అధికారులు విజయవాడ ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షలు చేయించారు. తర్వాత అతడిని విజయవాడలోని ఎన్ఐఏ కోర్టులో హాజరుపరిచారు. మీడియాతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలన్న నిందితుడి విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. శ్రీనివాసరావుకు విజయవాడలో భద్రతలేదని అతడి తరపు న్యాయవాది సలీం కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో పటిష్ఠ భద్రత మధ్య నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. దర్యాప్తుకు రాష్ట్ర పోలీసులు, సిట్ అధికారులు సహకరించడం లేదని ఎన్ఐఏ దాఖలుచేసిన మెమోపై వాదనలు 23న వింటామని కోర్టు పేర్కొన్నది. కౌంటర్ దాఖలుచేయాలని సిట్ అధికారులను ఆదేశించింది.

ఆహార లభ్యతలో భారత్ స్వయంసమృద్ధి

- అగ్రివిజన్ ముగింపు సదస్సులో ఐసీఏఆర్ డీజీ త్రిలోచన్ మహాపాత్ర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మన దేశం ఒకప్పుడు ఆహారధాన్యాల్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నుంచి పూర్తి స్వయంసమృద్ధి సాధించిందని భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర చెప్పారు. ఇకనుంచి ఫుడ్ ప్రాసెసింగ్, విలువల జోడింపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా చేయడంపై పరిశోధనలు జరుగాలని సూచించారు. మాదాపూర్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్‌లో సీఐఐ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కార్నెల్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన మూడురోజుల అగ్రివిజన్-2019 సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీఏఆర్ డీజీ మహాపాత్ర మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు, యువత వ్యవసాయంపై మరింత దృష్టిపెట్టేలా పరిశోధనలు జరుపాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. మారుతున్న ఆహారపుటలవాట్లు, పెరిగిపోతున్న పట్టణీకరణ, వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయరంగం కొత్తకొత్త సవాళ్లని ఎదుర్కొంటున్నదన్నారు. రైతుల సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో అధునాతన సాంకేతికత, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిని వినియోగించుకోవాలని సూచించారు.


శుక్రవారం మాదాపూర్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్‌లో జరిగిన అగ్రివిజన్ సదస్సులో పాల్గొన్న భారతీయ వ్యవసాయ పరిశోధనమండలి డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మహాపాత్ర, వీసీ ప్రవీణ్‌రావు తదితరులు

ఉత్తమ పరిశోధనలతో ప్రజాజీవితం మెరుగు

ఉత్తమ పరిశోధన పద్ధతులను ఉపయోగించి ప్రజాజీవితాన్ని మెరుగుపర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర వ్యవసాయ పరిశోధన, విద్యాశాఖ కార్యదర్శి త్రిలోచన్ మహాపాత్ర తెలిపారు. హైదరాబాద్‌లోని జాతీయ మాంస పరిశోధన కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన ఆడిటోరియంను శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్తీ మాంసాన్ని గుర్తించే కిట్లను తయారుచేయాలని శాస్త్రవేత్తలను కోరారు. కార్యక్రమంలో మత్స్య, విజ్ఞానశాస్త్ర విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జాయ్‌కృష్ణ జేనా, ఐసీఆర్‌ఆర్ అశోక్‌కుమార్, వైద్యనాథన్, ఐఎంసీ కమిటీ సభ్యులు సుభాష్ చందర్‌జీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు.. భరించలేని దుర్గంధం

- వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు.. తప్పుడు మాటలు చెప్పి ప్రజలను ఇంకెంతకాలమూ ఏమార్చలేరని వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు ఎక్కడ ఉంటే అక్కడ భరించలేని దుర్గంధం వస్తుందని వ్యాఖ్యానించారు. ఈ దుర్గంధాన్ని రాష్ట్ర ప్రజలు ఐదేండ్లపాటు భరించారని, ఇక భరించే స్థితిలో లేరని చెప్పారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల హక్కులు సాధించే క్రమంలో కేటీఆర్‌తో జగన్ భేటీ అయితే వక్రభాష్యాలు చెప్తు టీఆర్‌ఎస్, వైసీపీ పొత్తులు పెట్టుకొంటున్నాయంటూ చంద్రబాబు దుష్ప్రచారం ప్రారంభించారని విమర్శించారు. కేసీఆర్, జగన్ పేర్లు చెబితేనే ఆయనకు వణుకుపుడుతున్నదన్నారు. సీఎం కేసీఆర్ చేసిన చండీయాగంలో చంద్రబాబు పాల్గొనలేదా? పరిటాల సునీత ఇంట్లో పెండ్లికి వచ్చిన కేసీఆర్‌కు ఎదురెళ్లి స్వాగతం పలకలేదా? హరికృష్ణ చనిపోయినప్పుడు పరామర్శకు వచ్చిన కేటీఆర్‌తో పొత్తుల గురించి మాట్లాడలేదా? అని ప్రశ్నించారు. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి కేసీఆర్ వస్తే దగ్గరుండి సపర్యలు చేయలేదా? అంటూ ధ్వజమెత్తారు. కేటీఆర్‌తో జగన్ ఫెడరల్ ఫ్రంట్‌పై సమావేశమైతే గద్దలతో పోల్చుతారా? ఇదెక్కడి రాజనీతి అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రాక్టికల్ పరీక్షల్లో డబ్బులు వసూలుచేస్తే చర్యలు

- కాలేజీలకు ఇంటర్‌బోర్డు కార్యదర్శి హెచ్చరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల పేరుతో కొన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలు డబ్బులు వసూలుచేస్తున్నాయని ఫోన్, ఈమెయిల్ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల్లో పాస్‌చేస్తామంటూ వసూలు చేస్తున్న ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 040-246001100 నంబరుకు ఫోన్‌చేసి సహాయ కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజుకు 24 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏప్రిల్‌లో నిర్వహించే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) సెకండియర్ పరీక్షలఫీజు చెల్లింపునకు ఈ నెల 24 వరకు, ఫస్టియర్ ఫీజు ఫిబ్రవరి 1 వరకు గడువు ఇచ్చినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్య రుసుంతో సెకండియర్‌కు 28 వరకు, ఫస్టియర్‌కు ఫిబ్రవరి 7 వరకు అవకాశం ఉందని తెలిపారు. 2015-17 బ్యాచ్ విద్యార్థులు చివరి అవకాశంగా పాతసిలబస్‌తోనే పరీక్షలకు హాజరుకావాల్సి ఉందని స్పష్టంచేశారు.

లంచం తీసుకున్న అధికారికి జైలు శిక్ష

- విధుల్లోంచి ప్రకాశం జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం తొలగింపు
- కరీంనగర్ ఏసీబీ కోర్టు తీర్పుతో ఏపీ సర్కార్ చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రకాశం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ తెనాలి ఆనంద్‌కుమార్‌ను విధుల్లోంచి తొలిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఈ నెల 3న నిర్ణయం తీసుకున్నదని ఏసీబీ డీజీ పూర్ణచందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనంద్‌కుమార్ ఆదిలాబాద్ జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. ఆ సమయంలో 2010, ఆగస్టు 19న ఆదిలాబాద్‌కు చెందిన వ్యాపారి జాదవ్ పవన్‌కుమార్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఆ సమయంలో ఎస్సీ, ఎస్టీ పెట్టుబడిదారుల పథకానికి చేసుకున్న దరఖాస్తును పరిశ్రమలశాఖ కమిషనర్‌కు పంపేందుకు ఆనంద్‌కుమార్ లంచం డిమాండ్‌చేశాడు. దీంతో జాదవ్ పవన్‌కుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో రెడ్‌హ్యాండెడ్‌గా ఆనంద్‌కుమార్ పట్టుబడ్డాడు. నేరం నిరూపణ కావటంతో కరీంనగర్ ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి భాస్కర్‌రావు తీర్పు వెల్లడించారు. ఆనంద్‌కుమార్‌కు రెండేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. శిక్ష ఖరారు కావటంతో ఆనంద్‌కుమార్‌ను ఏపీ ప్రభుత్వం విధుల నుంచి తొలిగించింది.

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 19 జనవరి 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi



అందమైన కనుబొమ్మల కోసం...

అందమైన మొహానికి చక్కని కనుబొమ్మలుంటే మరింత అందం పెరుగుతుంది. మరి అలాంటి కనుబొమ్మల కోసం ఈ సూచనలు పాటించండి.

- కనుబొమ్మలు ఆరోగ్యంగా ఎదగాలంటే ఆలివ్ ఆయిల్ చక్కగా పని చేస్తుంది. అవసరమైతే తేనె కలుపొచ్చు. ఈ ద్రవంతో కనుబొమ్మలకు మర్దన చేయడం వల్ల మంచి ఫలితాలుంటాయి.
- తేమ కలిగి ఉండే వ్యాస్‌లెన్‌ను రాయడం వల్ల మృదువుగాను, ఆకర్షణీయంగానూ తయారవుతాయి.
- కనుబొమ్మలు ఒత్తుగా అయ్యేందుకు ఉల్లిరసం ఉపయోగపడుతుంది. అందులో ఉండే సల్ఫర్ రక్తసరఫరా బాగా అయ్యేందుకు పనిచేస్తుంది. ఈ ఉల్లిరసాన్ని కనుబొమ్మలకు రాసి 40 నిమిషాల తర్వాత కడిగేస్తే చక్కటి ఫలితం కనిపిస్తుంది.
- కలబందను కోసి, మెత్తటి పేస్ట్‌లా చేయాలి. దాన్ని కనుబొమ్మలకు రాస్తే ఫలితం ఉంటుంది.
- తల వెంట్రుకలు పెరగడానికి కొబ్బరి నూనె ఉపయోగపడుతుందని అందరికీ తెలుసు. అదే నూనెను కనుబొమ్మలకు కూడా రాసుకోవచ్చు.

రామప్ప: ఘనమైన శిల్పసంపద



రామప్ప అద్వితీయ, అపూర్వ, అనుపమాన ఏకైక శిల్పకళాసంపద. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచ శిల్పకళా విశ్వవిద్యాలయం. రామప్ప ఏనాడో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందాల్సి ఉండే. ప్రపంచంలోనే ఇంతగొప్ప సజీవ శిల్పకళ ఉన్న మరో గుడిలేదు. గుడి మీదున్న శిల్పాకృతుల ఆధారంగా దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఒక నాట్యశాస్త్రం పుట్టిన దాఖలాలు లేవు ఒక్క రామప్పలో తప్ప. అట్లాగే కాకతీయుల మాదిరి లౌకిక ప్రజాస్వామిక దృక్పథం ఉన్న పాలకులు కూడా లేరంటే అతిశయోక్తికాదని అంటున్నారు ప్రొఫెసర్ చూడామని నందగోపాల్. కొద్దిగా మనసుపెట్టి, త్రికరణశుద్ధితో పనిచేస్తే రామప్ప ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు వచ్చితీరుతుదని అంటున్నారీమే.

📷 గొట్టె వెంకన్న

రామప్ప అద్వితీయ శిల్పసంపద

దేశంలోనే కాదు ప్రపంచంలో అనేక దేవాలయాలున్నాయి. చరిత్ర నుంచి వర్తమానం వరకు ఇక్కడి నుంచి భవిష్యత్‌కు మార్గనిర్దేశం చేసేవి కొన్ని మాత్రమే ఉన్నాయి. అందులో ముందువరుసలో ఉండేది రామప్ప. ఇది కేవలం ఆలయం మాత్రమే కాదు, సజీవశిల్పకళా జీవన చిత్ర ఇతిహాసం. కాకతీయుల కాలం నుంచి పరంపరగా వస్తున్న జీవన విధానానికి కొనసాగింపు రామప్ప దేవాలయం. ప్రపంచంలోనే ఇంత అద్భుతమైన శిల్ప సంపద ఉన్న దేవాలయం మరోటిలేదు. దేవాలయ శిల్పరీతి విభిన్నమైంది. గుడి నిర్మాణం, ఆ నిర్మాణానికి ఉపయుక్తమైన సాంకేతికత, స్తంభాలు, ఆ స్తంభాలపై చెక్కిన శిల్పాలు, మంటపం, శిఖరం, గుడిశిఖరానికి వినియోగించిన తేలికపాటి ఇటుకలు, గులాబీ రంగురాయి, గర్భగృహం, మహామండపం, అంతరాలయం, ముఖఖండం ఇలా ప్రతీ అంశంలోనూ అపురూపమైనది.

నిర్మాణ శౌష్ఠవం

ఇట్లా ప్రతీ అంశంలోనూ రామప్ప ఒక అద్భుత శిల్ప విన్యాసం. ఇంతటి మహా శిల్ప సంపద దేశంలోనే కాదు ప్రపంచంలోనే మరెక్కడా కనిపించదు. దక్షిణ భారతదేశంలో దాదాపు వేయేళ్ల కాలంలో నిర్మాణమైన ఆలయాలపై నేను సమర్పించిన సిద్ధాంత గ్రంథం 'డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఇన్ టెంపుల్ ఆర్కిటెక్చర్'లో దీనిపై సవివరంగా చర్చించాను. రామప్ప ఎందుకు యూనిక్‌గా నిలిచింది? అనేది చూస్తే కాకతీయుల లౌకిక ప్రజాస్వామిక స్ఫూర్తి మహాగొప్పది. అనేక రాజవంశాలు వారి వారి ప్రజల, జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగానే కాకుండా ఆయా రాజ వంశాలు తమను తాము వాటిల్లో ఎక్కువగా రిఫ్లెక్ట్ అయ్యేందుకు ఆ ఆలయాలు లేదా కట్టడాలను అనువుగా వాడుకున్నారు, కానీ కాకతీయులు అట్లా కాదు వాళ్లు కేవలం ప్రజల సంస్కృతిని ప్రతిబింబించే విధంగా నిస్వార్థంగా అనేక నిర్మాణాలు చేపట్టారు. అది కాకతీయుల గొప్పతనం. ప్రజల అభి'మతం'ను గౌరవించిన ఏకైక రాజవంశం కాకతీయులదని చెప్పాలి. ఇక్కడ శైవం, వీరశైవం, వైష్ణవం, జైనీజం, బుద్ధిజం ఇలా అన్ని మతాల ఆచార సంప్రదాయాలను గౌరవించారు. ఆచరించారు. అట్లా చూసినప్పుడు రామప్పలో మనకు శైవం, వీరశైవం రెండూ స్పష్టంగా కనిపిస్తాయి.

ఇట్లా అనేక వైవిధ్యాల మేళవింపుగా మనం రామప్పను పరిశోధనాత్మక కోణంలో చూస్తేకానీ తెలుసుకోలేము. ఇంతటి వైవిధ్యమున్న, అద్వితీయమైన శిల్పసంపద కచ్చితంగా ప్రపంచ వారసత్వ సంపదగా ఏనాడో గుర్తించబడాలి. కానీ ఎందుకో అలా గుర్తింపునకు నోచుకోలేదు. ఉత్తరభారతదేశంలో అనేకం ఉన్నాయి. కానీ దక్షిణభారతదేశంలో కేవలం నాలుగే. రెండు తమిళనాడులో, మరో రెండు కర్నాటకలో. భవిష్యత్‌లో రామప్పకు కూడా ఆ గౌరవం దక్కేలా ప్రయత్నాలు జరగాలి.

యాదాద్రి అపురూపం

పూర్వం నిర్మించిన ఆలయాలకు అక్కడక్కడా వారి వారి మనోభీష్ట, అవసరాల రీత్యా మరమ్మతులు చేయడం సహజం. కానీ తెలంగాణలో అందుకు వైవిధ్యంగా పాలన సాగుతున్నది. యాదాద్రిలో శాస్త్ర, శిల్ప సంప్రదాయాలకు అనుగుణంగా ఇక్కడి ప్రభుత్వం గుడి నిర్మాణం చేయడం చాలా అరుదైన, విశిష్టమైన విషయం. నేను యాదాద్రి నిర్మాణం చూడలేదు కానీ చెప్పగా విన్న. తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా, వారి ఇష్టాయిష్టాలను గౌరవించి యాదాద్రిలో గుడి నిర్మాణం చేపట్టడం గొప్పవిషయం. యాదాద్రి అప్పటికే ఉండవచ్చు కానీ అప్పటికీ ఇప్పటికీ తేడాను, ప్రాకారాలను, మహా ప్రాకారాలను గోపురాలను నిర్మించడం మాత్రం సాహసమనే చెప్పాలి. అంతపెద్ద దైవకార్యానికి పూనుకోవడం అంటే తన ప్రజల సుఖసంతోషాల కోసం పాలకులు వ్యవహరించడం అన్నది అపురూపం. తెలంగాణ సాధించిన స్ఫూర్తి, యాదాద్రి నిర్మాణ స్ఫూర్తితో రాష్ట్రంలోని చారిత్రక, వారసత్వ నిర్మాణాలను భవిష్యత్‌తరాలకు తీసుకెళ్లడంఅన్నది వారికి (ముఖ్యమంత్రి కేసీఆర్‌కు) పెద్ద విషయమీ కాదు. కాకపోతే తనకున్న గైడింగ్‌ఫోర్స్ ఆ మేరకు ఉపకరించాలి.

రామప్పకే సాధ్యం

ప్రపంచంలో అనేక శాస్త్రాలు ప్రత్యేకించి నాట్యశాస్త్రాలున్నాయి. అవన్నీ శాస్త్రం ఆధారంగా రూపొందాయి. ఆ శాస్త్రాల ఆధారంగానే ఆలయాల నిర్మాణాలు జరిగాయి. కానీ రామప్ప మాత్రం అందుకు భిన్నమైంది. కాకతీయ గణపతిదేవ చక్రవర్తికాలంలో గజసైన్యాధ్యక్షుడిగా ఉన్న జయాప సేనాని వెలువరించిన 'నృత్యరత్నావళి' మాత్రం రామప్ప ఆలయమ్మీదున్న శిల్పాల ఆధారంగా దేశీమార్గంలో శాస్త్రాన్ని రూపొందించారు. రామప్పలో ఆరు అంగుళాల నుంచి ఆరు అడుగుల వరకు 300 నాట్యశిల్పాలున్నాయి. నా గురువు ఎంఎ డానీ (ప్రొఫెసర్ ఇన్ అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్, భారతదేశ ఆలయాల మీద దాదాపు 12 సంపుటాలు వెలువరించారు. అందులో రామప్పపై ప్రత్యేకించి ఆయన రాసిన కాకతీయుల శిల్పనిర్మాణ పరిపుష్టి, పరిపక్వతను చాలా ఉన్నతంగా వర్ణించారు. 'కాకతీయుల ఆలయశిల్పం మరే రాజవంశాలకు అంతుపట్టనిది అని చెప్పిన తరువాత నేను అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. హంపీ, కుంభకోణం, దారాసురం, రామప్పలోని శిల్పాలు విభిన్నమైనవి మాత్రమే కాదు అద్వితీయమైనవి కూడా అని నా గురువు చెప్పింది అక్షరాలా నిజమని ఇక్కడికొచ్చి ఉండి అధ్యయనం చేసిన తరువాత తేలింది. కాకతీయుల శిల్పకళా వైభవానికి, ఉన్నతికి రామప్ప, వేయిస్తంభాల గుడి శిల్పరీతులు ప్రపంచంలోనే అరుదుగా ఉన్న శిల్పరీతులు. రామప్పలో నృత్యం, శిల్పం, నిర్మాణసౌష్టవం, ఆ కాలంలో ఉన్న వినియోగించిన నగలు, సంగీతం ఇట్లా ప్రతీ అంశం అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆ మాటకు వస్తే భవిష్యత్ తరాలకు శరపరంపరగా సజీవంగా కొనసాగింపు సంప్రదాయంగా ఉంటుంది. అంతటి మహత్తర శిల్పరీతులు, ఆచార సంస్కృతి ఆదాన ప్రదానాలుగా ప్రవాహం వలె తరం నుంచి తరానికి కొనసాగింపుగా వస్తున్నవి.

దేశీమార్గపు సౌరభం నృత్యరత్నావళి

రామప్ప గుడి నిర్మాణం తరువాత దాదాపు 50 సంవత్సరాలకు జయాప నృత్యరత్నావళి అనే నాట్యశాస్త్రాన్ని రాశారు. ఎనిమిది అధ్యాయాలున్న నృత్యరత్నావళిలో మొదటి నాలుగు అధ్యాయాలు మార్గ నృత్య వివరణాత్మకమైనవి. తక్కిన ఐదు మొదలు ఎనిమిదో అధ్యాయం వరకు దేశీనృత్యరీతులు వివరించారు. నర్తనవివేకం, అంగనిరూపణం మొదలు అన్నీ కూడా స్థానిక మండల లక్షణాలను వివరిస్తాయి. పేరిణి ప్రేక్కణం (ప్రేంకణం), రాసకం, నాట్యరాసకం, దండరాసకం, శివప్రియం, చింతు (చిందు), కంచుకం, భాండికం, ఘటిసణి, చారణం, బహురూపం, కొల్లాటం (కోలాటం) అనే దేశీ నృత్యరీతులున్న ఈ నాట్యశాస్త్రంలో పేర్కొన్న విధంగా ఇప్పటికీ ప్రజల ఆచార సంప్రదాయాల్లో కొనసాగింపుగా ఉండటం అనేది అపురూపం. మరుగునపడిన ఈ మహాకళా సంపదను పునరుజ్జీవనం చేసిన నాట్యాచారుడు నటరాజ రామకృష్ణ. దేశంలో దేశీమార్గ నృత్యరీతిని పెంచి పోషించిన రాజవంశం కాకతీయులదే. అందులో అనుమానం అక్కరలేదు. ఇంతగొప్ప అద్వితీయమైన శిల్ప, నాట్య, జీవకళ దేశంలో మనకు రామప్పలోనే కనిపిస్తుంది. రామప్ప శిల్పకళా విశ్వవిద్యాలయం. ఇంతగొప్ప చరిత్రను, వారసత్వాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాల్సిన అవసరం ఉంది. కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో దాదాపు 4 వేల వరకు మ్యాన్యుమెంట్స్ ఉండొచ్చు. అందులో ఆలయాలుండొచ్చు కానీ రామప్పది మాత్రం అరురూప సజీవ సంస్కృతి. యునెస్కో రామప్పను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు ఇస్తుందని భావిస్తున్నా. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ రామప్ప ప్రాముఖ్యాన్ని ప్రపంచ దృష్టికి తీసుకెళ్లేందుకు కొంతమేర ప్రయత్నం చేస్తున్నది. ఆ ప్రయత్నంలో భాగంగానే నాతో వారు కాఫీ టేబుల్ బుక్ తీయాలన్నారు తప్పకుండా తీస్తానని చెప్పిన.

... నూర శ్రీనివాస్
వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ

ఎవరీ ప్రొఫెసర్ చూడామణి నందగోపాల్?

బెంగళూర్‌లోని జైన్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ హ్యూమానిటీస్, అండ్ సోషల్ సైన్సెస్ డీన్‌గా పనిచేసి ఇటీవలే రిటైరయ్యారు చూడామణి నందగోపాల్. నేషనల్ మ్యూజియం ఆఫ్ ఢిల్లీ అవసరం మేరకు చూడామణి పరిశోధన చేస్తున్నారు. ఇటీవలే దేశంలో ప్రతిష్ఠాత్మక ఠాగూర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డును అందుకున్నారు. అంతేకాదు ప్రస్తుతం యునెస్కో ఫెలోగా పరిశోధనల్లో సహాయం చేస్తున్నారు. దాదాపు వేయేళ్ల కాలంనాటి ఆలయాలమీదున్న శిల్పశాస్త్రం, నాట్యశాస్త్రం మీద ఆమె 'డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఇన్ టెంపుల్ ఆర్కిటెక్చర్' అనే సిద్ధాంత గ్రంథం ప్రచురించారు. దక్షిణభారత దేశంలోని అనేక ఆలయాల మీదున్న శిల్పరీతులపై ఆమె పరిశోధనలు చేశారు. వాటి ఆధారంగా ప్రజల జీవన విధానంపై సుదీర్ఘ వ్యాఖ్యానం చేశారు. అందులో రామప్ప శిల్ప సంపదను, కాకతీయుల శిల్పకళాపోషణ మొదలైన అంశాలను సవివరంగా ప్రస్తావించారు. అందుకోసం అనేక పర్యాయాలు రామప్పకు తన బృందంతో వచ్చి మారుమూల పాలంపేట గ్రామంలో నాలుగైదు రోజులుండీ పరిశోధనలు చేశారు. వరంగల్‌లో 'శాస్త్ర ప్రయోగం-నృత్య రత్నావళి' అనే అంశంపై రెండు రోజుల పాటు (జనవరి



16, 17తేదీల్లో) నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ఆర్ట్స్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

గుండెపోటును గుర్తించేదెలా?



నా వయసు 21 సంవత్సరాలు. నేను మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్నా. రెండు నెలల క్రితం మా నాన్న గుండెపోటుతో మరణించారు. మా తాత కూడా ఇలాగే గుండెపోటు వల్లే చనిపోయారు. ఇద్దరూ ఒకే కారణంతో మరణించడం వల్ల నాకు భయం కలుగుతున్నది. హార్ట్‌ఎటాక్, బీపీ, షుగర్ వంటి వ్యాధులు వంశపారంపర్యంగా వస్తుంటాయంటారు కదా? ఇది నిజమేనా? భవిష్యత్‌లో నాకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఉన్నట్టేనా? ఒకవేళ ఉంటే దీనిని ఎలా గుర్తించాలి? అందుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటో తెలుపగలరు?

- పి. శ్రీలక్ష్మి, నిజామాబాద్

శ్రీలక్ష్మిగారూ.. మీరు మీ సందేహాన్ని తెలియజేయడానికి మీరు అప్రమత్తమవడం అభినందనీయం. కానీ అనవసర భయాందోళనలు మాత్రం ఆపేయండి. గుండెపోటుకు ఈ భయాందోళనలూ కారణమనే విషయం గ్రహించాలి. ఇక విషయానికి వస్తే గుండెపోటుకు చాలా కారణాలు ఉన్నాయి. అందులో వంశపారంపర్యం, జన్యుపరమైన సమస్యలు కూడా కారణం కావచ్చు. కానీ ఇవి మాత్రమే కారణం కాదనే విషయం గుర్తుంచుకోవాలి. సరైన ఆరోగ్యకరమైన జీవనశైలి ఏర్పరచుకోవడం వల్ల మీ గుండెకు సంపూర్ణ రక్షణ ఇవ్వవచ్చు. సాధారణంగా గుండెకు రక్తసరఫరా నిలిచిపోయినప్పుడు గుండెపోటు వస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలైన ధమనుల్లో కొవ్వు తదితర పదార్థాలు పేరుకుపోయి రక్తసరఫరా మార్గం క్రమేపీ మూసుకుపోతుంది. దీనివల్ల రక్త సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా శరీరానికి ఆక్సీజన్‌తో కూడిన రక్తాన్ని అందించడంలో గుండె విఫలం అవుతుంది. రక్తంలో ఎల్‌డీఎల్, హైబ్లడ్ ప్రెజర్, పరిమితికి మించిన చక్కెర శాతం లాంటివి హానికరమైన కొవ్వు పదార్థాలు. ఇవి ప్రమాదకర స్థాయికి చేరితే గుండెపోటు వస్తుంది. కూర్చున్నచోటే ఎక్కువసేపు పనిచేయడం, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం, పొగతాగడం, మద్యం అలవాటు, జంక్‌ఫుడ్ తినడం, మానసిక ఒత్తిడి లాంటి అలవాట్ల వల్ల రక్తనాళాలు మూసుకుపోయి గుండెకు ప్రమాదం జరుగుతుంది. గుండెపోటును ఎలా గుర్తించాలి అన్నారు కదా? పైన తెలిపిన అలవాట్లు మీకు ఉన్నట్లయితే గుండెపోటును ముందస్తుగా గ్రహించవచ్చు. దురలవాట్లకు దూరంగా ఉంటూ డాక్టర్ సూచనలను బట్టి తగిన వ్యవధిలో బీపీ, కొలెస్ట్రాల్‌కు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటే ఎప్పటికప్పుడు మీ గుండె పనితీరును తెలుసుకోవచ్చు.



డాక్టర్ వరదా రాజశేఖర్
సీనియర్ ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్

ప్రకృతి బిడ్డలకు అండగా..

అందమైన పర్వతాలు, విలువైన అటవీ సంపద.. అంతా గిరిజనుల పరిధిలో ఉంది. కానీ వీటిని సరైన మార్గంలో ఎలా ఉపయోగించుకోవాలో తెలియదు. వాళ్ల కోసం ఓ మహిళ ముందుకొచ్చింది. సుమారు 26 యేండ్ల నుంచి వాళ్లకు పని నేర్పి ఉపాధి కల్పిస్తున్నది.



తమిళనాడులోరి ఊటీ, కునూర్ సమీపంలో ఉంది నీలగిరి జీవావరణ రిజర్వాయర్.. అటవీ సంపద, పర్వతాలు, నీరు పుష్కలంగా ఉన్నాయి. అనేక రకాల వృక్షజాతులకు, జంతు జాతులకు నిలయంగానూ ఉంది. ఈ ప్రాంతంలో తడాస్, ఇరుల్లాస్, కురుంబస్, పినియాస్, ఆదియాస్ వంటి గిరిజన తెగల ప్రజలు నివాసం ఉంటున్నారు. అయితే చుట్టు పక్కల ఉన్న సంపదను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం వారికి సరిగ్గా తెలియదు. ఈ పరిస్థితిని గమనించిన సామాజిక కార్యకర్త స్నేహలత నాథ్ వాళ్లకు అండగా నిలిచింది. సంప్రదాయ వృత్తులను కాపాడాలనే లక్ష్యంతో స్నేహలత ఢిల్లీలోని ఓ ఎన్జీవోలో పనిచేసేది. తర్వాత తాము ఢిల్లీకే పరిమితం కావొద్దనే ఆలోచనతో 1993లో 'కీ స్టోన్' ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసింది. దీంతో రిమోట్ ఏరియాల్లోని గిరిజనులకు చేరువైంది. వాళ్ల పరిధిలో ఉన్న సహజ వనరుల గురించి వారికి వివరించి, వాటిని సరైన దిశలో ఉపయోగించడం నేర్పింది. గిరిజనుల్లో కమ్యూనిటీలను ఏర్పాటు చేసి చేతివృత్తులను, సేంద్రియ వ్యవసాయాన్ని, సంస్కృతిని కాపాడడం ఈ సంస్థ ముఖ్య లక్ష్యాలు. దీంతో పాటు పర్వత శ్రేణుల్లో ఉండే గిరిజనులకు టెక్నాలజీ సాయంతో జీవనోపాధి చూపిస్తున్నది. పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతలను పెంపొందించడానికి స్థానికులకు శిక్షణ ఇస్తున్నది. స్వచ్ఛమైన తేనె తీయడం ఇక్కడి గిజరిజనుల ప్రధాన జీవనోపాధి. సంప్రదాయ వృత్తులకు సాంకేతికత, ఆధునికత జోడించడంలో స్నేహలత విజయం సాధించింది. వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల వాడకం పెరిగాక అక్కడి ప్రజల సమస్యలు చాలా వరకూ తగ్గాయి.

జున్నుతో ఎన్నో లాభాలు

- జున్నులో విటమిన్-డి పుష్కలంగా ఉంటుంది. శరీరంలో ఆ విటమిన్ లోపంతో కలిగే ఆస్టియోపోరోసిస్ లోపాలన్నీ దీనితో అధిగమించవచ్చు.
- విరేచనాలు, మలబద్ధకానికి జున్ను విరుగుడులా పని చేస్తుంది. జున్నుతో శరీరంలో రోగనిరోధక శక్తికూడా పెరుగుతుంది.
- సన్నగా ఉన్న వారు క్రమం తప్పకుండా జున్ను తీసుకుంటే శరీరాకృతిలో మార్పులు గమనించవచ్చు. జున్నులోని ప్రొటీన్లు శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. దీంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది.

పన్ను ఆదాకు
ఈఎల్ఎస్ఎస్

జనవరి వచ్చేసింది. పన్నులపై దృష్టి పెట్టాల్సిన సమయమూ ఆసన్నమైంది. పన్నుల ఆదా, మినహాయింపులకున్న అత్యుత్తమ మార్గాలు ఏంటా? అని మదుపరులు, పన్ను చెల్లింపుదారులు అన్వేషిస్తూ ఉంటారు. ఇప్పట్నుంచి ఆరా తీస్తేగానీ పకడ్బంది ప్రణాళికలు తయారు కావుమరి. అందుకే జనవరి-మార్చి త్రైమాసికంలో ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్ (ఈఎల్ఎస్ఎస్) కోసం ఎక్కువ మంది వెతుకుతూ ఉంటారు. వీటి ద్వారా పన్నుల నుంచి మినహాయింపు పొందే అవకాశాలుండటమే ఇందుకు ప్రధాన కారణం. ట్యాక్స్ సేవింగ్ ఫండ్స్ కోసం సాధారణంగా ఈఎల్ఎస్ఎస్‌లనే చాలామంది ఎంచుకుంటారు. ఫలితంగా వీటికి ఆదరణ అమాంతం పెరిగిపోయింది.



ఈఎల్ఎస్ఎస్ అనేవి మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాలు. ఓ ఇండివిడ్యువల్ లేదా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కోసం ఉద్దేశించబడిన ఐటీ చట్టంలోని సెక్షన్ 80(సీ) కింద రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదాకు ఈ పథకాలు అర్హనీయమైనవి. పెట్టుబడులు మొదలైన దగ్గర్నుంచి మూడేండ్ల కాలపరిమితి వరకు పన్ను ప్రోత్సాహకాలను అందుకోవచ్చు. ఇకపోతే జీవిత బీమా ప్రీమియం, ప్రావిడెంట్ ఫండ్ విరాళాలు (ఈపీఎఫ్/పీపీఎఫ్ రెండూ), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ బాండ్లు), కిసాన్ వికాస్ పాత్ర వంటి చిన్నతరహా పొదుపు పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) కూడా పన్ను మినహాయింపులకు అర్హత ఉన్నవే. ఐదేండ్ల కాలపరిమితితో ఇవి ఉండాలి.

ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్/ఈపీఎఫ్) మినహా అన్ని ఇతర పెట్టుబడుల్లో వచ్చే లాభాలపై మెచ్యూరిటీ లేదా ఉపసంహరణ సమయానికి పన్నులుంటాయి. అయినా.. ఈఎల్ఎస్ఎస్ అన్నింటిలోకెల్లా చక్కనిదని చెప్పవచ్చు. ఎందుకంటే దీర్ఘ కాలంలో ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులు ఆకర్షణీయమైన ప్రతిఫలాల్ని అందిస్తాయి. స్టాక్ మార్కెట్ ఆధారిత పెట్టుబడులు కావడంతో ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలుంటాయి. అయినప్పటికీ మిక్కిలి మదుపరులు వీటిని ఎంచుకుంటుండటాన్నిబట్టి ఇవి అందిస్తున్న లాభాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మార్కెట్లు లాభనష్టాల మధ్య ఊగిసలాడినా.. స్థూలంగా లాభాలనే పొందుతాయి. ఒకటి, రెండేండ్లు నష్టపోయినా దీర్ఘకాలంలో లాభిస్తాయి.

ఈఎల్ఎస్ఎస్‌లో భారతీయ మదుపరుల పెట్టుబడుల సరళని ఒక్కసారి పరిశీలిస్తే.. విచిత్ర ధోరణే కనిపిస్తుంది. మొత్తం ఆర్థిక సంవత్సరంలో చివరి త్రైమాసికంలోనే పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలి వస్తాయి. అంటే జనవరి-మార్చి వ్యవధిలో ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులకు భారీ డిమాండ్ ఉంటుందన్నమాట. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలు కానుండటంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పన్ను (ఐటీ) రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఏప్రిల్-డిసెంబర్ వరకు ఆదాయాన్ని లెక్కించుకుని చివరి మూడు నెలల్లో పెట్టుబడులకు దిగుతారు. దాంతో ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులకు జనవరి-మార్చిలో విపరీతమైన డిమాండ్ ఉంటున్నది.

భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (ఏఎంఎఫ్ఐ) వివరాల ప్రకారం ఏడాది మొత్తంగా 50 శాతానికిపైగా పెట్టుబడులు ఈఎల్ఎస్ఎస్‌లోకి వస్తుండగా, మార్చి నెల వాటానే 25 శాతంగా ఉంటున్నట్లు తేలింది. అయితే ఈ జోరు కొన్ని తప్పిదాలకూ దారితీస్తున్నది. పన్నుల నుంచి తప్పించుకోవాలనే ఆరాటంతో పెట్టుబడులకు సంబంధించి కనీస జాగ్రత్తల్నీ తీసుకోవడం లేదు. కనిపించిన షేర్లను కొనేస్తున్నారు. తోచిన విధంగా పెట్టుబడులకు వెళ్తున్నారు. దీనివల్ల లాభాలు ప్రభావితమవుతున్నాయి. మదుపరులు నష్టాలనూ చవిచూస్తున్నారు. ఫలితంగా మొత్తం ఆర్థిక లక్ష్యాలే దెబ్బతినే వీలుంటున్నది. ఇది ఎంతమాత్రం క్షేమదాయకం కాదు.

పన్ను మినహాయింపులను పొందడం ఎంతైతే అవసరమో.. పెట్టుబడుల ఎంపిక కూడా అంతే ప్రధానం. కాబట్టి మన కష్టార్జితాన్ని మదుపు చేసే సమయంలో జాగ్రత్త వహించడం తప్పనిసరి. సంపద సృష్టిలో ఇది ఎంతో ముఖ్యం కూడా. పెట్టుబడుల్లో తెలివైన నిర్ణయాలే అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. తొందరపాటు నిర్ణయాలు నష్టాలకు దారితీస్తాయి. కనుక వ్యవస్థీకృత పెట్టుబడుల ప్రణాళిక (ఎస్ఐపీ)ను అవలంబించడం అత్యుత్తమ మార్గం. మొత్తానికి ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులు మదుపరులకు లాభదాయకమని చెప్పవచ్చు. అయితే మార్కెట్ ఆధారిత ఇబ్బందులుంటాయి కాబట్టి ఆందోళన చెందకుండా వివేకంతో వ్యవహరిస్తే చక్కని లాభాలు ఖాయం.



కే నరేశ్ కుమార్
సహ వ్యవస్థాపకులు,
వెలాసిటీ,
వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ
knk@wealocity.com

కొత్త ఏడాది ప్రారంభం అయి అప్పుడే దాదాపు మూడు వారాలు గడిచింది. గత ఏడాది హెచ్చుతగ్గుల ప్రభావం మార్కెట్‌ను ఇంకా వీడలేదు. ఇన్వెస్టర్లందరి మదిని తొలుస్తున్నది ఒకటే ప్రశ్న. కనీసం 2019లో నైనా ఒడిదుడుకులు తగ్గి స్థిరమైన రాబడులు చేతికందుతాయా? 2018 లో నిఫ్టీ చావు తప్పి కన్ను లొట్టపోయిన చందనా కేవలం 3.5 శాతం రాబడిని మాత్రమే ఇచ్చింది. రిటైల్ ఇన్వెస్టర్లు అత్యధికంగా మదుపు చేసే మిడ్‌క్యాప్ ఇండెక్స్ 15.45 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 28.59 శాతం మేర నష్టాలను పంచింది.లార్జ్‌క్యాప్ షేర్లు ఒకవైపు వెళుతుంటే మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లు మరో దారిలో వెళుతుండడంతో ఇన్వెస్టర్లు రిస్క్‌ను తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. అయితే గత ఏడాది కాలంలో ఇన్వెస్టర్లంతా పరోక్షంగా ఎస్ఐపీల ద్వారా మార్కెట్‌లో భారీగా మదుపు చేసి ఉన్నారు. లార్జ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసిన ఇన్వెస్టర్లు 2017తో పోల్చితే తక్కువ రాబడులే వచ్చినప్పటికీ నష్టాలను చవిచూడలేదు. అయితే స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్లలో మదుపు చేసిన ఇన్వెస్టర్లు మాత్రం చేతులు కాల్చుకున్నారు.

2019 ఏది బెస్ట్

ఈక్విటీ
మ్యూచువల్ ఫండ్లు
బంగారం



2019లో దేశీయ స్టాక్‌మార్కెట్లను అంతర్జాతీయ అంశాలే అధికంగా ప్రభావితం చేయనున్నాయి. ఇటీవల బ్యారెల్ క్రూడాయిల్ 85 డాలర్లకు చేరుకున్న తర్వాత 60 డాలర్ల దిగువకు తగ్గడం దేశీయ ఆర్థిక వ్యవస్థకు అత్యంత సానుకూలమైన అంశం. చమురును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న భారత్‌లో వీటి ధరలు తగ్గుముఖం పట్టడం ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి పరోక్షంగా దోహదం చేయనున్నది. తత్ఫలితంగా వడ్డీ రేట్లు కూడా అదుపులో ఉంటాయి. ఈ రెండు అంశాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కూడా లాభాల బాటన పయనించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటికి తోడు ఈ ఏడాది మే నెలలోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. కరెన్సీ వార్ నేపథ్యంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగించవచ్చునన్న అంచనాలు వెలువడుతున్నాయి. అగ్ర దేశాల మధ్య వాణిజ్య యుద్ధ వాతావరణం నెలకొనివున్నా కాల క్రమేణా దాని ప్రభావం వర్ధమాన దేశాల మార్కెట్ల మీద తగ్గుతూ వచ్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే సాధారణ ఎన్నికల నేపథ్యంలో విధాన నిర్ణయాల జాప్యం కారణాలతో విదేశీ సంస్థాగత ఇండియాతో సహా వర్ధమాన దేశాల మార్కెట్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటే స్టాక్ మార్కెట్లతో పాటు రూపాయి మారకం విలువపై కూడా ప్రభావం పడుతుంది.

వడ్డీరేట్ల సంగతి?

2018లో మూడు సార్లు వడ్డీ రేట్లను పెంచిన రిజర్వ్‌బ్యాంక్ ఆ ధోరణిని ఈ ఏడాది కూడా కొనసాగిస్తుందా? అని మార్కెట్ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. గత ఏడాది మొత్తమ్మీద దాదాపు 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి ద్రవ్యోల్బణ లక్ష్యాన్ని రిజర్వ్‌బ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ తగ్గించింది. గతంలో 3.9 నుంచి 4.5 శాతం మధ్యలో ద్రవ్యోల్బణం ఉంటుందని అంచనా వేసిన ఆర్బీఐ దాన్ని ఇటీవల పరపతి విధాన సమీక్షా సమావేశంలో 2.7 నుంచి 3.2 శాతానికి తగ్గించింది. అలాగే ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ 3.8 శాతం నుంచి 4.2 శాతం వరకు ఉండవచ్చునని అంచనా వేసింది. దీంతో వడ్డీ రేట్లు అదుపులోనే ఉండే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

ఎస్ఐపీల్లో మదుపు కొనసాగించవచ్చా?

గత ఏడాది ప్రతి నెలా ఎస్ఐపీల ద్వారా పెట్టుబడులు పెరగుతూ వచ్చాయి. ఒక్క నవంబర్‌లోనే రూ. 8,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఎస్ఐపీల ద్వారా వచ్చాయి. అయితే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్లలో మాత్రం సగటున 12 నుంచి 20 శాతం పైగా నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. 2017లో వచ్చిన అసాధారణ రాబడుల తర్వాత 2018 నిరాశ నిస్పృహలనే మిగిల్చింది. చిన్న ఇన్వెస్టర్లు ఈక్విటీల్లోనూ, మ్యూచువల్ ఫండ్లలోనూ నష్టాలనే చవిచూడాల్సి వచ్చింది. అయితే భారీ కరెక్షన్ తర్వాత ఈ షేర్లలో రికవరీ వచ్చే అవకాశాలున్నాయి. అనేక క్వాలిటీ మిడ్‌క్యాప్ షేర్లలో అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడి నుంచి పతనం పరిమితంగా ఉన్నందున గత ఏడాది కాలంగా భారీగా నష్టపోయిన ఈ షేర్లలో వ్యాల్యూయేషన్లు కూడా చవగ్గా కనిపిస్తున్నాయని ఎడిల్‌వైజ్ అసెట్‌మేనేజ్‌మెంట్ కంపెనీ సీఈఓ రాధిక గుప్తా అభిప్రాయపడుతున్నారు.

ఓ హెచ్చరిక

మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో రిస్కులు అధికంగా ఉంటాయి. మార్కెట్లో వచ్చే ఒడిదుడుకులకు ఇవి ఎక్కువగా ప్రభావితం అవుతాయి. ఈ ఒడిదుడుకులను అర్థం చేసుకుని తట్టుకోగల ఇన్వెస్టర్లు మాత్రమే మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్లలో మదుపు చేయడానికి ఆలోచించాలి. ఒకవేళ రిస్క్ తీసుకోవడానికి సుముఖంగా లేకపోతే లార్జ్‌క్యాప్ ఫండ్లకు ఎక్కువగా నిధులను కేటాయించుకోవాలి. లార్జ్‌క్యాప్ ఫండ్లలో ఉండే వ్యయాలను కూడా అధిగమించాలంటే ఇండెక్స్ ఫండ్ల వైపు దృష్టి సారించడం మేలు. ప్రస్తుతం వివిధ మ్యూచువల్ ఫండ్ల స్కీములు రాబడులను ఇండెక్స్ రాబడులతో పోల్చి చూస్తున్నందున, అలాగే లార్జ్‌క్యాప్ నిర్వచనం కూడా మారిపోయినందున ఇండెక్స్ ఫండ్లతో పోటీ రాబడులను ఇవ్వడం మార్కెట్ క్యాప్ ఆధారిత ఫండ్లకు సాధ్యం కాకపోవచ్చు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు సమీకరణాలకు అనుగుణంగా మార్కెట్లలో ఒడిదుడుకులు పెరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో ఇన్వెస్టర్లు ఎస్ఐపీలను ఆపకుండా ఉంటేనే సగటున యూనిట్ల విలువ తక్కువ ధరలో ఎక్కువ యూనిట్లు జమ అవడానికి అవకాశం ఉంటుంది.

వడ్డీ రేట్ల తగ్గుదల ఓ అవకాశం?

క్రమం తప్పకుండా కచ్చితమైన రాబడులు రావాలనుకునే వారికి ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాలు అవకాశాన్ని కల్పిస్తాయి. అయితే తగ్గుతున్న వడ్డీ రేట్లు రాబడిని హామీ పథకాలను ఎంచుకోవాల్సి వుంటుంది. షార్ట్ టర్మ్ బాండ్ ఫండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు, లాంగ్‌టర్మ్ బాండ్ ఫండ్లలో మదుపు చేయవచ్చు. ఒకవేళ క్యాపిటల్ భద్రంగా ఉండాలనుకునే వారు ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్‌ను ఎంచుకోవచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిన్న మొత్తాల పొదుపు వంటి సాధనాలు ఎలాగూ ఉన్నాయి.

పసిడి మెరుపులు మెరిసేనా?

ఈక్విటీ, బాండ్ ఇన్వెస్టర్లు వారి వారి కారణాలచేత ఆయా సాధనాల్లో మదుపు చేస్తుంటారు. అయితే ఈ ఏడాదిలో బంగారం ధరలు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేయనున్నాయి. గత మూ డు నాలుగేండ్లుగా స్తబ్దుగా ఉన్న బంగారం ధరలు 2019లో కూడా లబ్ది పొందనున్నారు. 2018లో బంగారంలో మదుపు చేసిన ఇన్వెస్టర్లు 8.5 శాతం మేర రాబడిని అందుకోగలిగారు. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, చమురు ధరల పెరుగుదల కారణంగా గత ఏడాది బంగారం ధరలు పెరిగాయి. అయితే గత కొన్నేండ్లు స్తబ్దుగా ఉన్న కారణంగా బంగారం ఈటీఎఫ్‌ల నుంచి ఇన్వెస్టర్లు వైదొలిగారు. అయితే ఈ ఏడాది అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందన్న వార్తలు, గ్లోబల్ రాజకీయ పరిస్థితుల కారణంగా సురక్షిత సాధనంగా బంగారాన్ని ఆశ్రయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చైనా, ఇండియా దేశాల నుంచి వచ్చే డిమాండే బంగారం ధరలను నిర్దేశించనున్నది. ఏడాది ఔన్స్ బంగారం ధర 1,450 డాలర్లను అధిగమించవచ్చునని అంచనా వేస్తున్నారు. పది గ్రాముల బంగారం ధర దేశీయ మార్కెట్లో రూ. 36,000 వరకూ చేరుకోవచ్చునని అంచనా వేస్తున్నారు. కనీసం ప్రతి ఒక్కరు 5 నుంచి 10 శాతం వరకు బంగారానికి కేటాయించడం ఈ ఏడాది ఉత్తమ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహం అనిపించుకుంటుంది.

మ్యూచువల్ ఫండ్లు చవగ్గా

2018 మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ అనేక మార్పులకు గురైంది. మ్యూచువల్ ఫండ్ స్కీములు ఇన్వెస్టర్లు మరింత ఆకర్షణీయంగా తయారు చేసేందుకు వ్యయాలను తగ్గించేందుకు సెబీ అనేక చర్యలను చేపట్టింది. మొత్తం వ్యయాలకు సంబంధించి సెబీ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ఈక్విటీ ఫండ్లు వ్యయాల కింద 2.25 శాతం ఇతర ఫండ్లు 2 శాతం మేర వ్యయాలను చార్జి చేయవచ్చు. దీంతో మ్యూచువల్ ఫండ్లు ఇన్వెస్టర్లు మరింత చవకగా లభించే అవకాశం ఏర్పడింది. అలాగే డిస్ట్రిబ్యూటర్లకు కమిషన్లను చెలించడాన్ని కూడా సెబీ నిషేధించింది.

సుస్థిర ప్రభుత్వమే కీలకం

2019 తొలి ఆరునెలల కాలంలో స్టాక్ మార్కెట్‌కు తీవ్ర ఒడిదుడుకులు ఎదురుకావచ్చునని ప్రముఖ బ్రోకింగ్ సంస్థ కార్వీ పేర్కొంది. 2019 సంవత్సరానికి ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహం నివేదికను కార్వీ స్టాక్ బ్రోకింగ్ సీఈవో రాజీవ్ సింగ్ శుక్రవారం విడుదల చేశారు. సాధారణ ఎన్నికలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో మార్కెట్‌లో హెచ్చుతగ్గులు గణనీయంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అందరూ అనుకుంటున్నట్టుగా ఈసారి అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం అమెరికా నుంచి కాకుండా చైనా నుంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. అయితే 2020 ద్వితీయార్థం వరకూ ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశాలు లేవని అన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థం నుంచి 2020 ద్వితీయార్థం వరకు స్టాక్ మార్కెట్ మంచి ర్యాలీ వచ్చే అవకాశం వుందని చెప్పారు. చైనా ఆర్థిక వ్యవస్థ మందగించడం వల్ల ఇండియాకు స్వల్పకాలంలో లబ్ది చేకూరిన దీర్ఘకాలంలో గ్లోబల్ మాంద్య ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇండియా, బ్రెజిల్ దేశాల్లో యువ జనభా అధిక సంఖ్యలో ఉన్న కారణంగా వర్ధమాన దేశాలన్నింటికన్నా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ ఏడాది కార్పొరేట్ రాబడుల్లో వృద్ధి పుంజుకుంటుందని ఆయన అంచనావేస్తున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు ఎస్ఐపీల ద్వారా మదుపు చేయడం శ్రేయస్కరమని అన్నారు. కేంద్రంలో సాధారణ ఎన్నికల తర్వాత సుస్థిర ప్రభుత్వం ఏర్పడితే నిఫ్టీ 14,000 స్థాయికి చేరుకుంటుందని, అదే అస్థిర సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 9,000 స్థాయికి కూడా పతనం అయ్యే ప్రమాదం ఉందని రాజీవ్ సింగ్ అన్నారు. క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, ఫార్మా, ఐటీ రంగాలపై తాము బుల్లిష్‌గా ఉన్నట్టు తెలిపారు. పోర్టుఫోలియో నిర్మాణంలో 70 శాతం నిధులను లార్జ్ క్యాప్ షేర్లకు కేటాయించాలని ఆయన సూచించారు. ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహం నివేదికలో భాగంగా వెల్త్ మాగ్జిమైజర్, వ్యాల్యూ ఇన్వెస్ట్, డివిడెండ్ మాగ్జిమైజర్ అనే మూడు విభాగాల్లో పదేసి షేర్ల చొప్పున కార్వీ సిఫార్సు చేసింది. వెల్త్ మ్యాగ్జిమైజర్ విభాగంలో భారతీ ఇన్‌ఫ్రాటెల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌యుఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ, టాటామోటార్స్, యూపీఎల్, యెస్ బ్యాంక్ షేర్లను సిఫార్సు చేసింది. కాగా, వ్యాల్యూ ఇన్వెస్ట్‌లో భాగంగా బజాజ్ ఎలక్ట్రికల్స్, ఫినోలెక్స్ కేబుల్స్, మినాస్ బేరింగ్స్, విశాక ఇండస్ట్రీస్ తదితర షేర్లు ఉన్నాయి.



రాజీవ్ సింగ్, సీఈవో,
కార్వీ స్టాక్ బ్రోకింగ్

పొదుపు ఖాతా వర్సెస్ పేమెంట్ బ్యాంక్ ఖాతా



బ్యాంకుల్లో లభించే పొదుపు ఖాతాతో పోలిస్తే పేమెంట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న సంస్థలు ఆఫర్ చేస్తున్న ఖాతాలు ఏమేర ప్రయోజనం కలిగిస్తున్నాయో తెలుసుకుందాం..

గ్రామాల్లో నివసిస్తున్న వారికి బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది సెప్టెంబర్ 1న అంగరంగ వైభవంగా తపాలాశాఖ పేమెంట్ బ్యాంక్ సేవలను ఆరంభించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా 3,250 యాక్సెస్ పాయింట్లు, 650 శాఖలను నెలకొల్పింది. ప్రతి భారతీయుడికి బేసిక్ ఆర్థిక సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ వినూత్నానికి శ్రీకారం చుట్టింది. తపాలశాఖతోపాటు మరో ఐదు ప్రైవేట్ సంస్థలు కూడా ప్రజలను ఆకట్టుకోవడానికి ఇలాంటి సేవలను ఆరంభించాయి కూడా. ప్రస్తుతం పొదుపు ఖాతాలపై ప్రధాన బ్యాంకులు అందిస్తున్న సేవలతో పోలిస్తే పేమెంట్ బ్యాంకులు అందిస్తున్న సేవలు బ్యాంకింగ్ రంగం రూపురేఖలు మార్చివేయనున్నది. వీటిలో కొన్నింటి గురించి తెలుసుకుందాం..

వడ్డీరేట్లపై ఆఫర్లు కూడా..

రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాలకు లోబడి పేమెంట్ బ్యాంక్‌లో పొదుపు ఖాతాను ప్రారంభించినవారికి డిపాజిట్లపై కనీసంగా నాలుగు శాతం వడ్డీని ఆఫర్ చేస్తుండగా.. గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీని అందిస్తున్నాయి. మరోవైపు పొదుపు ఖాతాలపై అత్యధికంగా ఆర్జించాలనే ఆలోచన మాత్రం చేయకండి. ఎందుకంటే ఆయా సంస్థలు లేదా ఆర్థిక సేవల సంస్థలు 5 శాతం మాత్రమే వడ్డీని ఆఫర్ చేస్తుండగా, దీనిని 6 లేదా 6.25 శాతం వరకు చెల్లించవచ్చును. ఒకవేళ సున్న బ్యాలెన్స్ పొదుపు ఖాతా తీసుకుంటే దీనిపై మీకు 3 శాతం లేదా 4 శాతం ఆదాయం లభించనున్నది.

కనీసంగా కొంతమేర డిపాజిట్ చేయాలి..

దేశవ్యాప్తంగా ఉన్న అధిక పేమెంట్ బ్యాంకులు జీరో బ్యాలెన్స్ పొదుపు ఖాతాను ఆఫర్ చేస్తున్నాయి. అంటే పొదుపు ఖాతాల్లో కనీసం నగదు నిల్వ ఉంచకూడదని కాదు..ఈ ఖాతాల్లో కొంత మొత్తమైన డిపాజిట్ చేయాలి. ఇతర బ్యాంకులు కూడా ఇదే తీరుగా ఆఫర్‌ను అందిస్తున్నాయి.

ఏటీఎం/డెబిట్ కార్డులు కూడా..

ప్రధాన బ్యాంకులు ఇస్తున్న ఏటీఎం/డెబిట్ కార్డులు కూడా ఈ పేమెంట్ బ్యాంకులు అందిస్తున్నాయి. రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాలమేరకు పేమెంట్ బ్యాంకులు ఈ రెండు కార్డులను జారీ చేయడానికి అధికారం కలిగివున్నాయి. ఖాతాను ప్రారంభించే సమయంలోనే డిజిటల్ కార్డు కావాలని ఖాతాదారుడు కోరాల్సి ఉంటుంది. దీంతో వెంటనే ఈ కార్డును వినియోగదారుడికి ఆయా బ్యాంక్ అందించనున్నది. ఇప్పటికే తపాలాశాఖ డెబిట్/ఏటీఎం కార్డును అందచేస్తున్నాయి. కానీ, రెగ్యులర్ సేవింగ్ ఖాతాలకు ఈ రెండు రకాల కార్డులను అందించడం అంత సులువుకాదు మరి.

కనీస మొత్తాన్ని నిర్వహించుకోవాలి..

ఇటీవల అందుబాటులోకి వచ్చిన తపాలాశాఖ పేమెంట్ బ్యాంక్‌లో కనీస నగదు నిల్వలు లేకుండా ఉన్న ఖాతాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మిగతా బ్యాంకుల్లో పొదుపు ఖాతాల్లో కనీసంగా నగదు ఉంచాల్సి ఉంటుంది, కానీ పేమెంట్ బ్యాంకుల్లో అలాంటి నిబంధనలు ఏమిలేవు. అయినప్పటికీ బ్యాంకులు..బ్యాంకుల మధ్య తేడాలు కూడా ఉంటాయి. జీరో బ్యాలెన్స్ అకౌంట్ తీసుకున్నవారు ఈ ఖాతాల్లో ఎలాంటి డబ్బు ఉంచాల్సిన అవసరం లేదు. రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాలకు లోబడి గరిష్ఠంగా లక్ష రూపాయల వరకు నగదును ఉంచుకునేందుకు ఖాతాదారుడికి అవకాశం ఉంటుంది.

ఉచిత లావాదేవీలు పరిమితమే..

ఏటీఎం/డెబిట్ కార్డు వచ్చిందని మురిసిపోవద్దు. ఎందుకంటే ఈ కార్డు ద్వారా ఇష్టం వచ్చినప్పుడు, ఎన్నైనా సార్లు డబ్బును విత్‌డ్రా చేసుకుంటామంటే కుదరదు. ఎందుకంటే ఈ కార్డులపై పరిమితులు విధించాయి. ఆయా సంస్థలకు చెందిన ఏటీఎంల్లో ఉచిత విత్‌డ్రా పరిమితులతోపాటు ఇతర ఏటీఎంల్లో పరిమితికి మించి లావాదేవీలు జరిపితే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మీరు పేమెంట్ బ్యాంక్‌లో పొదుపు ఖాతా తీసుకునే సమయంలోనే స్థిరమైన ఉచిత ఏటీఎం/డెబిట్ కార్డుల పరిమితులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన పేమెంట్ బ్యాంక్..మూడుసార్లు ఉచిత ఏటీఎం లావాదేవీలు కల్పిస్తుండగా, మరో సంస్థ నెలకు రూ.25 వేలు ఆఫర్ చేస్తున్నాయి.

అదనపు ఆర్థిక సేవలు కూడా..

బ్యాంకులు పొదుపు ఖాతా కలిగివున్నవారికి ఆయా సంస్థ ఇతర సేవలు సైతం అందించనున్నది. ముఖ్యంగా రుణాలు తీసుకోవడం, ఒవర్‌డ్రాఫ్ట్ లేదా క్రెడిట్ కార్డు, పెట్టుబడులు పెట్టేందుకు సలహాలు, సూచనలు చేయనున్నది. వీటితోపాటు బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఖాతాలో నగదు, ఆన్‌లైన్‌లో నగదును పంపుకోవచ్చును కూడా. వీటితోపాటు ఉచిత టాక్‌టైం, క్యాష్‌బ్యాక్ లేదా లక్ష రూపాయల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా లభించనున్నది.

అధిల్ శెట్టి
బ్యాంక్ బజార్.కామ్
సీఈవో



పీఎంఆర్‌పీవై లబ్ధిదారులు కోటిపైనే

ప్రధాన మంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన (పీఎంఆర్‌పీవై) నుంచి లబ్ధి పొందిన ఉద్యోగుల సంఖ్య కోటి మార్కును దాటింది. ఆయా సంస్థలకు ప్రోత్సాహకాల ద్వారా కొత్తగా ఉపాధి అవకాశాలను సృష్టించడమే ఈ పథకం అసలు ఉద్దేశం. 2016 ఏప్రిల్ 1 తర్వాత ఈపీఎఫ్‌వోలో నమోదై, నెలకు రూ.15,000 వరకు జీతమున్న కొత్త ఉద్యోగులకు ఈ పథకం కింద మూడేండ్లపాటు అటు ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్), ఇటు ఎంప్లాయ్ పెన్షన్ స్కీం (ఈపీఎస్)ల కోసం సంస్థల తరపున మొత్తం 12 శాతం విరాళాన్ని ప్రభుత్వమే చెల్లిస్తున్నది. 'ఉపాధి కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకం పీఎంఆర్‌పీవై. ఈ నెల 14 నాటికి ఈ పథకం కింద ప్రయోజనం పొందిన లబ్ధిదారుల సంఖ్య కోటికిపైగానే ఉన్నది' అని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 2016 ఆగస్టు 7న పీఎంఆర్‌పీవైని మోదీ సర్కారు ప్రకటించింది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) ద్వారా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ పథకాన్ని అమలు చేస్తున్నది. కాగా, 2016-17 ఆర్థిక సంవత్సరంలో 33,031 మంది, 2017-18 ఆర్థిక సంవత్సరంలో 30,27,612 మంది, ప్రస్తుత 2018-19 (జనవరి 15దాకా) ఆర్థిక సంవత్సరంలో 69,49,436 మంది లబ్ధిదారులున్నారు. అలాగే ఈ పథకాన్ని వర్తింపజేసుకున్న సంస్థలు 1.24 లక్షలుగా ఉన్నాయి. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఆన్‌లైన్, ఆధార్ ఆధారిత వ్యవస్థపై ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 31తో పీఎంఆర్‌పీవై కింద సంస్థలు అందుకుంటున్న ప్రయోజనాలకు కాలం తీరనున్నది.



సుడోకు

డైలీ సుడోకు 40 సమాధానం

1	4	7	2	5	8	3	6	9
8	9	3	1	6	7	4	2	5
2	5	6	4	9	3	1	7	8
3	1	9	5	4	6	2	8	7
4	6	5	7	8	2	9	1	3
7	2	8	9	3	1	5	4	6
5	8	2	6	1	9	7	3	4
6	7	4	3	2	5	8	9	1
9	3	1	8	7	4	6	5	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -41

5							4	
7				4	5			
	3							5
				7	9			
8		3	1				6	
		5	6			2	1	4
3		9			2			
	6		8			1		2
		2						8

నమస్తే తెలంగాణ
సంపద
[హైదరాబాద్]
శనివారం 19 జనవరి 2019


26 అంతస్తుల 'మై హోమ్ క్రిష్'

నిర్మాణ రంగంలో ముప్పయ్ ఎనిమిదేండ్ల అనుభవం గల సంస్థ ఏదైనా ఉందా అంటే.. ప్రతిఒక్కరికీ ముందుగా 'మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్' గుర్తుకొస్తుంది. ఇప్పటివరకూ దాదాపు పదిహేనుకు పైగా అతిపెద్ద ప్రాజెక్టులను కొనుగోలుదారులకు విజయవంతంగా అందజేసింది. ఆకాశహర్మ్యాలను నిర్మించడంలో ఘనమైన చరిత్ర గల మైహోమ్.. గచ్చిబౌలి చేరువలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 'మైహోమ్ క్రిష్' అనే సరికొత్త లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నది. రెరా అనుమతి లభించిన ఈ ప్రాజెక్టులో.. అతితక్కువ కాలంలోనే అమ్మకాలూ 90 శాతం పూర్తి కావడం విశేషం.

▪ 'మై హోమ్ క్రిష్'ను దాదాపు 6.70 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. నాలుగు బ్లాకుల్లో వచ్చే ఫ్లాట్ల సంఖ్య.. 650. ఒక్కో బ్లాకు ఎత్తు సుమారు 26 అంతస్తులు. ప్రస్తుతం నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్న ఈ ప్రాజెక్టులో రెండు పడక గదుల ఫ్లాట్ విస్తీర్ణం.. 1,275 చదరపు అడుగుల నుంచి ఆరంభమవుతుంది. అదే త్రీ బెడ్‌రూం ఫ్లాట్ల విషయానికొస్తే.. 1740, 1835, 2160, 2780 చదరపు అడుగుల్లో లభిస్తాయి. నిర్మాణ నాణ్యతలో ఎక్కడా రాజీపడని మైహోమ్ సంస్థ.. ఆధునిక సదుపాయాల్ని పొందుపర్చడంలో తన ప్రత్యేకతను నిరూపిస్తున్నది. కేవలం క్లబ్‌హౌజును 37 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్నది. ప్రాజెక్టులో చేపడుతున్న సెంట్రల్ ల్యాండ్ స్కేప్ ప్రాంతాన్ని చూస్తే ఎవరికైనా చూడ ముచ్చటేస్తుంది. స్విమ్మింగ్ పూల్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, ఔట్‌డోర్ బాస్కెట్‌బాల్, టెన్నిస్ కోర్టులు వంటివి పొందుపరుస్తున్నది. ప్రస్తుతం ఎనిమిదో అంతస్తులో ఆర్‌సీసీ పనులు పూర్తయ్యాయి. 2020 డిసెంబరు నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సంస్థ చెబుతున్నది.



క్లిక్ చేస్తే.. డెవలపర్ చరిత్ర



కొనుగోలుదారులకు పూర్తి స్థాయి భద్రత..

తెలంగాణ రాష్ట్రంలో ఇండ్ల కొనుగోలుదారులు ఇక నుంచి పూర్తి భరోసాగా ఉండొచ్చు. రెరా అనుమతి పొందిన ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులుండవు. నిర్మాణం చేపట్టే బిల్డర్ సకాలంలో ఫ్లాట్‌ను అందజేస్తారు. పైగా, ఇల్లు కొన్న తర్వాత ఐదేండ్ల పాటు నిర్మాణంలో ఎలాంటి లోపాలున్నా బిల్డరే బాధ్యత వహిస్తాడు. రెరా వెబ్‌సైటులో ప్రాజెక్టులను చూస్తే.. వాటిలో ఫ్లాటు కొనాలా? వద్దా? అనే తుది నిర్ణయానికి ఎవరైనా ఇట్టే రావొచ్చు. రెరాలో నమోదయ్యే వెంచర్లలో ప్లాట్లు కొనేవారు తమ స్థలం గురించి నిశ్చింతగా ఉండొచ్చు. అట్టి ప్రమోటర్లతో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రెరాకు ఫిర్యాదు చేస్తే చాలు.. వారే సమస్యను పరిష్కరిస్తారు. తను వినకపోతే జైలుకూ పంపిస్తారు.

ఫ్లాటు కొనడానికి వెళితే.. అక్కడి ఎగ్జిక్యూటివ్ ఆకర్షణీయమైన మాటలతో ఆకట్టుకుంటాడు. ఫ్లాట్లన్నీ దాదాపుగా బుక్ అయిపోయాయని మొదట్లో బుకాయిస్తాడు. ఆయా ప్రాజెక్టు స్థల యజమాని గురించి అడిగితే తన నోటి నుంచి మాట రాదు. కొనాలనుకునే ఫ్లాట్ కార్పెట్ ఏరియా గురించి చెప్పమంటే చెప్పకపోవచ్చు. ఆయా ప్రమోటర్‌కి సకాలంలో ఫ్లాట్లను అందజేసే ఘన చరిత్ర గురించి అడిగినా పట్టించుకోడు. ఇంటికి సంబంధించిన అనుమతి పత్రాల్ని చూపించమంటే చిర్రెత్తుకొస్తుంది. చివరికీ, ఇష్టముంటే కొనండి.. లేకపోతే లేదు.. అని మొహం మీదే చెప్పేస్తాడు. ఇప్పటివరకూ సర్వసాధారణమైన ఇలాంటి సన్నివేశాలు ఇక నుంచి తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా కనిపించవు. ఎందుకంటే, ఒక క్లిక్ కొడితే చాలు.. ఇంటి చరిత్రతో బాటు ప్రమోటర్ చరిత్ర కూడా ఎవరికైనా ఇట్టే తెలుస్తుంది. అదెలా అంటారా?

మీరు హైదరాబాద్‌లో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని అనుకుంటున్నారా? భవిష్యత్తులో ఇల్లు కట్టుకోవడానికి ప్లాటు కొంటారా? లేక మీ బడ్జెట్‌లో నచ్చిన ఫ్లాట్ తీసుకోవాలని అనుకుంటున్నారా? మీ అవసరాలు ఏవైనా.. భవిష్యత్తులో ఎలాంటి బాదరాబందీల్లేకుండా ఉండాలని కోరుకునే వారి కోసమే.. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రెరా అథారిటీని ఏర్పాటు చేసింది. రెరా పోర్టల్ ప్రారంభించింది. ఇందులో (rera.telangana.gov.in)కి వెళితే చాలు.. మీకు నచ్చిన వెంచర్లు లేదా ప్రాజెక్టుల సమాచారం ఇట్టే లభిస్తుంది. ఇందుకు మీరు చేయాల్సిందల్లా.. కాస్త ఓపికగా వివరాల్ని చూసుకోవడమే.

▪ రెరా సైటు హోమ్ పేజీలోని సర్వీసెస్‌కు వెళ్లి క్లిక్ చేస్తే చాలు.. 'సెర్చ్ రిజిస్టర్డ్ ప్రాజెక్ట్స్ అండ్ ఏజెంట్స్' అనే ఆప్షన్ కనిపిస్తుంది. దాని మీద క్లిక్ చేయగానే.. మీకో కొత్త విండో ఓపెన్ అవుతుంది. అందులో (శుక్రవారం నాటికి) సుమారు 173 ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారం ఉంది. ఆయా ప్రాజెక్టు పేరు, ప్రమోటర్ పేరు, ఎప్పుడు రెరా అనుమతి లభించింది వంటి వివరాలు ఇట్టే తెలుస్తాయి. వ్యూ డిటెయిల్స్ మీద క్లిక్ చేస్తే చాలు.. ప్రమోటర్ పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, సంస్థ వెబ్‌సైటు, ప్రాజెక్టు పేరు వంటి వివరాల్ని తెలుసుకోవచ్చు. అంతేకాకుండా, ఆయా బిల్డర్ ఎంత విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్నారు? అతని స్థలం చుట్టుపక్కల ఉన్న సరిహద్దుల వివరాలు, ఎంత బిల్టప్ ఏరియా కడతాడు? అందులో తనఖా పెట్టిన స్థలమెంత వంటివి సులువుగా అర్థమవుతాయి.

ఎన్ని అమ్మేశాడు?

మనం ప్లాటు లేదా ఫ్లాటు కొనాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు.. ఏదైనా వెంచర్ లేదా ప్రాజెక్టు వద్దకు వెళితే ఆయా ప్రమోటర్ పేరు తెలుసుకోవడం కష్టమవుతుంది. కానీ, ఇక్కడ మాత్రం ప్రమోటర్ పూర్తి వివరాలు తెలిసిపోతాయి. ప్రమోటర్ నిర్మించేది సొంత స్థలంలోనా? లేక స్థల యజమానితో ఒప్పందం కుదుర్చుకుని నిర్మాణం చేపడుతున్నారా? ప్రమోటర్లు లేదా స్థల యజమానులు ఎంతమంది ఉంటే.. అంతమంది వివరాలు రెరా పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. అందులో ఎన్ని ప్లాట్లు లేదా ఫ్లాట్లను నిర్మిస్తారు? ఇప్పటివరకూ ఏమైనా విక్రయించారా? వంటివి కళ్ల ముందే కనిపిస్తాయి.

▪ సాధారణంగా రియల్ ఎస్టేట్ డెవలపర్లు బయటికి చెప్పని సమాచారం రెరాలో పొందుపరుస్తారు. ఆయా ప్రాజెక్టులో అంతర్గత రోడ్లు వేస్తున్నారా? మంచినీటి సరఫరా ఉందా? మురుగునీటి సౌకర్యం కల్పించారా? ఎస్టీపీని ఏర్పాటు చేశారా? వరద నీటి కాల్వలను పొందుపరిచారా? వీధి దీపాలు ఏ స్థాయిలో ఉన్నాయి? పార్కులు, ఇంధన వినియోగం, అగ్ని వ్యాపించకుండా ఎలాంటి చర్యల్ని తీసుకున్నారు? విద్యుత్తుకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకున్నారా? మొత్తం వచ్చే ఖాళీ స్థలమెంత? ఇలా ఒక ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలన్నీ ఉంటాయి. ఏయే అంతస్తులో ఎన్ని ఫ్లాట్లు వస్తాయి? అందులో తనఖా ఫ్లాట్లు ఎన్ని? ఒక్కో ఫ్లాటు విస్తీర్ణమెంత? వంటివీ తెలుస్తాయి.

కట్టడంలో ఉపయోగించేదేమిటి?

ప్రస్తుతం నిర్మాణం ఏ స్థాయిలో ఉంది? ఎన్ని పునాదులొస్తాయి? పోడియంల సంఖ్య, స్టిల్ట్ ఫ్లోరు, సూపర్‌స్ట్రక్చర్ శ్లాబులెన్ని? అంతర్గత ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, శానిటరీ ఫిట్టింగులు, మెట్లు, లిఫ్టులు, ఓవర్ హెడ్/అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంకులు, ప్లంబింగ్ పనికి సంబంధించిన వివరాలు, వాటర్ ప్రూఫింగ్ చేశారా? మొత్తం వాటర్ పంపులెన్ని? కామన్ ఏరియాస్‌లో వినియోగిస్తున్న ఎలక్ట్రికల్ ఫిట్టింగులు, ప్రహారీ గోడ వంటి వివరాల్ని ఇట్టే తెలుసుకోవచ్చు. అంతే కాదు, ఆయా ప్రాజెక్టు ఆర్కిటెక్ట్, స్ట్రక్చరల్ ఇంజినీర్ వివరాలూ పొందుపరిచి ఉంటాయి.

పత్రాలన్నీ అక్కడే..

మనం ప్లాటు లేదా ఫ్లాటు కొనాలనుకున్నప్పుడు.. ఆయా భూయాజమాన్య హక్కుల్ని తెలుసుకోవాలనుకుంటాం. అయితే, అందుకు సంబంధించిన వివరాల్ని నోరు తెరిచి డెవలపర్‌ని అడిగితే పెద్దగా స్పందించకపోవచ్చు. మరికొందరేమో ఇష్టం ఉంటే కొనండి.. లేకపోతే లేదు.. అనే సమాధానాన్ని మొహం మీదే చెప్పేస్తుంటారు. అయితే, రెరాలో మాత్రం మీరు కొనాలనుకుంటున్న ప్లాటు లేదా ఫ్లాటుకు సంబంధించిన భూయాజమాన్య హక్కుల్ని ఇట్టే తెలుసుకోవచ్చు. ఆయా స్థలానికి సంబంధించి ఈసీ, అప్రూవల్ ప్లాన్, ఒప్పంద పత్రం నమూనా, స్థానిక సంస్థ అనుమతి పత్రం, ఆర్కిటెక్ట్ సర్టిఫికెట్, నిర్మాణం ఎప్పట్నుంచి చేపడతారు. ఫామ్–బి.. ఇలా మీరు కొనాలనుకునే ఫ్లాటుకు సంబంధించిన ప్రతిఒక్క విషయాన్ని రెరా పోర్టల్‌లో చూస్తే తెలుస్తుంది.

కింగ్ జాన్సన్ కొయ్యడ

ఎంఐజీ పొడిగింపు ఎవరికి ఉపయోగం?

ఎంఐజీ గృహాల వడ్డీ రాయితీ పథకం.. 2020 మార్చి వరకు పొడిగింపు

తెలంగాణ రాష్ట్రంలో సొంతిల్లు కొనుక్కునేవారికి శుభవార్త. సీఎల్ఎస్ఎస్ (క్రెడిట్ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్) కింద సొంతిల్లు కట్టుకునేవారికి కేంద్రమిచ్చే రూ.2.67 లక్షల రాయితీనిచ్చే పథకాన్ని 2020 మార్చి వరకూ పొడిగించింది. వాస్తవానికి, ఈ పథకం చివరి తేది 2019 మార్చి 31తో ముగుస్తుంది. దీనికి లభిస్తున్న విశేష ఆదరణ నేపథ్యంలో.. ఈ పథకాన్ని మరో ఏడాది దాకా పొడిగించాలని కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ ఇటీవల ఆదేశాల్ని జారీ చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా.. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి ఇల్లు కొనుక్కునేవారికెంతో ఉపయోగపడుతుందని చెప్పొచ్చు. కాకపోతే, ఈ పథకం కింద హైదరాబాద్లో ఎంతమంది ఇల్లు కొనుక్కునే అవకాశముంది?



రూ.30 లక్షల్లోపు ఇండ్లు ఎక్కడ?

మనదేశంలో ఏడాదికి రూ.6 నుంచి రూ.18 లక్షల జీతాన్ని ఆర్జించేవారు.. సీఎల్ఎస్ఎస్ కింద రుణం తీసుకోవడానికి అర్హులు. ఈ పథకాన్ని రెండు రకాలుగా విభజించారు. ఎంఐజీ–1 కింద, ఏడాదికి రూ.6–12 లక్షల వేతనాన్ని ఆర్జించేవారు మొదటి విభాగంలోకి వస్తారు. వీరు ఇరవై ఏండ్ల వ్యవధికి గృహరుణం సాయంతో ఇల్లు కొనుక్కుంటే.. దాదాపు నాలుగు శాతం మేరకు వడ్డీ రాయితీ లభిస్తుంది. అంటే, నెలకు రూ.75,000 ఆర్జించేవారు.. కనీసం రూ.30 లక్షల్లోపు ఇంటిని కొనుగోలు చేయగలరన్నమాట. మరి, భాగ్యనగరంలో రూ.30 లక్షల్లోపు గల ఫ్లాట్లను కట్టే డెవలపర్లు ఎంతమంది? ఒకవేళ, ఎవరైనా బిల్డర్లు అందుబాటు ధరలో ఫ్లాట్లను నిర్మించినా.. వాటి కోసం శివారు ప్రాంతాల వరకూ వెళ్లక తప్పదు.

రూ.50 లక్షల్లో దొరికేనా?

ఎంఐజీ–2లో భాగంగా.. రూ.12–18 లక్షల వార్షిక వేతనం సంపాదించేవారు మూడు శాతం వడ్డీ రాయితీని అందుకోవచ్చు. నెలకు లక్షా ఇరవై ఐదు వేల రూపాయల వేతనాన్ని సంపాదించేవారు. దాదాపు రూ.50 లక్షల విలువ గల ఇంటిని కొనుగోలు చేయడానికి ముందుకొస్తారు. కాకపోతే, మన హైదరాబాద్‌లోని మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ వంటి ప్రాంతాల్లో రెండు పడక గదుల ఫ్లాట్ కోసం ఎంతలేదన్నా రూ.70 నుంచి 80 లక్షలు పెట్టక తప్పదు. అదే, మూడు పడక గదుల ఫ్లాట్ కోసం సుమారు కోటి రూపాయలకు పైగా పెట్టాల్సిందే. ఈ స్థాయిలో సొమ్ము పెడితేనే.. ఇలాంటి ప్రాంతాల్లో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోగలరన్నమాట. అంతెందుకు, మియాపూర్ వంటి ప్రాంతాల్లోనూ చదరపు అడుక్కీ రూ.4,000 నుంచి రూ.5,000 చెప్పే డెవలపర్లు లేకపోలేరు. అందుకే, ఈ స్కీమ్ వల్ల ఉపయోగం లేదని కొనుగోలుదారులు అంటున్నారు.

ఎంత విస్తీర్ణంలో కొనవచ్చు?

సీఎల్ఎస్ఎస్ స్కీములో భాగంగా అర్హులైన రుణగ్రహీతలకు.. దాదాపు 1,500 నుంచి 2,100 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఫ్లాట్లను కొనడానికి అర్హత లభిస్తుంది. కాకపోతే, ఈ విస్తీర్ణంలో ఫ్లాట్లు కొనడానికి శివారు ప్రాంతాలకు వెళ్లినా స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోలేని దుస్థితి.



రుణభారం.. తగ్గే విధానం

క్విక్‌పే విధానంలో ఉన్న అతిపెద్ద సవాల్.. ఆరంభం నుంచి నెలసరి వాయిదాలు అధికంగా కట్టాల్సి రావడమే. ఇదే గనక అడ్డంకి కాకపోతే, రుణాన్ని త్వరగా చెల్లించాలని భావించేవారికి.. ఇదో మంచి ప్రత్యామ్నాయం అని చెప్పొచ్చు.

గృహరుణం అనగానే ముందుగా మనలో చాలామంది లెక్కించేది నెలసరి వాయిదాల్నే. మనం తీసుకునే రుణమెంత? అందు కోసం ప్రతినెలా ఎంత మొత్తం కట్టాలనే విషయం చుట్టూ మన ఆలోచనలు తిరుగుతుంటాయి. అందుకే, యాక్సిస్ బ్యాంక్ కాస్త భిన్నమైన గృహరుణ పథకానికి శ్రీకారం చుట్టింది. అదే.. 'క్విక్ పే హోమ్ లోన్'. ఈ పథకం ప్రత్యేకత ఏమిటో తెలుసా?


ఇది సాధారణ గృహరుణ పథకానికెంతో భిన్నమైనది. రుణగ్రహీతలు ప్రతినెల గృహరుణాన్ని స్థిరంగా కట్టాల్సిన అవసరముండదు. కాకపోతే, ఈ పథకాన్ని ఎంచుకుంటే, తొలుత కట్టే రుణమొత్తం అధికంగా ఉంటుంది. మనం చెల్లించే రుణంలో అసలు (ప్రిన్సిపల్) స్థిరంగానే ఉంటుంది. వడ్డీ మాత్రం మారుతుంది. రుణాన్ని కాస్త త్వరగా చెల్లించాలనుకునేవారు వడ్డీని అధికంగా చెల్లించేందుకు బ్యాంకు ఈ పథకంలో అంగీకరిస్తుంది. రుణగ్రహీతలు చేసే చెల్లింపుల్ని బట్టి ఈ మొత్తం తగ్గుతూ ఉంటుంది. ఉదాహరణకు, సాధారణ గృహరుణం విధానంలో రూ.50 లక్షలు తీసుకుంటే, 9 శాతం వడ్డీ చొప్పున ఇరవై ఏండ్ల వ్యవధిని ఎంచుకుంటే.. మొదటి వాయిదా రూ.44,986 కట్టాల్సి ఉంటుంది. ఇందులో వడ్డీ రూపంలో దాదాపు రూ.37,500 చెల్లించాల్సి వస్తుంది. అంటే, కేవలం రూ.7,486 మాత్రమే అసలుగా బ్యాంకు లెక్కిస్తుంది. ఇక, రెండో వాయిదాను, మొదటి ఈఎంఐ కట్టిన తర్వాత తగ్గే మొత్తంపై లెక్కిస్తుంది. అదే, క్విక్‌పే లోన్ విషయానికొస్తే.. ముందే చెప్పుకున్నట్లు, నెలసరి వాయిదా మొత్తాలన్నీ ఒకేలా ఉండవు. రూ. 50 లక్షల రుణంపై మొదటి ఈఎంఐ రూ.58,333 చెల్లించాల్సి వస్తుంది. ఇందులో వడ్డీ రూ.37,500 కాగా, అసలు రూ.20,833గా లెక్కిస్తారు. సాధారణ గృహరుణంపై అసలు కట్టింది రూ.7,486 మాత్రమేనని గుర్తుంచుకోండి. సాధారణ గృహరుణంలో ఇరవై ఏండ్లు చెల్లించే సరికి చివరికి రూ.1.08 కోట్లుగా లెక్కతేలుతుంది. అంటే, వడ్డీయే కేవలం రూ.58 లక్షలు అవుతుంది. అదే క్విక్‌పే విధానంలో అయితే చివరికి చెల్లించేది రూ.95.2 లక్షలే. వడ్డీ రూ.45.2 లక్షలే అవుతుంది. కాకపోతే, క్విక్‌పేలో వడ్డీ 15 నుంచి 20 బేసిస్ పాయింట్లు అధికంగా ఉంటుందని గుర్తుంచుకోండి. కొందరు కేవలం తొమ్మిది నుంచి పదేండ్లలో గృహరుణాన్ని చెల్లించడానికి ప్రయత్నిస్తుంటారు. ఏడాదికి రూ.3 లక్షలు చొప్పున ప్రీ పేమెంట్‌ను చేస్తే.. చివరికి రూ.86 లక్షలు అవుతుంది. అదే ఐదో ఏట నుంచి నాలుగు లక్షలు చొప్పున చెల్లిస్తే.. చివరికీ రూ. 83 లక్షలు కట్టాల్సి ఉంటుంది. ముందస్తు చెల్లింపులపై రుసుము కట్టక్కర్లేదని గుర్తుంచుకోండి.

బాత్ రూం టైల్స్ భలే గిరాకీ..



ఇంటి నిర్మాణంలో టైల్స్‌కి ఉన్న ప్రత్యేకత అందరికి తెలిసిందే. ఆదనపు హంగులను అద్దితే..ఇంటి అందం ద్విగుణీకృతం అవుతుంది. దీనికి అనుగుణంగా మార్కెట్‌లో ఆధునిక టైల్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రతి గదికో ప్రత్యేక టైల్స్ అన్నట్టుగానే.. బాత్‌రూములను మరింత అందంగా చేసే రకాలు లభిస్తున్నాయి. భారత్‌లో బాత్‌రూం టైల్స్‌కి డిమాండ్ పెరుగుతోందని ఇటీవల ఒక ప్రైవేటు కంపెనీ జరిపిన సర్వేలో వెల్లడైంది. దీనికి కారణం కూడా చెప్పింది. పరిశుభ్రత విషయంలో భారతీయుల్లో జాగ్రత్త పెరిగిందని, అందుకే పరిశుభ్రత సదుపాయాలు కల్పించుకునేందుకు ఖర్చుకు వెనకాడటం లేదని తెలిపింది. ఇందులో భాగంగా బాత్‌రూం, టాయ్‌లెట్స్‌లో నాణ్యమైన టైల్స్ వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని స్పష్టం చేసింది. బ్యాక్టీరియా, ఇతర క్రిములను నిరోధించే నానోటెక్నాలజీ ద్వారా తయారైన టైల్స్ ఈ రంగంలో కొత్త మార్పునకు నాంది పలుకుతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ తరహా టైళ్లను.. దవాఖానాలు, ఆస్పత్రులు, ప్రయోగశాలలు, ఆహార పదార్థాల శుద్ధీకరణ ప్లాంట్లలో వినియోగిస్తున్నారని, నూతన హంగులతో ఇంట్లో సైతం ఇలాంటి టైల్స్ వేసుకునే రోజులు ముందున్నట్లు వెల్లడించింది. 2017 నాటికి భారత బాత్‌రూం టైల్స్ వ్యాపారం 5,945 మిలియన్ డాలర్లు జరిగిందని, 2023 నాటికి 10,480 మిలియన్ డాలర్లకు చేరుతుందని స్పష్టం చేసింది.

ఇండియన్-2 ప్రారంభం


'ఇండియన్-2' చిత్రంలో కమల్‌హాసన్

అవినీతి, లంచగొండితనం మీద పోరాడే ఓ స్వాతంత్ర్య సమరయోధుడి ఇతివృత్తంతో తెరకెక్కిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') చిత్రం ఎంతటి సంచలనాల్ని సృష్టించిందో అందరికి తెలిసిందే. కమల్‌హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా కమల్‌హాసన్-శంకర్ కాంబినేషన్‌లో రూపొందిస్తున్న 'ఇండియన్-2' శుక్రవారం చెన్నైలో ప్రారంభమైంది. కాజల్ అగర్వాల్ కథానాయిక. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను కథానాయిక కాజల్ అగర్వాల్ ట్విట్టర్ ద్వారా పంచుకుంది. ప్రారంభోత్సవ వేడుకలో కమల్‌హాసన్ ఖాకీ దుస్తులు ధరించి కనిపించడం విశేషం. ఈ సినిమాకు సంబంధించిన వివిధ పోస్టర్లను చిత్ర బృందం విడుదల చేసింది. 'ఓల్డర్, వైసర్, డెడ్లియర్' (వృద్ధుడు, జ్ఞానవంతుడు, ప్రమాదకారి) అనే క్యాప్షన్‌తో ఫొటోలు అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

మహాలక్ష్మి విదేశీయాత్ర


తమన్నా

'మహాలక్ష్మి పల్లెటూరి యువతి. పెద్దల అంగీకారంతో ప్రియుడి తోడుగా ఏడడుగులు వేయాలని కలలు కంటుంది. కాబోయే భర్తతో కలిసి హనీమూన్‌కు పారిస్ వెళ్లాలన్నది ఆమె కోరిక. కానీ పీటల మీద పెళ్లి ఆగిపోవడంతో మహాలక్ష్మి ఒంటరిగా పారిస్‌కు పయనం అవుతుంది. అక్కడ ఆమెకు ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి? ఈ ప్రయాణంలో ఆమె అవగతం చేసుకున్న జీవిత సత్యాలేమిటో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నది తమన్నా. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'దటీజ్ మహాలక్ష్మి'. టైజాన్ ఖొరాకివాలా సమర్పణలో మను కుమరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాత మాట్లాడుతూ 'సాధారణ యువతి అసాధారణ మహిళగా ఎలా మారిందనే స్ఫూర్తిదాయక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. తమన్నా అభినయం, పాత్రచిత్రణ, అమిత్ త్రివేది సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం. త్వరలో విడుదల తేదీని వెల్లడిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మైఖేల్ టబ్యూరియస్, ఎడిటింగ్: గౌతమ్‌రాజు.

రొమాంటిక్ హారర్ థ్రిల్లర్!


శైలజ, సమీర్‌ఖాన్

సమీర్‌ఖాన్, శైలజ, సునీత పాండే, అక్షత, ఆశిరాయ్, శ్రద్ధ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కెఎస్ 100'. షేర్ దర్శకత్వం వహించారు. వెంకట్‌రామ్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్‌ను సాయివెంకట్, మల్టీడైమెన్షన్ వాసు, అట్లూరి రామకృష్ణ సంయుక్తంగా విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'రొమాంటిక్ హారర్ థ్రిల్లర్ ఇది. సినిమా అనుకున్నదానికన్నా బాగా వచ్చింది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'నేటి తరం అమ్మాయిలు ఏవిధంగా ఫాస్ట్‌కల్చర్‌కు అలవాటుపడుతున్నారు అనే అంశాన్ని ప్రధానాంశంగా తీసుకుని తెరకెక్కిస్తున్న చిత్రమిది' అన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, సునీత పాండే, అక్షత, ఆశిరాయ్, శ్రద్ధ, నవనీత్ చారి తదితరులు పాల్గొన్నారు.

కర్ణిసేనకు కంగన హెచ్చరిక!


కంగనరనౌత్

బాలీవుడ్ కథానాయిక కంగన రనౌత్ కర్ణిసేనను హెచ్చరించింది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మణికర్ణిక': 'ది క్వీన్ ఆఫ్ ఝూన్సీ'. క్రిష్‌తో పాటు కంగనరనౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే ఈ చిత్ర విడుదలను నిలిపివేయాలంటూ మహారాష్ట్రకు చెందిన కర్ణిసేన గత కొన్ని రోజులుగా చిత్ర బృందాన్ని హెచ్చరిస్తూ వస్తోంది. సినిమాలో లక్ష్మీబాయ్ బ్రిటీష్ వ్యక్తి ప్రేమలో పడినట్లు చూపించారని, ఆ సన్నివేశాల్ని తొలగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని, తాజాగా మరోసారి చిత్ర బృందాన్ని కర్ణిసేన హెచ్చరించడం కంగనరనౌత్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది. ''మణికర్ణి'క చిత్రానికి నలుగురు చరిత్రకారులు ఆమోదం తెలిపారు. సెన్సార్ బోర్డు కూడా సర్టిఫికెట్ జారీ చేసింది. ఇప్పటికీ కర్ణిసేన ఆందోళనలు ఆపకపోతే నేను కూడా వారిలాగే ప్రవర్తించాల్సి వుంటుంది. నేనూ రాజ్‌పుత్‌నే. వారందరినీ నాశనం చేస్తాను' అని ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది కంగనారనౌత్.

ఎన్టీఆర్ సజీవుడై తిరిగొస్తే..


'లక్ష్మీస్ ఎన్టీఆర్'లో ఓ దృశ్యం

రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'లక్ష్మీస్ ఎన్టీఆర్'. దివంగత ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించిన తర్వాత చోటుచేసుకున్న ముఖ్యమైన పరిణామాలు, ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కావడానికి దారితీసిన పరిస్థితుల్ని ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. లక్ష్మీపార్వతి పాత్రలో కన్నడ నటి యజ్ఞ శెట్టి నటిస్తున్నది. ఆనాటి ఎన్టీఆర్ సన్నిహితులు, ఆయన ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారులు, ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తుల ద్వారా సేకరించిన విస్తృత సమాచారంతో రామ్‌గోపాల్‌వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శుక్రవారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా సినిమాలోని ఎన్టీఆర్ పాత్రధారి ఫస్ట్‌లుక్ టీజర్‌ను ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ. 'వెన్నుపోటు ద్వారా చంపబడ్డ ఎన్టీఆర్ తిరిగి 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రం ద్వారా మీముందుకు సజీవంగా రాబోతున్నాడు' అంటూ వర్మ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. ఫస్ట్‌లుక్ టీజర్‌లో కనులు మూసుకొని దీర్ఘాలోచనలో ఉన్న ఎన్టీఆర్ మెల్లగా తలపైకెత్తి విషణ్ణ వదనంతో తదేకంగా చూస్తున్నారు. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు రామ్‌గోపాల్‌వర్మ సన్నాహాలు చేస్తున్నారు.